

# వైయస్సార్ ఛాయలో...

## జి.వల్లీశ్వర్

ఎమెస్కో

**YSR Chayalo... (In the company of YSR)**
**G. Valliswar**

**వైయస్సార్ ఛాయలో...**
**జి.వల్లీశ్వర్**

సంపాదకులు : **డా॥ డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ : **సెప్టెంబరు, 2019**

మూల్యం : రూ. **75/-**

ISBN: 978-93-88492-47-8

టైటిల్ డిజైన్: **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ -500 029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
**ఎమెస్కో బుక్స్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520 004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com

# నేను విన్న కబుర్లు మీకోసం..

ఆత్మీయుడు శ్రీ వల్లీశ్వర్ గత 2 దశాబ్దాలుగా నాకు అత్యంత సన్నిహితుడు. ఆయన నిరంతరం తన పాత్రికేయ జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ, ఉద్యోగ జీవితంలోనూ ఎదురైన అనుభవాలను నాతో పంచుకోవడం ఓ నిరంతర కార్యక్రమం.

ఆయన చెప్పే పద్ధతిలో ఓ విశిష్టత ఉంది. మనముందు సంఘటన జరుగుతున్నట్లు ఆ సంఘటనాస్థలంలో మనం కూడా ఉన్న భావన కలిగేట్లు చెప్పడం ఆయన భావప్రసార శైలి. ఈ విషయం గమనించి ఆయన్ను రచయితగా మారమని ప్రేరేపిస్తున్నవాళ్ళలో నేనూ ఒకడిని. ఎంతవరకు నిజమైనప్పటికీ మా విజయకుమార్ మూలంగానే తను రచయితగా మారానని చెప్తుంటారాయన. నాకు భలే సంతోషం వేస్తుంది.

ఈ మధ్య మిత్రుడు శ్రీ ఉండవల్లి  అరుణకుమార్ 'వైయస్సార్‌తో నేను' శీర్షికన తన అనుభవాలను అక్షరీకరించడం, దానిని నేను ప్రచురించడం జరిగింది. ఆ సందర్భంలో శ్రీ వల్లీశ్వర్, రాజశేఖర రెడ్డిగారితో  తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అనేక విషయాలు చెప్పారు. అవన్నీ నేను వివిధ సందర్భాల్లో విని వున్నవే. ఎప్పట్లానే "ఇవన్నీ రాయవచ్చుకదా" అని ఆయన్ని అడిగాను. దాని ప్రతిఫలమే ఈ చిన్న పుస్తకం.

ఈ పుస్తకం తీసుకొచ్చినందుకు మిత్రులు వల్లీశ్వర్ గారికి కృతజ్ఞతలు.

(ఎమెస్కో విజయకుమార్)

# సాహో వల్లీశ్వర్

'వైయస్సార్ ఛాయలో...' పుస్తకాన్ని ఒక విమర్శకుడిగా నేను ఆసాంతం విశ్లేషణాత్మకదృష్టితో చదివాను.

వల్లీశ్వర్‌కు వార్తాంశాన్ని గాలం వేసి చటుక్కున పట్టగల ఒడుపు వుంది. తెలుగు ఇంగ్లీషుల్లో మనస్సుకు హత్తుకునేలా రాయగల కలం బలం వుంది. భజనపాటల రొటీన్లకు భిన్నంగా కొత్తగా ఆలోచించగల సృజన వుంది. తాను మంచి అనుకున్నది నిర్భయంగా – పర్యవసానాలకు వెరవకుండా – చెప్పగల తెగువ వుంది. జననేత ప్రతిష్ఠే తన విద్యుక్త ధర్మంగా శిరస్సుకెత్తుకున్న అంకితభావం వుంది.

ఇక, వైయస్సార్‌కి తన టీమ్‌లోని వారి బలాబలాలను కాచివడపోయగల ప్రజ్ఞ వుంది. "వీళ్ళా నాకు చెప్పేది?" అని కాకుండా, "వాళ్ళేం చెబుతున్నారో" అని తెలుసుకోవాలన్న అరమరికలు లేని, పసివాడని ఉత్సుకత వుంది. ఎదుటివారి చొరవపై నీళ్ళు చల్లకుండా ప్రోత్సహించే మంచి గుణముంది.

సమర్థుడైన నేత ఛత్రఛాయలో చొరవ, చురుకుదనం, చిత్తశుద్ధిగల ప్రజా సంబంధాల అధికారిగా మనసుపెట్టి పనిచేస్తే ఎన్నో మంచి పనులు చేయవచ్చని తెలియజేస్తుందీ పుస్తకం.

ఇటు ప్రజా హృదయాధినేతలుగా ఎదగాలనుకున్నవారికి, అటు ప్రజా సంబంధాల క్షేత్రంలో కమ్యూనికేటర్లగా పనిచేస్తున్నవారికి అక్షరాలా అనుభవాలతో వెలుగుదారులను పరుస్తుందీ పుస్తకం.

ఒక్క మాటలో చెప్పాలంటే .... ప్రజా సంబంధాల క్షేత్రంలో అపురూప అనుభవాల కదంబం. రేపటి తరాలకూ నిలిచి వెలిగే దారి దీపం ఈ 'వైయస్సార్ ఛాయలో...'

**డాక్టర్ గోవిందరాజు చక్రధర్**
chakradhargovindaraju@gmail.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMET
(RAJYA SABHA)

सत्यमेव जयते

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

# ఒక దర్పణం

1990 లో న్యూ ఢిల్లీ లో రాజశేఖర రెడ్డి తో కలసి వల్లీశ్వర్ ఇంటికి వెళ్ళినప్పటి నుంచి అతను నాకు బాగా తెలుసు. కొన్ని ప్రమాణాలకు కట్టుబడి పనిచేసే జర్నలిస్ట్.

అందుకే 2004 లో రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యాక వల్లీశ్వర్ ను CPRO గా తీసుకొన్నాం. అతను CM ఆఫీసు లో ఉన్నా, "ఆంధ్ర ప్రదేశ్" పత్రిక ఛీఫ్ ఎడిటర్ గా ఉన్నా, రాజశేఖర రెడ్డి గారి ప్రతిష్ఠ పెంచడం కోసం చిత్తశుద్ధితో పనిచేయడం నేను స్వానుభవంతో చూశాను. తనకున్న పరిధిలో అతను ఎలాంటి మంచి పనులు చేయగలిగాడు అన్నదానికి దర్పణం ఈ పుస్తకం. ఇందులో రాజశేఖర రెడ్డి గారి వ్యక్తిత్వం లోని విశిష్ఠ లక్షణాలు కూడా ఆయా సంఘటనల కథనాల్లో ప్రతిఫలిస్తాయి.

వల్లీశ్వర్ మంచి "Penman" అని రాజశేఖర రెడ్డి గారు తరచూ అంటూ ఉండేవారు. ఆ రచనా నైపుణ్యం, అతని నిజాయతీ, రాజశేఖర రెడ్డి గారంటే వ్యక్తి గాను, CM గాను ఆయనకు ఉన్న గౌరవం, పనిపట్ల తనకున్న అంకితభావం ఈ పుస్తకంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆ రోజుల్లో జరిగిన కొన్ని చారిత్రాత్మక సంఘటనలకు వల్లీశ్వర్ ప్రత్యక్ష సాక్షి. ఆ సంఘటనలను, అనుభవాలను గుర్తుంచుకొని పుస్తక రూపంలో తీసుకురావాలనే ఆలోచన చేసినందుకు వల్లీశ్వర్ కు నా హృదయ పూర్వక అభినందనలు.

ఇలాంటి మంచి పుస్తకాన్ని ప్రచురిస్తున్న ఎమెస్కో విజయకుమార్ కు ప్రత్యేక అభినందనలు.

కె. వి. పి. రామచంద్ర రావు.

26-8-2019
హైదరాబాద్

(డా. కె.వి.పి.రామచంద్ర రావు)

**Dr. K. V. Ramanachary**, IAS (Retd.)
Advisor to Govt. of Telangana,
Secretariat, Hyderabad - 500 004

# నా 'నుడి'

ఏ ముహూర్తంలో పరిచయమయ్యాడోకానీ, ఆనాటినుంచి వల్లీశ్వర్‌లో నాకో అన్నయ్య కన్పించాడు.... మనిషి ఎంత సాధువుగా కన్పిస్తాడో అంత పరుషం కూడా. మాట్లాడ్డంలో ఎంత నిర్మొహమాటమో నిజం చెప్పడంలో అంత కర్కశం కూడ. నిజం నిష్ఠూరంలా వుంటుందని అంటారు. కాని దాన్ని వ్యక్తీకరించడంలో వుంది మర్మమంతా. ఆరకంగా వల్లీశ్వర్ మర్మజ్ఞుడు.

డా.వైయస్ రాజశేఖర రెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నకాలంలో శారీరకంగా వల్లీశ్వర్ ఎత్తరిగాకున్నా అందీ అందనంత ఎత్తులో వుండేవాడు అందరికీ. ఎందుకంటే ఆయన మేనంతా ఎత్తుకు పై ఎత్తులే. అవన్నీ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచడానికీ, ప్రభుత్వాధినేత మంచితనాన్ని పంచడానికిన్నూ. వల్లీశ్వర్ మంచి మాటకారి. హితకారి కూడా. అందుకే ఆరోజుల్లో ఆయనతోపాటు వున్న నాలాంటి వారికంతా ప్రభుత్వమన్నా, ఉద్యోగమన్నా నల్లేరుపై నడకే. ఎంత మంచి రోజులో!!

గళం బలం కంటే కలం విలువ బాగా తెల్సినవాడు వల్లీశ్వర్. డా. వైయస్సార్ 'ఆ రెండు పత్రిక'లంటూ వాటిని ఎంత దూరం పెట్టాలనుకొన్నా, ఆ రెండు పత్రికల్లో ఆరోజుల్లో డా. వైయస్సార్ గురించి వచ్చిన వార్తలన్నింటిలో పాజిటివ్ వైబ్రేషన్సే. దానికి నిదర్శనం : ఈనాడు - ఆదివారం నాటి - దినపత్రికలో ఫ్రంట్ పేజీలో పతాక శీర్షిక 'మనసంతా మీరే'. అది చూసి అందరమూ ఆశ్చర్యపోయాం... ఆనందపడ్డాం... అదీ వల్లీశ్వర్ రచనా చణత. ధిషణాధిక్యత. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రధాన ప్రజా సంబంధాల అధికారిగా పనిచేసినంతకాలం ప్రజలతోకంటే ముఖ్యమంత్రితో వున్న సంబంధమే ఆయనకు పెట్టనికోటలా నిలిచింది. ఇప్పటికీ అది ఆయనకొక కీర్తికిరీటమే.

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక ఒక ప్రభుత్వ పత్రికలా కాక, ఒక సారస్వత పత్రికలా అందరి మన్ననలనందుకొన్నదంటే దానిక్కారణం - దాని సంపాదకుడిగా వ్యవహరించిన వల్లీశ్వర్ ప్రభ! ప్రతిభ! ప్రతిభాప్రభ!! ఒక ముఖ్యమంత్రి జీవనయానాన్ని ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ప్రచురించినంతకాలం తెలుగువారే కాదు, ప్రపంచంలోని డా. వైయస్సార్ అభిమానులంతా

ఆనందించిన సందర్భం మర్చిపోలేం. అలాంటివెన్నో ఆనందకర సందర్భాల్ని సృష్టించడం వల్లీశ్వర్‌కే చేతనైంది.

అలా వల్లీశ్వర్ రాతల్నీ, చేతల్నీ కళ్ళారా చూసిన నేను... మళ్ళీ పదేళ్ళ తర్వాత ఇప్పుడు ‘వైయస్సార్ ఛాయలో...’ వల్లీశ్వర్‌ను చదివాను. పుస్తకం మొదలుపెట్టాక చివరిదాకా చదివించేలా రాశాడు. ఇంకేంచెప్పను!

ఈ వల్లీశ్వరుడికి శ్రీవల్లీశ్వరుడి ఆశీఃఫలం ఎల్లవేళలా మెండుగా వుండాలని కోరుకుంటూ -

శుభాకాంక్షలతో-



**K. Prabhakara Reddy,** IAS (Retd.)
Road No. 10, Banjara Hills,
Hyderabad - 500 034.

# నా దృష్టిలో....

ఈ పుస్తకంలో వల్లీశ్వర్ రాసినట్లుగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు ఎలాంటి అస్తిత్వం వుండదు. వాళ్లు ఎంత మంచి పని చేసినా ఆ ఖ్యాతి అంతా సిఎంకే దక్కుతుంది. అందుకు ఇష్టపడే నాలాంటి వాళ్లం అక్కడ పని చేశాం.

బిట్స్ (పిలాని) క్యాంపస్ ఇవ్వటానికి కె.కె. బిర్లా గారు తన నిస్సహాయత వ్యక్తం చేశాక, దాన్ని సాధించటంలో వల్లీశ్వర్ writing skills ఉపయోగపడ్డాయనటంలో ఎలాంటి సందేహం లేదు. అలా చాలా సందర్భాల్లో నేను ఆయన రచనా నైపుణ్యాన్ని సిఎం ప్రతిష్ఠ కోసం ఉపయోగించటం జరిగింది.

సిఎం కార్యాలయంలోఎప్పుడూ ఉరుకులు పరుగుల మీద ఎలా పనిచేయాల్సి వచ్చిందో వల్లీశ్వర్ బాగా వర్ణించారు. చదవడం మొదలు పెట్టాక చివరి దాకా ఆపకుండా చదివేలా చేశారు. సిఎం ఆఫీస్ అంటేనే పరుగెత్తడం...

ఒకసారి ఆంధ్రప్రదేశ్‌కి 'ఐఐటి'ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అప్పుడు ఉదయం 10 గంటలు. మరో అర్ధగంటలో అసెంబ్లీలో ఈ 'ఐఐటి' గురించి ప్రకటించాలి. దాన్ని బాసరలోకాక మెదక్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తాను ప్రకటిస్తానని, అందుకు సమర్థనీయమైన ప్రకటనా పాఠం తయారు చేయాలని సిఎం నన్ను కోరారు.

ఐఐటిని బాసరలో కాక మెదక్‌లో పెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న సమయంలో సిఎం కోరుకున్న సమర్థనని లోపరహితంగా 30 నిమిషాల్లో ఎలా తయారు చేయాలి?... అక్కడ పరుగులు, పరీక్షలు ఇలాగే వస్తాయి.

అలాగే అమెరికన్ కన్సులేట్‌కి భవనం ఎంపిక విషయంలో, సానియా మీర్జా తన ర్యాంకింగ్ పెంచుకోవటం కోసం అంతర్జాతీయ టోర్నమెంట్స్‌కి వెళ్ళటానికి లక్షల్లో ఆర్థిక సాయం కోరినప్పుడు, అతి తక్కువ సమయంలో ముఖ్యమంత్రి – నేను కలెక్టరుగా వున్న కృష్ణా జిల్లాలో – రాజీవ్ పల్లెబాట ప్రారంభానికి వచ్చినప్పుడు... అలాంటి ప్రతి

సందర్భమూ ఒక పరీక్షగానే వుండేది. ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన కాలమంతా పరీక్షలమయమే.

2005 నంది నాటకోత్సవాల విషయంలో వల్లీశ్వర్ ఈ పుస్తకంలో ప్రస్తావించిన నేపథ్యం ఆసక్తికరమైంది. మొదటి సారిగా హైదరాబాద్‌కి బయట జరిగిన ఆ నందినాటకోత్సవాలని జిల్లా కలక్టరుగా నేను, ఎఫ్.డి.సి మేనేజింగ్ డైరక్టరుగా రమణాచారి కలిసి విజయవంతంగా నిర్వహించాం. ప్రభుత్వానికి చాలా మంచి పేరుని ఆ నాటకోత్సవాలు తీసుకొచ్చాయి.

ముఖ్యమంత్రి ప్రతిష్ఠని దృష్టిలో పెట్టుకుని పనిచేయడంలో వల్లీశ్వర్ చాలా అంకితభావంతో పనిచేశారు. నాలుగు సంవత్సరాలపాటు మేం కలిసి పనిచేశాం. ముఖ్యమంత్రి కార్యాలయ విజయం వెనకాల ఎంత మంది ఎన్ని రకాలుగా పనిచేయాల్సి వుంటుందో తెలియాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే.

27-8-2019
హైదరాబాద్

(కె.ప్రభాకర రెడ్డి)

# వైయస్సార్ ఛాయలో.... ఒకడు ఏం చేయగలడు?

**1983 మార్చి నెలలో....**

అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారికి పౌరసంబంధాల అధికారిగా పనిచేసే ఆఫర్ వచ్చింది.

అప్పటికి రెండు మాసాల క్రితమే కాంగ్రెసు పార్టీకి రాజీనామా చేసి, 'తెలుగుదేశం' పార్టీలో చేరారు మాజీమంత్రి, చంద్రగిరి మాజీ శాసనసభ్యులు, ఎన్.టి.రామారావు అల్లుడు చంద్రబాబు నాయుడు. అయితే అప్పటికే తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్‌తో వున్న ఒక నాయకుడి నుంచి ఎదురైన అభ్యంతరాలవల్ల ఆయన బాహాటంగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనటం లేదు. అయినా, ముఖ్యమంత్రికి సమీపంలో వుంటూనే, తెరవెనుక నుంచి రాజకీయాలు నడుపుతున్నారు. (1981-85 కాలంలో నేను తిరుపతిలో 'ఈనాడు' స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాను) ఆ దశలో నన్ను ముఖ్యమంత్రికి పౌరసంబంధాల అధికారిగా రమ్మంటూ జయచంద్ర నాయుడు ద్వారా బాబు కబురు చేశారు.

చిత్తూరు జిల్లాలో పిచ్చాటూరు మండలానికి చెందిన జయచంద్రనాయుడు అప్పట్లో చంద్రబాబు నాయుడుకి కుడిభుజంగా వుండేవారు. (2007-12లో శాసనమండలి సభ్యులుగా వున్నారు) జయచంద్ర ఒక వారం రోజుల పాటు నన్ను ఒప్పించే ప్రయత్నం చేశారు. నాకు జర్నలిజం మీద వున్న ప్రేమ, 'ఈనాడు' లో లభిస్తున్న వృత్తిపరమైన సంతృప్తి కారణంగా ఆ ఆఫర్‌ని అంగీకరించలేకపోయాను. చంద్రబాబు నాయుడు గారికి ఫోన్‌లో చెప్పేశాను - "నాకు ఆసక్తి లేదు" అని.

విశాఖపట్టణంలో ఐదేళ్లు చేశాక, 1990-95 కాలంలో 'ఈనాడు' ప్రతినిధిగా ఢిల్లీలో పనిచేశాను. ఆ రోజుల్లో అన్ని పార్టీల ఆంధ్రప్రాంత నాయకులతో పరిచయాలు పెంచుకునే ఉద్దేశ్యంతో, వీలు ప్రకారం వాళ్లని మా ఇంటికి 'టీ'కని, అల్పాహారానికని ఆహ్వానించేవాణ్ణి. అలా మొదటిసారి నేను పిలిచిన పార్లమెంటు సభ్యుడు డాక్టర్ వైయస్సార్. తన భార్య విజయలక్ష్మి, ఆత్మబంధు డాక్టర్ కె.వి.పి రామచంద్రరావుతో కలిసి వైయస్సార్ మా ఇంటికి ఓ ఉదయం అల్పాహారానికి వచ్చారు. వృత్తిపరంగా నాకు అన్ని పార్టీల నాయకులూ ఒకటే.

26 సంవత్సరాలపాటు 'ఈనాడు, న్యూస్ టైమ్'లలో రిపోర్టింగ్‌లో పనిచేసి, 2003 చివర్లో యాజమాన్యం ఇచ్చిన స్వచ్ఛంద పదవీవిరమణ ఆఫర్ ఉపయోగించుకుని బయటకు వచ్చేశాను. 2004 మే నెలలో ఒక రోజు నా మిత్రులు, దూరదర్శన్ డైరక్టర్ (న్యూస్) ఆర్.వి.వి. కృష్ణారావు నాకో సలహా ఇచ్చారు. "మీరు వైయస్సార్‌కి CPROగా వెళ్తే బాగుంటుంది కదా!" అవునా! ఆలోచించాను. 1983లో చంద్రబాబునాయుడు గారి నుండి నాకు వచ్చిన ఆఫర్ గురించి, అప్పట్లో ఆ ఆఫర్ నేను స్వీకరించలేని పరిస్థితి గురించి కృష్ణారావుగారిముందు ప్రస్తావించాను. "మీకు 30–32 ఏళ్ళ వయస్సులో మీరు జర్నలిజం వదులుకుని వెళ్లకూడదనుకోవడంలో అసహజం లేదు. ఈ 22 ఏళ్లలో విశాఖపట్టణం, ఢిల్లీ, హైదరాబాద్‌లలో పనిచేశారు. అనుభవం పెరిగింది కదా! ప్రయత్నం చేయండి. మిగతాది తిరుమల శ్రీనివాసుడు చూసుకుంటాడు" అన్నారు కృష్ణారావు.

**2004 మే 27.....**

జర్నలిస్టు మిత్రుడు మోతడక సుధాకర్ చొరవవల్ల, ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డికి ఛీఫ్ పి.ఆర్.ఓ గా రమ్మని నాకు ఆఫర్ వచ్చింది. ఆ సాయంత్రం వైయస్సార్ ఆత్మబంధువు కె.వి.పి రామచంద్రరావు నాకు ఫోన్ చేశారు. లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌కి పిలిచి చెప్పారు – "మీరు సిఎంకి ఛీఫ్ పి.ఆర్.ఓ. గా వస్తున్నారు." అలా 2004 జూన్ 2 నుంచి వైయస్సార్ చివరి రోజు దాకా – నేను సిఎం కార్యాలయంలో పనిచేసినా, 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక సంపాదకుడిగా పని చేసినా – ముఖ్యమంత్రి ప్రతిష్ఠని, తద్వారా ప్రభుత్వప్రతిష్ఠని ఇనుమడింపజేయడానికే కృషి చేశాను. ఆ ప్రయత్నంలో అనేక పరిణామాలు నాకు వృత్తిపరమైన సంతృప్తిని, ముఖ్యమంత్రి ప్రేమాభిమానాల్ని అందించాయి.

ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులంతా ముఖ్యమంత్రి ఛాయలో ఆయన ప్రతినిధులుగా పనిచేసే వాళ్ళే. అంతకుమించిన అస్తిత్వం వాళ్ళకి వుండదు. వాళ్ళు ఏం చేసినా – మంచి గాని, చెడుగాని – అది ముఖ్యమంత్రి ప్రతిష్ఠ మీద ప్రతిఫలిస్తుంది.

ఈ స్పృహతో వైయస్సార్ కోసం ఆయన చివరి రోజు వరకు నేను చేసిన ఆలోచనలు, పనులు నాకు సంతృప్తి నిచ్చాయి. ఒక వందకుపైగా – సిఎం ప్రసంగాలు కానీ (కలెక్టర్ల సమావేశాలు సహా), సందేశాలు కానీ, ఇంటర్వ్యూలు కానీ రాసి వుంటాను. సిఎంకి సంబంధించిన గోప్యమైన లేఖలు కొన్ని డజన్లు రాసి వుంటాను. చాలా సందర్భాలలో నేను ఇచ్చిన సలహాలని వాటి ప్రయోజనాన్ని బట్టి ఆయన పాటించి వుంటారు. సిఎంకి ఏది ఇష్టమో అని కాక, సిఎంకి ఏది మంచిదో, రాష్ట్రానికి ఏది మంచిదో అది చెప్పడమే

నా పని. తుది నిర్ణయం ఆయనదే. డాక్టర్ వైయస్సార్ కనుమరుగై 2019 సెప్టెంబర్ 2 నాటికి పదేళ్లు!

విజ్ఞత, సంస్కారం, సమర్థత కలిగిన నాయకుడి ఛాయలో పని చేసే వాళ్లకి ఎన్నో మంచి పనులు చేసే అవకాశం వుంటుంది. అలా 'ముఖ్యమంత్రికి ప్రధాన పౌరసంబంధాల అధికారి'గా, అనధికార మీడియా సలహాదారుగా నాకు లభించిన చిన్న అవకాశం వల్ల నాకు కలిగిన అనుభవాల్ని నలుగురితో పంచుకోవాలన్న కోరిక రూపం ఈ చిరు పుస్తకం 'వైయస్సార్ ఛాయలో.....'

తమ అర్థవంతమైన సూచనలతో నా ఈ రచనను సుసంపన్నం చేసిన సోదరి కానూరి శ్రీదేవికి, నిష్పాక్షిక విమర్శకుడు, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ గోవిందరాజు చక్రధర్‌కి, పుస్తకాన్ని అందంగా రూపొందించిన పురుషోత్ కుమార్‌కి కృతజ్ఞతలు.

నాకు ప్రాతఃస్మరణీయులైన స్వాతంత్ర్య సమరయోధుడు, శరవణోపాసకుడు నా తండ్రి గుండు వేంకట కృష్ణమూర్తి, 103 సంవత్సరాల జీవితాన్ని అర్థవంతంగా, పరిపూర్ణ ఆరోగ్యంతో గడిపిన నా తల్లి లక్ష్మీ నరసమ్మ ల దివ్య ఆశీస్సులను కోరుతూ...

నాకు స్ఫూర్తినిస్తున్న అన్నదమ్ములు సుబ్రహ్మణ్యదీక్షితులు, వాసుకి శర్మ, ఆదిశేషావతారం, నా అర్ధాంగి లలితకుమారి లకు ధన్యవాదాలతో...




(జి. వల్లీశ్వర్)

9440446444

valliswarg@gmail.com

# విషయక్రమం


| | |
|---|---|
| 1. 10 రోజులైనా తిరక్కుండా విషమ పరీక్ష | 15 |
| 2. కరణ్‌థాపర్‌తో ఇంటర్వ్యూకి ముందు.... | 19 |
| 3. వైయస్సార్‌పై EPW వ్యాఖ్య! | 22 |
| 4. పని చేసిన నా 'త్రిముఖ వ్యూహం' | 24 |
| 5. అదొక చరిత్రాత్మక ఘట్టం | 27 |
| 6. సిఎం కోసం 'చేయకూడని' పని చేశాను! | 30 |
| 7. సిఎం సెక్రటరీలకి నా మీద కోపం వచ్చింది | 33 |
| 8. పరిటాల రవి హత్య : వైయస్సార్ స్పందన | 35 |
| 9. పి.వి. గారిని ఎక్కడ చూశారంటే..... | 37 |
| 10. చంద్రబాబు నాయుడి తల్లి గురించి వైయస్సార్ | 39 |
| 11. 'సునామీ' అడ్డు తొలగించిన వైయస్సార్ | 41 |
| 12. ఏథెన్స్–వైయస్సార్ | 45 |
| 13. వైయస్సార్ డైరీలో ఒక రోజున....! | 48 |
| 14. ....చెప్పకుండానే చెప్పేసిన వైయస్సార్ | 51 |
| 15. విజయమా? పునరంకితమా? | 55 |
| 16. 'ఈనాడు' మొదటి పేజీలో వైయస్సార్ | 58 |
| 17. సిఎం ఇష్టపడని నా బదిలీ | 64 |
| 18. 'రాను' అన్న బిట్స్ 'వచ్చింది'! | 67 |
| 19. ఇందిర బదులు దుర్గాబాయిని 'ఓకె' అన్నారు | 71 |
| 20. జార్జిబుష్ – వైయస్సార్ – నేను | 75 |
| 21. ప్రత్యక్ష ప్రసారంలో వైయస్సార్ | 78 |
| 22. మీకు ఋణపడివున్నాను : వైయస్సార్ | 80 |

| | |
|---|---|
| 23. వైయస్సార్ హత్తుకున్న క్షణాలు | 82 |
| 24. పొత్తూరి గారి 'న్యాయవిచారణ' లో వైయస్సార్, నేను | 85 |
| 25. తెలుసుకుందాం రండి – మనసు తలుపులు తెరిచి | 88 |
| 26. 'ప్రసంగం' లేదు, ప్రసంగించారు | 90 |
| 27. సంస్కృత భాష కోసం సిఎం | 93 |
| 28. వందెకరాలిచ్చిన 'నిప్పులాంటి నిజం' | 96 |
| 29. అభివృద్ధి వేగం 9% కాదు! | 99 |
| 30. నన్ను డైరక్టర్‌ని చేసి '108' | 101 |
| 31. వైయస్సార్ తిరగరాసిన 'అర్చక' చరిత్ర | 104 |
| 32. వ్యూహరచనలో వైయస్సార్‌తో...... | 108 |
| 33. వైయస్సార్ వెనక్కి వచ్చారు! | 110 |
| 34. 'రచ్చబండ' నుంచి తిరిగొచ్చాక | 112 |
| 35. 'సి' బ్లాకులో చివరి క్షణాల్లో 'ఆంధ్రప్రదేశ్'తో... | 115 |
| 36. వైయస్సార్ నన్ను 'ఏడిపించారు' | 118 |

# 10 రోజులైనా తిరక్కుండా విషమ పరీక్ష

2004 జూన్ 11......

జూన్ 2న నేను ముఖ్యమంత్రికి ప్రధాన పౌరసంబంధాల అధికారిగా బాధ్యత స్వీకరించాను. పదిరోజులు తిరక్కుండానే నాకు ఒక విషమ పరీక్ష ఎదురైంది.

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక మొదటి పేజీలో మూడు కాలాల్లో ప్రస్ఫుటంగా వచ్చిన వార్తవల్ల ఏర్పడిన పరీక్ష అది.

"అస్సాం క్రూడాయిల్ కుంభకోణంలో ఇరుక్కున్న ఒక ఐఏఎస్ అధికారి ఆంధ్రప్రదేశ్ సిఎంకి కార్యదర్శిగా నియామకం...."

ఇదీ ఆ వార్త సారాంశం.

వార్త వచ్చిన రోజు ఉదయం సిఎం కార్యాలయ అధికారుల బ్రీఫింగ్‌లో సిఎం నాకు సీరియస్‌గా చెప్పారు. "ఈ వార్తని ఖండించాలి వల్లీశ్వర్. తీవ్రంగా ఖండించాలి. నేను అస్సాం సిఎంతో మాట్లాడాను. కరెక్ట్ కాదని చెప్పారు. నువ్వు వెంటనే మీడియాకి ప్రకటన ఇచ్చేయ్...."

ఆ వార్తలో ఉద్దేశించబడిన అధికారి పేరుని ఆ పత్రిక రాయలేదు. కాని, మాకు తెలుసు. అస్సాం సిఎంకి కార్యదర్శిగా వున్న ఎం.వి.జి. కుమారభాను డెప్యుటేషన్ మీద ఆంధ్రప్రదేశ్ సిఎంకి ఒక కార్యదర్శిగా వస్తున్నారు. నియామకం ఖరారైంది. అయితే, ఆయన అక్కడ ఇంకా రిలీవ్ కాలేదు. ఇప్పుడు సిఎం ఉద్దేశంలో ఈ పత్రిక ఉద్దేశ పూర్వకంగానే తన కార్యాలయం మీద బురద జల్లడం కోసం ఈ వార్త రాసింది. సిఎం కార్యాలయంలో పని చేసే నలుగురైదుగురు కార్యదర్శులలో భాను కూడా ఒకరు. ఆ వార్త ప్రచురితమయ్యేనాటికి, సిఎం కార్యాలయంలో జన్నత్ హుస్సేన్ ఒక్కరే సిఎం ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్నారు. డిప్యూటీ కార్యదర్శి లవ్ అగర్వాల్, ఒక ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (OSD) జనార్దనరెడ్డి కూడా వున్నారు.

బ్రీఫింగ్‌లో సిఎం సీరియస్‌గా చెప్పినప్పుడు ఇతర అధికారుల ముందు నేను 'సరే' అన్నాను. కాని సిఎం స్పందన సరికాదని నా అనుభవం చెబుతోంది. అయితే అక్కడ నలుగురి ముందూ నేను వాదించదలుచుకోలేదు. తరువాత చెబుదాం అనుకున్నాను.

మా మీటింగ్ అయిపోయాక 12 గంటల ప్రాంతంలో ప్రభుత్వ సలహాదారు కె.వి.పి. రామచంద్రరావు గారు ఫోన్ చేశారు. "సిఎం చెప్పిన పత్రికా ప్రకటన ఏమైంది?" అని అడిగారు. నేను నా అభిప్రాయం చెప్పాను.

"..... ఆ పత్రికలో క్రూడాయిల్ కుంభకోణంలో ఇరుక్కున ఐఏఎస్ అధికారి పేరు రాయలేదు. సిఎం కార్యాలయంలో ముగ్గురు కార్యదర్శులు ఇంకా చేరాల్సి ఉంది. చేరే దాకా వాళ్ల పేర్లు పూర్తిగా ప్రజలకి తెలీదు.... ఈ స్థితిలో ఈ వార్తని మనం పట్టించుకోకుండా వదిలేయటం ఉత్తమం. అందువల్ల రెండు రోజుల్లో ప్రజలు మర్చిపోతారు. అలాకాక, ఇవ్వాళ మనం వివరణ ఇవ్వాల్సి వస్తే ఏమని రాయాలి. 'సిఎం కార్యాలయంలో చేరబోతున్న ఎం.వి.జి.కె. భాను అస్సాంలో ఎలాంటి క్రూడాయిల్ కుంభకోణంలో ఇరుక్కోలేదు' అని రాయాలి. ఇది ముఖ్యమంత్రి పౌరసంబంధాల అధికారి ఇచ్చాడు అంటే, సిఎం చెబితేనేగదా ఇస్తాడు.... రేపు ఆ పత్రిక ఈ ఖండనకి ఇంకా ప్రాధాన్యం ఇస్తుంది. 'సిఎం కార్యాలయంలో చేరబోయే అస్సాంకి చెందిన ఎం.వి.జి. కుమార భాను అనే ఐఏఎస్ ఇంకా ఇప్పటి వరకు ఎలాంటి క్రూడాయిల్ కుంభకోణంలోనూ ఇరుక్కోలేదని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. అయితే అస్సాం క్రూడాయిల్ కుంభకోణంలోఎవరెవరు ఇరుక్కున్నారో, ఎవరు లేరో ఆంధ్రప్రదేశ్ సిఎంకి ఎలా తెలిసిందో మాత్రం ఆ వివరణలో తెలీదు....' అంటూ ముందురోజు వచ్చిన కథనాన్ని అంతా ఈ వివరణకి కలిపి ప్రముఖంగా ప్రచురిస్తుంది. దాంతో, సిఎం కార్యాలయంలో చేరబోయే ఏ అధికారి గురించి 'ఆంధ్రజ్యోతి' ఇలా రాసింది అన్నది ప్రజలకి మనంతట మనమే చెబుతున్నట్లవుతుంది. మనకిగా మనం చెప్పనంతవరకూ ఆ పత్రిక (అస్సాం నుంచి సాక్ష్యాధారాలు వుంటే తప్ప) భాను పేరుని ఇలా నెగెటివ్‌గా రాయలేదు. అయినప్పుడు మనమెందుకు ఆ అవకాశం ఇవ్వాలి? పైగా, భవిష్యత్‌లో ఎప్పుడు భాను గురించి రాయాల్సి వచ్చినా ఆ పత్రిక (మన ఖండన ఆధారం చేసుకుని) అస్సాం క్రూడాయిల్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎం.వి. జి.కె. భాను అని పేరు పెట్టి మరీ రాయచ్చు. అలా వాళ్లు రాసినప్పుడు భాను గురించి మనం ప్రజలకి నెగెటివ్‌గా గుర్తు చేస్తున్నట్లే కదా..... ఇదంతా అవసరమా? ఆ వార్తని పట్టించుకోకుండా వదిలేస్తే రెండో రోజు రాయటానికి ఆ పత్రిక్కి ఈ విషయంలో ఏమీ వుండదు. ఇంకో రెండ్రోజుల్లో ప్రజలూ మర్చిపోతారు. అందుకే ఖండన ప్రకటన ఇవ్వటం సరికాదు సర్...." అని వివరించాను.

నేను చెప్పింది హేతుబద్ధంగా వుందని కె.వి.పి ఒప్పుకున్నారు. కాని మధ్యాహ్నం 3–4 గంటల ప్రాంతంలో నన్ను మళ్లీ సిఎం సీరియస్‌గా అడిగారు. “ఎంత వరకు వచ్చింది ఆ ఖండన ప్రకటన?”

“ఆ పని మీదే వున్నాను సర్. సాయంత్రం మిమ్మల్ని కలుస్తాను...”

ఆయన మళ్లీ కోపంగా ఏదో అనబోయారు. ఇంతలో ఫోన్ కాల్ వచ్చింది. నేను బయటకు వచ్చేశాను. సాయంత్రం అయిదింటికల్లా అస్సాం సిఎం కార్యాలయం నుంచి ఆ ముఖ్యమంత్రి పేరుతో ఒక వివరణని భాను మెయిల్‌లోనో, ఫ్యాక్స్‌లోనో పంపారు. అందులో ఇంకా ఇలా వుంది.

“గౌరవ ఆంధ్రప్రదేశ్ సిఎం గారికి, మీ దగ్గర చేరుతున్న మా ఐఏఎస్ అధికారి ఎం.వి.జి.కె. భాను ఇక్కడ క్రూడాయిల్ కుంభకోణంలో ఇరుక్కున్నట్లు తెలుగు పత్రికలో వచ్చిన వార్త నా దృష్టికి వచ్చింది. కాని, భాను అలాంటి కుంభకోణంలో ఇరుక్కోలేదు. అది నిజం కాదు.....”

దీన్ని వెంటనే పత్రికల్లో వేయించాలని భాను నాకే స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. (భాను గతంలో నేను ‘ఈనాడు’ ప్రతినిధిగా ఢిల్లీలో పనిచేసినప్పట్నుంచి నాకు తెలుసు.)



# రాష్ట్ర అధికారికి వాటా?

## • ఏటా 100 కోట్లు స్వాహా • వైఎస్‌కు ఫిర్యాదు

న్యూఢిల్లీ, జూన్ 10 (ఆన్‌లైన్):

అస్సాంలో చోరీ చేసి అక్రమంగా చమురు తరలిస్తున్న లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్న దృశ్యం

మిగతా 8వ పేజీలో

## రాష్ట్ర అధికారికి వాటా?

నేను ఆయనకి కూడా వివరించాను. "ఆ పత్రిక మీ పేరు రాయలేదు. మనంతట మనం కెలుక్కోవటం వివేకం కాదు. ఇప్పుడు ఖండన వేయించటం అంటే, నిన్నటి వార్తలో ఆరోపణలుఎదుర్కొంటున్న వ్యక్తి మీరే అని అందరికీ బాకావూది చెప్పటం. దీన్ని రాబోయే రోజుల్లో ఆ పత్రిక ఎలా వాడుకుంటుందో తెలీదు. ఇక్కడితో వదిలేయండి...." అని నచ్చజెప్పే ప్రయత్నం చేశాను. (భాను అస్సాం ప్రభుత్వంలో 2016-18 కాలంలో స్పెషల్ ఛీఫ్ సెక్రటరీగా పనిచేశారు. సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.)

ఆయన వినలేదు. నేను మళ్లీ చెప్పాను. "భానుగారూ, అస్సాం నుంచి డెప్యుటేషన్ మీద సిఎం ఆఫీసుకు వస్తున్న అధికారి మీరే అని మీ బంధువులకి స్నేహితులకి – అంతా కలిపితే ఓ వంద లేదా నాలుగు వందలమందికి ఇప్పుడు తెలిసి వుండచ్చు. రేపు ఈ ఖండన పడితే 'ఓహో క్రూడాయిల్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అతని పేరు ఎం.వి.జి.కె.భాను నా? తెలుగువాడా?'.... అని పదికోట్ల మంది చెప్పుకుంటారు. నెగెటివ్ వార్తలు ప్రచారమయినంత వేగంగా వాటి ఖండనలు ప్రచారం కావు... ఇది మనకి అవసరమా! పైగా, రేపట్నుంచి సిఎం ఆఫీసుకి వచ్చిన ప్రతివాడూ మిమ్మల్ని 'క్రూడాయిల్ భాను' అన్నట్లు చూస్తారు. అది అవసరమా? ఇది సిఎం కార్యాలయ ప్రతిష్ఠకి సంబంధించిన విషయం. దయచేసి నా అనుభవాన్ని గౌరవించండి. ఇదిక్కడితో వదిలేయండి....."

భానుకి నా వాదన నచ్చలేదు. "నేను సిఎంతో మాట్లాడతాలెండి...." అన్నారు. నేను వెంటనే కె.వి.పి గారికి ఫోన్ చేసి జరిగిందంతా చెప్పాను. పైగా సిఎం మళ్లీ రాత్రికి నన్ను అడగొచ్చు కదా! "ఏం చెప్పాలి?" అని అడిగాను.

కె.వి.పి నా వాదనతో ఏకీభవించారు. "వల్లీశ్వర్, మీరు సిఎం ఆఫీసు ప్రతిష్ఠ దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తున్నారు. నాకు అర్థమైంది. నేను సిఎంకి కూడా నచ్చజెబుతాను...."

ఆ రాత్రంతా అదే ఆలోచన. సిఎం చెప్పినట్లు చేయనందుకు రేపు ఎలాంటి పరిణామాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది?... ఏదైనా కానీ, సిఎంకి ఏది మంచిది అని నేను నమ్ముతున్నానో అదే చెబుతాను... అనుకుంటూ నిద్రపోయాను.

మర్నాడు బ్రీఫింగ్‌లో సిఎం కొంచెం సీరియస్‌గా వున్నారు. నేను చేరిన రెండవ వారంలోనే నాకింత జటిలమైన పరీక్ష ఏంటి?..... అనుకుంటున్నాను. ఏమైనా నా బాధ్యతగా చెప్పాలి కదా! బ్రీఫింగ్ అయిపోయాక, నేను నోరు విప్పాను.

"సర్, భాను విషయంలో ఆంధ్రజ్యోతికి ఖండన....." నా వాక్యం పూర్తి కాకుండానే సిఎం అనేశారు. "వదిలేసెయ్...."

వైయస్సార్ సరైన నిర్ణయాలు తీసుకోవడంలో కె.వి.పి ఎలా సహకరించేవారో నాకు మొదటిసారిగా తెలిసింది.

* * *

# కరణ్‌థాపర్‌తో ఇంటర్వ్యూకి ముందు....

జాతీయ టెలివిజన్ న్యూస్ ఛానళ్లలో బాగా పేరున్న టివి జర్నలిస్టు కరణ్ థాపర్.

అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా దాదాపు తొమ్మిది సంవత్సరాలు పనిచేసి, బహుళ జాతి సంస్థల వర్గాలలో కార్పొరేట్ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందిన నారా చంద్రబాబు నాయుణ్ణి 2004 ఏప్రిల్ ఎన్నికలలో ఓడించి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి ఎవరు – అని ప్రపంచమంతా విస్మయంతో చూస్తున్న రోజుల్లో, ఈ కరణ్‌థాపర్ డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డిని ఇంటర్వ్యూ చేయటానికి హైదరాబాద్ వచ్చారు. నేను సిఎంకి ఛీఫ్ పిఆర్‌ఓగా నియమింపబడిన నెలరోజుల్లోనే ఈ ఇంటర్వ్యూకి ITC కాకతీయ హోటల్‌లో ఏర్పాటు జరిగింది.

2004 జూలై 17 రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఈ ఇంటర్వ్యూకి సిఎం రాజశేఖరరెడ్డి గారు బయల్దేరారు. నాకు ఆ రోజు ఉదయం ఈ విషయం తెలిసిన దగ్గర్నుంచీ సిఎంతో మాట్లాడాలని ప్రయత్నిస్తూనే వున్నాను. కాని, వీలు పడలేదు. చివరికి సిఎం కాన్వాయ్ వెనకాల నా కారులో వెళ్ళాను.

హోటల్‌లోని ఒక సూట్‌లో కరణ్‌థాపర్ తన కెమెరా యూనిట్‌తో ఇంటర్వ్యూకి సిద్ధంగా కూర్చున్నారు. సిఎం మొహం కడుక్కోవాలని ప్రక్క సూట్‌లోకి వెళ్లారు. నేను హడావుడిగా ఆ రూమ్‌కి వెళ్లాను.

సిఎం తయారయి బయటకు రాబోతుంటే, ఆపాను.

"సర్, మీరు కరణ్‌థాపర్‌తో తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో ఇంటర్వ్యూకి వెళ్తున్నారు. మీకు కొన్ని సూచనలు ఇవ్వటం నా బాధ్యత...."

"సరే చెప్పు" అంటూ సిఎం గది తలుపు దగ్గరకు వేశారు.

"ఈ కరణ్‌థాపర్‌గారు ఏ ఇంటర్వ్యూకైనా సమగ్రంగా సమాచారం సేకరించుకుని వస్తాడు. అయితే ఇతర టివి జర్నలిస్టులకీ ఈయనకీ ఒక తేడా వుంది. ఈయన వీలైనంత వరకూ ఎదుటివాళ్లని ఇరుకున పెట్టే ప్రశ్నలు మాత్రమే వేస్తుంటాడు. అంతకన్నా ముఖ్యంగా,

ఈయన 'Hard Talk' ఇంటర్వ్యూలు 'నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించేతీరులో' వుంటాయి. మిమ్మల్ని కూడా ఆయన అలాగే ఇంటర్వ్యూ చేస్తాడు. ఆయన నైజాన్ని మనం మార్చలేం. కాని చంద్రబాబు నాయుడి కన్నా డాక్టర్ రాజశేఖరరెడ్డిలో గొప్పదనం ఏమిటి అని ప్రపంచమంతా చూస్తున్న తరుణంలో ఈ ఇంటర్వ్యూ జరుగుతోంది. ఇది ప్రపంచమంతా వెళ్తుంది. కాబట్టి మీరు ఈ ఇంటర్వ్యూలో ఎంత impact కలిగించగలిగితే అంత చేయాలని నా సూచన సర్...."

సిఎం తన వాచీ చూసుకున్నారు. సమయపాలన ఆయనకున్న క్రమశిక్షణలో భాగం.

నేను ఆపలేదు. ఆయనకి ఏది మంచిదో అది చెప్పటం నా విధి. ఆయనకి నచ్చినా నచ్చకపోయినా చెప్పి తీరతాను.

"సర్, మూడు అంశాలు ఈయనతో ఇంటర్వ్యూ విషయంలో మీరు దృష్టిలో వుంచుకోవాలని నా కోరిక. మొదటిది – ఆయన ప్రశ్నలకి జవాబు లిచ్చేటప్పుడు కెమేరా పూర్తిగా మీమీదే వుంటుంది. కాబట్టి, ఆ సమయంలో మీ చూపుని క్రిందకి గానీ, ప్రక్కకి గానీ, పైకి గానీ తిప్పకండి సర్. మీరు ఎంతలా చూపు తిప్పుకోకుండా ఆయన వంకే చూస్తూ మాట్లాడగలిగితే అంతగా మీరు ఆత్మవిశ్వాసంతో నిజం మాట్లాడుతున్నారన్న భావం ప్రేక్షకులకి కలుగుతుంది. రెండోది – ఆయన ఏదన్నా ఇబ్బంది కలిగించే ప్రశ్న అడిగితే, మీరు కొంచెం ఆలోచించుకోవాల్సి వస్తే, తడబాటు పడకుండా, మీకు ఆ ప్రశ్న అర్థంకానట్లుగా చూడండి. Will you please repeat your question అనో, Do you mean to say so.... అనో అడగండి సర్. ఆయన తాను ఏం అడగాలనుకున్నాడో మళ్లీ వివరిస్తాడు. ఆ లోపల మీరు ఏ జవాబు చెప్పాలో ఆలోచించి సిద్ధపడండి సర్... మూడోది – ఆయన నైజం మీకు చెప్పానుగదా! ఆ నైజం ప్రకారం ఆయన మిమ్మల్ని రెచ్చగొట్టే ప్రశ్నలు వేయచ్చు. నవ్వుతూ అడుగుతూనే, మొహంలో 'దీనికి చెప్పు చూస్తాను' అన్నట్లు వెటకారం వ్యక్తం చేస్తాడు. అలాంటప్పుడు మీరు అసలు ఏ మాత్రం విసుక్కోకూడదు, చీకాకు పడకూడదు...." అంటున్నాను.

"ఏం ఎందుకు? చీకాకు వస్తే చీకాకు పడమా?..." సిఎం అడిగారు.

"సర్, ఇప్పుడు ఈ ఇంటర్వ్యూలో వద్దు సర్. ప్రపంచమంతా ఉత్కంఠతో చూస్తోంది. చంద్రబాబు నాయుణ్ణి ఓడించిన ఈ వ్యక్తి ఎలాంటి శక్తి అని చూస్తున్నారు. మా ముఖ్యమంత్రి గురించి వాళ్లకి మొట్టమొదటి అభిప్రాయం (First Impression) ఎంత పాజిటివ్‌గా ఏర్పడే అవకాశం వుందో అంత పాజిటివ్‌గా వుండాలని మేం తాపత్రయం పడతాం సర్...."

"సరే, చెప్పు....."

"ఎంత ఇరుకున పెట్టే ప్రశ్నలు వేసినా, చిరునవ్వుతోనే జవాబివ్వండి. చీకాకు, అసహనం, కోపం అస్సలు వ్యక్తం కానీయకండి సర్. మిమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి కరణ్ థాపర్ కాబట్టి ఈ ఒక్కసారికీ కొంచెం అప్రమత్తంగా వుంటే మంచిది సర్...." అని గడగడా నేను చెప్పాలనుకుంది చెప్పేశాను.

సిఎం దరహాసం చేశారు. నా భుజం మీద తట్టారు. "థాంక్స్ వల్లీశ్వర్" అంటూ ప్రక్క సూట్‌లో ఇంటర్వ్యూకి వెళ్లిపోయారు.

* * *



ముఖ్యమంత్రితో క్యాంప్ కార్యాలయంలో ఒకరోజు

# వైయస్సార్‌పై EPW వ్యాఖ్య!

"…. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వచ్చిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రాయలసీమలోని కడపజిల్లాలో ఫ్యాక్షనిస్టు కుటుంబానికి చెందినవారు. బ్రిటీషు ఇండియాలో జమీందార్లకు తొత్తులుగా వ్యవహరించి, ప్రజలను పీడించిన పాలెగాళ్లనేపథ్యం ఈ కుటుంబానిది…"

ఇలా సాగిన ఒక వార్తా కథనం EPW (Economic and Political Weekly) లో వచ్చింది. 2004 జూన్ / జూలై నెలల్లో ఒక సంచికలో వచ్చిన ఒక రాజకీయ వ్యాసంలో భాగం ఇది.

ఈ విషయం నా కార్యాలయంలో పి.ఆర్.ఓగా వున్న శిష్ట్లా నాగేశ్వరరావు నా దృష్టికి తీసుకువచ్చారు. నేను వెంటనే ఆ సంచికలో ఆ పేజీకి ఒక ఫ్లాగ్ పెట్టి సిఎంకి పంపించాను. మర్నాడు సిఎం తన కార్యదర్శులతో బ్రీఫింగ్ (స్వల్పసమీక్ష)లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఆ కార్యదర్శులెవరూ EPWని చదివేవారు కాదు. నేనూ దానికి రెగ్యులర్ పాఠకుణ్ణి కాదు.

సిఎం ముఖ్యకార్యదర్శి జన్నత్‌హుస్సేన్ ఆ వ్యాసాన్ని కొట్టి పారేశారు. "ఎవరూ చదవని పత్రికలో ఏదో వస్తే దానికి ప్రాముఖ్యం ఇవ్వనక్ఖర్లేద"ని ఆయన అభిప్రాయం. మిగతా కార్యదర్శులూ కూడా ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

నేను అంగీకరించలేదు. "సర్, ఇది వామపక్ష భావజాలపు మేధావుల పత్రిక. మనం దీనికి స్పందించకపోతే, ఇది నిజం అని EPW పాఠకులే కాదు, ఇతర పత్రికల సంపాదకులు కూడా భావిస్తారు కదా! వామపక్ష భావజాలపు దినపత్రికలు దీన్ని తెలుగులో ఎత్తిరాయచ్చు. అప్పుడు కూడా ఖండించమా?…. అది చూసి ఇంక చిన్న పత్రికలు, ముఖ్యంగా ప్రతిపక్షానికి అనుకూలంగా వున్న పత్రికలు మరింత గట్టిగా నొక్కిరాస్తాయి. అప్పుడూ పట్టించుకోమా? ఒకవేళ అప్పుడు పట్టించుకోవాల్సి వస్తే ఎన్ని పత్రికల్లో నిలువరిస్తాం? అంతకన్నా ఇప్పుడే దీన్ని EPWలోనే నిలిపేద్దాం. ఇంకెవరూ రాయటానికి ధైర్యం చేయలేని విధంగా…" అన్నాను.

కొంత చర్చ జరిగింది. కాని సిఎం నాతో ఏకీభవించారు. "సరే, ఇప్పుడేం చేద్దాం" అన్నారు.

"సర్, మీ పేరు మీద ఒక ఖండన జారీ చేస్తాం. అందులో ఎక్కువ కథ వుండదు. ఓ 2 – 3 పేరాలే వుంటాయి...."

"ఏం రాస్తాం?"

"మీరు రాసింది అభూతకల్పన. కాదంటే దానిని డాక్యుమెంటరీ ఎవిడెన్స్ (ఆధారపత్రాలు)లతో నిరూపించండి. లేదంటే, మేం తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధంగా వుండండి – అని రాస్తాం"

సెక్రటరీలు మాట్లాడలేదు. సిఎం వైయస్సార్ మాత్రం ఉత్సాహంగా రాసేయమన్నారు. ఆ మధ్యాహ్నమే ఆ లెటర్‌ని రిజిష్టర్ పోస్టులో EPWకి పంపించాను.

ఆ తరువాత వచ్చిన EPW సంచికలో ఎడిటర్ పేజీలో బాక్స్ కట్టి, మేం పంపిన వివరణ యథాతథంగా వేశారు. దానిక్రింద ఎడిటర్ గారి వ్యాఖ్య కూడా ప్రచురించారు.

"ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన ఈ వివాదంపై వాదోపవాదాలను ఇంతటితో ముగిస్తున్నాం. ఈ విషయమై ఇంక ఎలాంటి వ్యాఖ్యలను అనుమతించబోము..."

మళ్లీ ఎప్పుడూ EPWలో వైయస్సార్‌పై అలాంటి వ్యాఖ్యలు రాలేదు.

* * *



ముఖ్యమంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో

# పని చేసిన నా 'త్రిముఖ వ్యూహం'

**2004 ఆగస్టు 12.....**

ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎం కార్యాలయ అధికారుల రోజువారీ సమీక్ష జరిగింది.

సమీక్ష అయిపోయాక, సమాచార శాఖ కమిషనర్ కె.వి. రమణాచారి – ఆగస్టు 15 నాడు సిఎం చదవాల్సిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ముసాయిదా తీసుకువచ్చారు. ఆ ప్రసంగం కాపీలు అక్కడున్న అందరికీ ఇచ్చారు. సిఎం చదువుతూ వెళ్లారు.

మొత్తం ప్రసంగం 45 నిమిషాలు పట్టింది. సిఎం దాన్ని 20 నిమిషాలకి కుదించేయమన్నారు. "అందరికీ ఓకేనా?" అని అడిగారు.

అందరూ "బాగుంది సర్" అన్నారు.

నేను అభ్యంతరం లేవదీశాను. "ఈ ప్రసంగంలో చిన్నమార్పు చేయాలి సర్.... ఇందులో ప్రజలకి తెలియని కొత్త విషయాలు ఏవీ లేవు. మన ప్రభుత్వం గత రెండు మాసాలలో సాధించింది అని ఘనంగా చెప్పుకునే అంశాలు కూడా చాలా తక్కువ. ఇంకా ఆరంభంలోనే వున్నాం. కాబట్టి దీనిలో మొదటి ఉపోద్ఘాతం పేజీల తరువాత – అభివృద్ధి అంశాలలోకి వెళ్లేముందు చిన్న మార్పు చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం...."

"ఏమిటా మార్పు?" సిఎం అడిగారు.

"ఒక త్రిముఖవ్యూహాన్ని మా ప్రభుత్వం అమలు చేస్తోంది – అని ఆరంభిస్తాం. 'త్రిముఖ వ్యూహం' హెడ్డింగ్ క్రింద 3 పేరాలు రాస్తాం. ఆ తరువాత మిగతా ప్రసంగపాఠం యథాతథంగా కొనసాగుతుంది...."

రమణాచారి, మిగతా నలుగురు కార్యదర్శులు ఏమీ అభ్యంతర పెట్టలేదు. కాని, జన్నత్ హుస్సేన్ గారికి నా సూచన నచ్చలేదు. "అందులో త్రిముఖం అంటూ మార్పు చేయాల్సినంత అవసరం ఏమిటి? సిఎం ఇప్పటికే చదివేశారు. అంతా బాగుందన్నారు కదా!...."

ముఖ్యమంత్రి నా వంక చూశారు – "నీ సమాధానం ఏమిటి?" అన్నట్లుగా.

నేను సిఎంకి ప్రధాన పౌరసంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించి అప్పటికి తొమ్మిదివారాలే అయింది. నా పనితీరు ఇంకా పరీక్ష దశలోనే వుంది.

అక్కడున్న సిఎం కార్యదర్శులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, కుమార భాను, లవ్ అగర్వాల్, OSD జనార్దన రెడ్డిలతోపాటు ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్, సమాచారశాఖ కమీషనర్ రమణాచారి – వీళ్లంతా నా వంక చూస్తున్నారు.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"నీ పాయింట్ ఏమిటో చెప్పు వల్లీశ్వర్" అని సిఎం మళ్లీ అన్నారు.

"సింపుల్ సర్. ఈ ముసాయిదాలో మీడియా వాళ్లకి కొత్తగా కనుపించే విషయం ఏమీ లేదు. అందువల్ల రేపు పత్రికల్లో (అప్పటికి న్యూస్ టివిలు ఒకటో రెండో వుండేవి) మీ ప్రసంగం వార్త రెండు కాలమ్స్‌కి మించి రాదు. అందుకే మనం 'త్రిముఖ వ్యూహం' అనే పదప్రయోగం చేయటం వల్ల – మీ ప్రభుత్వం చాలా పకడ్బందీగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది – అన్న భావం మీడియాకి కలుగుతుంది. రేపు హెడ్డింగ్ అన్ని పత్రికలలో ఇదే వస్తుంది. ప్రజలకు కూడా అదే విశ్వాసాన్ని కలిగించగలుగుతాం...." అంటూ నా వాదన వినిపించాను.

ముఖ్యమంత్రి నా వాదన పూర్తిగా విన్నారు.

"జన్నత్, వల్లీశ్వర్ చెప్పిన దాంట్లో పాయింట్ వుంది. అతను చెప్పినట్లు చేసేద్దాం.... వల్లీశ్వర్, ఆ మార్పు ఎక్కడ ఎలా చేయాలో నువ్వు చేసెయ్...." అన్నారు సిఎం

ఆగస్టు 15న ముఖ్యమంత్రి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు.

ఆగస్టు 16 ఉదయం జన్నత్ హుస్సేన్ నా గదికి వచ్చారు.

"కంగ్రాట్స్ వల్లీశ్వర్. మీ పాయింటే కరెక్ట్. అన్ని పత్రికలలో ఇవ్వాళ హెడ్‌లైన్స్ మీ – త్రిముఖ వ్యూహమే" అన్నారు అభినందిస్తూ.

అది ఆయన ఔన్నత్యం.

నేను కొత్తగా చేర్చిన 'త్రిముఖ వ్యూహం' ఏమిటంటే –

**త్రిముఖ వ్యూహం :**

రాష్ట్రంలో అన్ని వెనుకబడిన రంగాలలో, అన్ని ఇతర రంగాలలో సమతుల్యంగా అభివృద్ధిని సాధించడానికి ఒక త్రిముఖ వ్యూహాన్ని రూపొందిస్తున్నాం.

ఈ వ్యూహంలో రాష్ట్రాన్ని మళ్లీ పురోగమన పథంలోకి తీసుకువెళ్ళడం మా లక్ష్యం. ఈ వ్యూహంలో

**మొదటిది** వ్యవసాయం, సాగునీరు, గ్రామీణాభివృద్ధి.

**రెండవది** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి.

**మూడవది** ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ, మహిళలు, వికలాంగులు ఇతర బలహీన వర్గాల సంక్షేమ సేవలు.

ఈ రంగాలలో ఏకకాలంలో సమ ప్రాధాన్యంతో కృషి చేయడం జరుగుతుంది. ఆధునిక టెక్నాలజీ అభివృద్ధి ప్రజాజీవితంలో ప్రతిబింబించేలా చేస్తూనే, పేదరికాన్ని తొలగించి పల్లెలను అభివృద్ధిపరచాలని రాజీవ్ గాంధీ ఆశించారు. ఆయన తీసుకువచ్చిన 73,74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తిని నిలబెడుతూ స్థానిక సంస్థల స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక స్వావలంబనను కాపాడాలని మా ప్రభుత్వం వాంఛిస్తోంది.

* * *

# అరుదైన చరిత్రాత్మక ఘట్టం

**2005 జనవరి 27 ....**

ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మొదటిసారిగా హైదరాబాద్‌కి చెందిన యువతి సానియా మీర్జా అద్భుతమైన ఆటని ప్రదర్శించింది. ప్రతి మ్యాచ్‌లోనూ చేయి తిరిగిన ప్రత్యర్థుల్ని చిత్తు చేస్తూ ఫైనల్స్‌కి దూసుకుపోయింది. టెన్నిస్ ప్రపంచంలో విశ్లేషకులంతా 'ఎవరీ నూతన టెన్నిస్ తార' అంటూ ప్రశంసలు కురిపించారు. హైద్రాబాద్‌లో టెన్నిస్ క్రీడాకారులంతా 'శభాష్' అంటున్నారు. ఫైనల్స్‌లో కూడా సానియామీర్జా గెలిచేసినట్లే – అనుకుంటున్నారు.

సానియా మీర్జా లాగానే మొదటి మ్యాచ్ నుండి సెమీఫైనల్స్ వరకు ఇతర మ్యాచ్‌లలో ప్రత్యర్థుల్ని ఓడిస్తూ ఫైనల్స్‌కి చేరుకున్న టెన్నిస్ తార సెరీనా విలియమ్స్. అప్పటికే టెన్నిస్‌లో ఒక ధ్రువతారగా వెలుగుతోంది సెరీనా. అలాంటి సెరీనాతో ఫైనల్స్‌లో సానియా తలపడింది. 'నువ్వా–నేనా' అన్నట్లుగా సాగిన ఆ ఫైనల్స్‌లో సానియా అత్యద్భుతంగా ఆడిందని విశ్లేషకులు ప్రశంసల వర్షం కురిపించారు. కానీ, విజయం సెరీనా విలియమ్స్‌ని వరించింది.

2005 జనవరి 27....

ఉదయం 10 గంటల ప్రాంతంలో సిఎం ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్ నన్ను పిలిచారు.

"వల్లీశ్వర్, ఆస్ట్రేలియా టెన్నిస్‌లో అద్భుతంగా ఆడి, మన రాష్ట్రానికి గొప్ప గుర్తింపు తెచ్చిన సానియా మీర్జాని సిఎం గారు అభినందించాలనుకుంటున్నారు. ఆ కార్యక్రమం ఇంకో గంటలో ఇక్కడే, నాలుగో అంతస్తు కాన్ఫరెన్స్ హాలులో జరుగుతుంది. మీరు కొంచెం సిఎంకి టాకింగ్ పాయింట్స్ (ప్రసంగాంశాలు) తయారు చేయాలి..... ఓకె!" అన్నారు.

టెన్నిస్ అంటె సిఎం గారికి ఇష్టం. ఆయన డాక్టర్‌గా ప్రాక్టీసు చేసే రోజుల్లో టెన్నిస్ ఆడేవారు. ఇప్పుడు సానియామీర్జాని అభినందించే ప్రతిపాదన ఎక్కడి నుంచి వచ్చిందో

ఎలా వచ్చిందో తెలీదు. కానీ, నాకు టెన్నిస్ రాదు. కాని ముఖ్యమంత్రి ప్రధాన పౌర సంబంధాల అధికారిగా అన్నీ తెలిసుండాలి (తెలియకపోతే తెలుసుకుని తీరాలి) కదా!

ఏం చేయాలి? ఎలా చేయాలి? అంతలో ఇంకేవో రెండు మూడు పనులు అర్జంటుగా చేయాల్సి వచ్చింది. ఓ అరగంట గడిచిపోయింది..... టెన్షన్ మొదలైంది. సిఎంకి ఇష్టమైన టెన్నిస్ – అందులో క్రొత్తగా హైద్రాబాద్ అమ్మాయి చరిత్రాత్మకంగా ఆడిన సందర్భం – ఆ అమ్మాయెవరో, ఈ టెన్నిస్ ఏమిటో....!

పోనీ ఇంటర్నెట్‌లో వెతుకుదామన్నా ఆ అమ్మాయి (సానియా) ఇంకా కెరీర్ ప్రారంభంలో వుంది. సిఎం మాట్లాడడానికి కావలసినన్ని అంశాలు దొరకాలిగదా!

ఆలోచించాను. 2000–03 కాలంలో స్పోర్ట్స్ అథారిటీ సెక్రటరీగా పనిచేసిన ఎల్.వి. సుబ్రహ్మణ్యం (2019లో ఆంధ్రప్రదేశ్ ఛీఫ్ సెక్రటరీ) గారికి ఫోన్ చేశాను. ఆయన బయట ఎక్కడో వున్నారు. నా అవస్థ చెప్పాను.

"నేను బయట వున్నాను. మీరు అడిగింది డిటిపి చేయించే పరిస్థితి లేదు...."

"అయ్యా, మీరు ఎలాగైనా సరే నాకు 15–20 నిమిషాల్లో పంపేయండి. డిటిపి నేను చూసుకుంటాను. పోనీ ఫోన్లో చెప్పేయండి...."

"ఫోన్లో చెప్పేటంత చిన్న విషయం కాదు. ఆ అమ్మాయిలో ప్రతిభ దాగి వుందని మనమే (స్పోర్ట్స్ అథారిటీ) గుర్తించి, ప్రోత్సహిస్తూ వచ్చాం. మొదటిసారి ఆ అమ్మాయి అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్స్‌కి వెళ్లటానికి నా సిఫార్సుతో ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా చేసింది...."

"సర్, ఇన్ని విషయాలు వున్నాయి మీ దగ్గర. ఎలాగైనా పంపండి ప్లీజ్...." అన్నాను.

"సరే" అన్నారు. మరో 15 నిమిషాల్లో సానియా మీర్జా ఒక టెన్నిస్ తారగా ఎదగటంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాత్ర, ఆమె నేపథ్యం – వివరంగా నాలుగు కాగితాల మీద చేత్తో రాసి పంపించారు. ఎంత సంస్కారం అది!

నాకు అప్పటికి సమయం 11 గంటలయిపోయింది. సిఎం వేరే ఏదో మీటింగ్‌లోకి వెళ్తూ "వల్లీశ్వర్, టాకింగ్ పాయింట్స్ రెడీయా?" అని అడిగారు.

"రెడీ అవుతున్నాయి సర్" అనేశాను. కాని, రెడీ కాలేదు. నేను ఆఫీసులో టెన్షన్ పడుతూనే, నా పిఎస్ త్రినాధరావుకి టాకింగ్ పాయింట్స్ డిక్టేట్ చేసుకుంటూ వెళ్లాను....

"సానియా మీర్జా వచ్చేసింది. వల్లీశ్వర్ ఎక్కడ?" అని జన్నత్ కబురు చేశారు.

టెన్షన్ పెరిగిపోతోంది. టాకింగ్ పాయింట్స్ పూర్తి కాలేదు. "అయిదు నిమిషాలు..... అయిదు నిమిషాలు" అంటూ ఓ పదినిమిషాలు జరిపేశాను. టైమ్ అయిపోయింది.

సిఎం దగ్గర్నుంచి కబురు వచ్చేలోపల తీసుకెళ్లి ఆయనకే నేరుగా ఇచ్చేశాను. ఆయన అవి చదువుకుంటూనే కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్లిపోయారు. సానియా మీర్జా తల్లీ, తండ్రి కూడా వచ్చారు.

ఆ టాకింగ్ పాయింట్స్‌లో ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పూర్తిగా వాడుకున్నారు. "సెరీనా కూడా బాగానే ఆడింది కదా సానియా" అని సిఎం చమత్కరించటంతో అభినందన కార్యక్రమం ముగిసింది.

నేను టాకింగ్ పాయింట్స్ రాసి సకాలంలో ఇవ్వలేకపోయినందుకు 'సారీ' చెప్పాలని సిఎం దగ్గరకెళ్లాను.

"వల్లీశ్వర్, సానియా గురించి చాలా సమాచారం సేకరించావయ్యా. చాలా బాగా వచ్చింది" అన్నారు సిఎం. జన్నత్ కూడా మెచ్చుకున్నారు. (నేను మాత్రం ఆ సమాచారం ఎవరిచ్చారో చెప్పలేదు. తప్పు చేశానా?)

* * *



*మూడేళ్ళ ప్రగతి పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తున్నప్పుడు*

# సిఎం కోసం 'చేయకూడని' పని చేశాను!

**2004 డిసెంబరు 15 న ఎప్పుడూ జరగని విధంగా జరిగింది.**

"ఇది కరెక్ట్ కాదు అన్నా! దయచేసి, ఈ ప్రయత్నం మానెయ్ అన్నా" అంటూ సమాచారశాఖ కమీషనర్ కె.వి రమణాచారి నన్ను ఒప్పించే ప్రయత్నం చేశారు.

నేను అనుకున్నది తప్పుకాదు. ముఖ్యమంత్రి కోసం చేస్తున్నాను. ఇది ఒక్కసారే చేస్తాం. మళ్లీ మళ్లీ చేయలేం కూడా. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు అర్థం చేసుకున్నారు. అర్థం చేసుకునే, నా ప్రతిపాదనకి ఒప్పుకున్నారు. కాని, సమాచారశాఖ కమీషనర్ నా విధానంతో ఏకీభవించటం లేదు. "ఇలా చేయటం ఒక్కటే మార్గం సర్" అని చెప్పి సిఎంని ఒప్పించిన నేను, ఇవ్వాళ మళ్లీ రమణాచారి చెప్పారు కదా అని మాట మార్చుకోవాలా?

అయితే, రమణాచారి గారి వాదన కూడా హేతుబద్ధంగానే ఉంది. మీడియా మనస్తత్వాన్ని ఆయన కూడా కాచి వడపోశారు. మూడుసార్లు సమాచారశాఖ కమీషనర్‌గా పనిచేసిన వ్యక్తి. ఆయన అనుభవాన్ని నేను గౌరవిస్తాను. కాని, ఇక్కడ నా విధేయత నన్ను చీఫ్ పిఆర్ఓగా తీసుకున్న ముఖ్యమంత్రికే గదా!

నేను రమణాచారిగారికి మర్యాద పూర్వకంగా చెప్పాను. "అయ్యా, ఈ ప్రతిపాదన సిఎం అంగీకరించారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు కాబట్టి ఇప్పుడు చేయకూడదు అన్న లాజిక్‌తో నేను ఏకీభవించను. సరే, ప్రస్తుత పరిస్థితుల్లో బాగా ప్రచారం వున్న పత్రికలు రెండే రెండు. ఈనాడు, ఆంధ్రజ్యోతి. పోనీ వార్త కూడా కలుపుదాం. కొత్త ముఖ్యమంత్రి శాసనసభలో మొదటిసారిగా ఇరిగేషన్ రంగంలో తమ ప్రభుత్వ విధానాన్ని – వివరిస్తూ గంటన్నరకుపైగా మాట్లాడితే, ఈ మూడు ప్రధాన పత్రికల్లో ఏ ఒక్కటయినా కనీసం మూడు కాలాల వార్త ఇచ్చిందా? నిడివి సంగతి వదిలేద్దాం. ఇరిగేషన్‌లో కొత్త ప్రభుత్వ విధానాలను కనీసం సంక్షిప్తంగానయినా ఇచ్చాయా? మరి కొత్త ప్రభుత్వంలో కొత్త ముఖ్యమంత్రి చేసిన తొలి విధాన ప్రకటన ప్రజలకి ఎలా తెలుస్తుంది? రాబోయే రోజుల్లో – అంటే ప్రతి శాసనసభ సమావేశంలోనూ ఇన్నేసి గంటల పాటు విధాన ప్రకటన చేస్తారా సిఎం? పైగా రోజులు గడుస్తున్న కొద్దీ కొత్త విషయాలు వచ్చేస్తుంటాయి. ఇంక తన

ప్రభుత్వ విధానాన్ని గురించి సిఎం ప్రజలకి ఎలా తెలియజేయగలరు? అందుకే ఈ ఒక్కసారి చేద్దాం. ఇది మళ్లీ మళ్లీ చేస్తే మీరు చెప్పినట్లు సిఎం ప్రతిష్ఠని దిగజార్చినట్లు.... ఇంక చెయ్యం...."

ముఖ్యమంత్రి చీఫ్ పిఆర్ఓగా నా తపనని ఆయన కూడా అర్థం చేసుకోవాలిగదా?

మా పంచాయితీ ముఖ్యమంత్రి ముందుకి వెళ్లింది. రమణాచారి సిఎంకి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. (డాక్టర్ కె.వి.రమణాచారి 2014-19 కాలంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా వున్నారు)

"సర్, ముఖ్యమంత్రులు తమ అసెంబ్లీ ప్రసంగాల్ని వాణిజ్య ప్రకటనల రూపంలో పత్రికల్లో వేసుకోవటం గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేదు. అలా చేస్తే మీ స్థాయిని మేం తగ్గించినవాళ్లం అవుతాం. దయచేసి అర్థం చేసుకోండి...."

రాజశేఖరరెడ్డిగారు అంతా విన్నారు.

"సరే రమణ. ఈ ప్రకటన ఆపేద్దాం. నేను అసెంబ్లీలో మాట్లాడిన గంటన్నర ప్రసంగంలో అన్ని అంశాలనీ, కనీసం ముఖ్యాంశాలు అన్నింటినీ నువ్వు అన్ని పేపర్లలో న్యూస్‌గా వేయించు...." (అలా చేసినా ప్రతి పత్రికా ఒక అరపేజీ కేటాయించాలి.)

అది సాధ్యపడదు. రమణాచారిక్కూడా తెలుసు. కాని ఆయన ఆరాటం వేరు. సిఎం తన ప్రసంగాన్ని వాణిజ్య ప్రకటన రూపంలో పత్రికల్లో వేయించుకోవటం ఏమిటి? ముఖ్యమంత్రి ప్రతిష్ఠ దిగజారదా అలా చేస్తే!

ఏమైనా నా వాదనతో సిఎం ఏకీభవించారు కనుక అలా చేసేశాం. ఆయన శాసనసభలో చేసిన గంటన్నర ప్రసంగాన్ని మొత్తం రాయించి చూస్తే పత్రికల్లో రెండు పూర్తిపేజీలకు వస్తోంది. అప్పుడు నేనే కూర్చుని చాలా జాగ్రత్తగా ఎడిట్ చేస్తే, ఒకటిన్నర పేజీకి వచ్చింది. అన్ని ముఖ్యాంశాలకీ సబ్ హెడ్డింగ్స్ ఇచ్చుకుంటూ చేశాను. 'అసెంబ్లీలో ప్రతిధ్వనించిన ప్రాజెక్టులు' అనే శీర్షిక పెట్టి, ఆ ప్రసంగాన్ని ఒక ప్రకటనగా సమాచారశాఖ అన్ని తెలుగు దినపత్రికలలోనూ 2004 డిసెంబరు 15న ప్రచురించింది. గ్రామాలలో ప్రజలు ఆ ప్రసంగ పాఠాన్ని ఎంత క్షుణ్ణంగా చదివారంటే, ఆ తరువాత డజన్ల కొద్దీ ఉత్తరాలు సిఎంకి వచ్చాయి. అవన్నీ జన్నత్‌హుస్సేన్ నాకు పంపించారు.

వాటన్నింటి సారాంశం.

"మీరు ముఖ్యమంత్రి కావటం మా అదృష్టం అన్నా...."

# అసెంబ్లీలో ప్రతిధ్వనించిన 'ప్రాజెక్టులు'

**రాష్ట్ర శాసనసభలో నీటిపారుదల ప్రాజెక్టులపై జరిగిన చర్చ సందర్భంగా 15.12.2004న ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి ప్రసంగ ముఖ్యాంశాలు**

**అధ్యక్షా!**

[illegible]

* * *

# సిఎం సెక్రటరీలకి నా మీద కోపం వచ్చింది

**2004 ఆగష్టు చివర్లో ఒక రోజు ఉదయం....**

ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ఆయన కార్యాలయ అధికారుల సమావేశం జరుగుతోంది. రోజువారీ వుండే సంక్షిప్త సమీక్షలు అయిపోయాయి.

జూన్ 20 ఆదివారంనాడు ప్రారంభమైన 'రాజీవ్ పల్లెబాట' వారం వారం కార్యక్రమ ప్రస్తావన వచ్చింది. మెల్లగా ఆయన కార్యదర్శి కుమార భాను ఒక విషయం ఎత్తారు.

"సర్, మీరు రాజీవ్ పల్లెబాట ఆదివారం కూడా పెట్టుకుంటున్నారు. మీరు చాలా అలసిపోతున్నారు. ఇంకా, ప్రభుత్వ సిబ్బంది అంతా ఇబ్బంది పడుతున్నారు సర్. ఇంకో రోజుకి మారిస్తే బాగుంటుందేమో.... ఆదివారం మీకు విశ్రాంతి అవసరం కదా"

మరో కార్యదర్శి సుబ్రహ్మణ్యం కూడా దీన్ని సమర్థిస్తూ మాట్లాడారు.

"అయితే ఏ రోజు పెట్టుకుంటే మంచిదంటారు?" అని సిఎం అడిగారు. వెంటనే ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్ అందుకున్నారు. "శనివారం కానీ, సోమవారం కానీ – ఏదయినా బాగుంటుంది సర్. ఒక్క ఆదివారం తప్ప – Anyday is ok సర్" అన్నారు.

ఈ అంశం మీద చర్చ నడుస్తోంది. డిప్యూటీ సెక్రటరీ లవ్ అగర్వాల్‌తో సహా కార్యదర్శులు నలుగురూ ఒకటే మాట చెబుతున్నారు. 'రాజీవ్ పల్లెబాట' క్రింద సిఎంగారు గ్రామాల్లో తిరిగే కార్యక్రమాన్ని ఆదివారాల్లో పెట్టద్దు – అన్నదే సారాంశం.

నేను నా కుడిచేతి చూపుడు వేలు ఎత్తిపెట్టుకుని కూర్చున్నాను. అంటే – 'నేను కూడా మాట్లాడేది వుంది' అని.

సిఎం గమనించారు. "నువ్వేం చెప్పాలనుకుంటున్నావ్?"

"సర్, రాజీవ్ పల్లెబాటని ఆదివారాల్లోనే పెట్టడం మంచిది సర్...." అన్నాను.

కార్యదర్శులంతా నా వైపు కోపంగా చూశారు. జన్నత్ హుస్సేన్ ఏకంగా రెండు మాటలు అసహనంగా సంధించారు.

"వాట్ వల్లీశ్వర్, మేమంతా సిఎంకి ఆదివారం రెస్టు కావాలని నిర్ణయిస్తే, మీరేమిటి మళ్లీ?"

"జన్నత్, అతన్ని చెప్పనియ్యి" అని సిఎం అన్నారు. దాంతో అందరూ మాట్లాడటం ఆపేశారు.

నేను నా వాదనని వినిపించాను.

"సర్, మీకు ముందు పని చేసిన ముఖ్యమంత్రి రోజుకి 18 గంటలు పని చేసే ఏకైక ముఖ్యమంత్రి అని మీడియాలో హోరెత్తించేశారు. ఆయన కన్నా మా ముఖ్యమంత్రే ఎక్కువ. ఎందుకంటే, ఆదివారాల్లో కూడా పని చేస్తారు – అని మేం చెప్పుకోవాలంటే మీరు పల్లెబాట ఆదివారం పెట్టుకోవాలి సర్.... ఆదివారాలు గ్రామాల్లో ప్రజలే కాకుండా, చుట్టుప్రక్కల పట్టణాల్లోని ఉద్యోగులు, చిరుద్యోగులు కూడా మిమ్మల్ని చూడాలని, వినాలని గ్రామాలకు వస్తారు సర్.... పని రోజుల్లో పని మానుకొని రావటం కష్టం కదా!..... ఆదివారాల్లో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా మీ గురించి పల్లెల్లో ప్రజలు చెప్పుకుంటారు కూడా..... సర్, మీకు వారాంతంలో విశ్రాంతి కావాలని వీళ్ళంటున్నారు కదా. దాన్ని శనివారం తీసుకోండి. కనీసం శనివారం 12 గంటల తరువాత తీసుకోండి. కాని, ఆదివారం మాత్రం 'రాజీవ్ పల్లెబాట' మానకండి సర్....."

అంతే! ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, కుమార భాను, అగర్వాల్, OSD జనార్దన రెడ్డి ఏం చెప్పడానికీ సిఎం అవకాశమివ్వలేదు.

"రాజీవ్ పల్లెబాట ఆదివారాల్లోనే జరుగుతుంది. శనివారం మధ్యాహ్నం నుంచి నేను విశ్రాంతి తీసుకుని, ఆదివారం పల్లెబాటలో వెళతాను. దట్సాల్...." అని ఖండితంగా సిఎం చెప్పేశారు.

మా మీటింగ్ ముగిసింది.

సిఎం కార్యదర్శులు నావంక ఎంత కోపంగా చూస్తుంటారో నాకు తెలుసు.

వాళ్లవంక చూడకుండా నా రూమ్‌కి వెళ్లిపోయాను.

* * *

# పరిటాల రవి హత్య : వైయస్సార్ స్పందన

**2005 జనవరి 24**

అనంతపురం జిల్లాలో పరిటాల రవీంద్ర హత్య జరిగింది. ఆయన 'తెలుగుదేశం పార్టీ' నాయకుడు, మాజీ మంత్రి అయి వుండటంతో తెల్లవారేటప్పటికి ఈ వార్త అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా కార్చిచ్చులా వ్యాపించింది.

అన్ని పట్టణాలలో 'తెలుగుదేశం' పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాలు చేత్తోపట్టుకుని రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ బస్సుల్ని ధ్వంసం చేశారు. అనేక కూడళ్లలో నిరసన ప్రదర్శనలు చేశారు. రాస్తారోకో చేశారు.

ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర పర్యటనలో వున్నారు. సాయంత్రం అనకాపల్లి నుంచి టెలికాన్ఫరెన్స్ చేశారు. అందులో ఇంటెలిజెన్స్ ఐ.జి అరవిందరావు, సిఎం ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్, ప్రధాన పౌరసంబంధాల అధికారిగా నేను మా మా కార్యాలయాల నుంచి పాల్గొన్నాం.

పరిటాల రవీంద్రపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయటం, పరారీ కావటం వంటి వివరాలన్నీ అరవిందరావు గారు చెప్పారు. ఇదంతా ముఖ్యమంత్రి కొడుకు జగన్ చేయించారని తెలుగుదేశం వర్గాలు చేస్తున్న ప్రచారం గురించి, వాళ్ల నిరసన ప్రదర్శనలూ, బస్సుల ధ్వంసాల గురించి కూడా ఆయన వివరించారు.

"సరే, ఇప్పుడు మనమేం చేయాలి?" అని సిఎం అడిగారు.

ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సి వుంటుందని, మెతక వైఖరి పనికి రాదని జన్నత్‌హుస్సేన్ చెప్పారు.

"వాళ్ల డిమాండు ఏమిటి?" సిఎం అడిగారు.

"సిబిఐ చేత విచారణ చేయించాలని 'తెలుగు దేశం' పార్టీ వాళ్లు డిమాండు చేయబోతున్నారు. మీరే ముందుగా సిబిఐ విచారణ చేయిస్తాం – అని చెప్పేస్తే, శాంతిస్తారు కదా!...." అని అరవిందరావు సూచించారు.

“సరే – సిబిఐ విచారణకి ఆదేశిస్తే వచ్చే ఇబ్బందేంటి?....”

“ముఖ్యమంత్రి ప్రతిపక్షం ధాటికి భయపడ్డారనో, ప్రతిపక్ష బలం ముందు సిఎం తలవంచారనో..... ఇలాంటి విమర్శలు రావచ్చు సర్....” అంటున్నారు జన్నత్.

నేను కల్పించుకున్నాను.

“సర్. సిబిఐ విచారణకి ఆదేశించటం వల్ల మీకు గానీ, మీ అబ్బాయికి గానీ ఏ సంబంధమూ లేదు కాబట్టే సిబిఐ విచారణకు ఒప్పుకున్నారు ముఖ్యమంత్రి – అని ప్రజలు అనుకుంటారు సర్.....”

“అనుకోవటం ఏమిటి వల్లీశ్వర్? ఆ హత్యతో ఏరకంగానూ నా కుటుంబానికి సంబంధం లేదు.....”

అరవిందరావుగారు అన్నారు “సర్, If you are confident of it, you may seek CBI probe (మీకా విశ్వాసం వున్నప్పుడు, సిబిఐ విచారణ కోరటమే మంచిది సర్....”)

జన్నత్ హుస్సేన్ గారు కూడా కొన్ని సూచనలు చేశారు. కొంత చర్చ జరిగింది.

చివరికి సిఎం వైయస్సార్ చెప్పేశారు. “వల్లీశ్వర్, పరిటాల రవీంద్ర హత్య విషయంలో ప్రభుత్వం సిబిఐ విచారణ కోరాలని నిర్ణయించింది – అని మీడియాకి వెంటనే లీక్ ఇచ్చేసెయ్.....”

మర్నాడు సిఎం పత్రికా సమావేశంలో ఇదే విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

* * *

# పి.వి. గారిని ఎక్కడ చూశారంటే.....

**2004 డిశంబరు నెల 10-12 తేదీల మధ్య ఒక రోజు.....**

ముఖ్యమంత్రితో కలిసి సిటీలో ఏదో కార్యక్రమానికి వెళ్తున్నాను. దారిలో కొంత సమయం చిక్కింది.

అప్పటికి ఒక వారం రోజులుగా నా మనస్సులో మెదుల్తున్న విషయం ఎత్తాను.

"సర్, పి.వి. నరసింహారావుగారి పరిస్థితి ఏమీ బాగాలేదు. ఎయిమ్స్ (All India Institute of Medical Sciences)లో వున్నారు. మీరు ఒకసారి వెళ్లి వస్తే బాగుంటుంది....." అని సూచించాను.

"మాట్లాడిస్తే ఆయన మాట్లాడగలరా?....."

"ICCU లో వున్నారు. వెళ్తే కాని తెలీదు సర్.... కాని, ఆయన మాట్లాడగలిగినా మాట్లాడలేకపోయినా, మీరు వెళ్లివస్తే బాగుంటుంది సర్...."

"అంటే...."

"రాజకీయంగా మంచిది కదా! ఆయనంటే ప్రజల్లో గౌరవం వుంది. ఆయనంటే మీకు కూడా చాలా గౌరవం వుందని అందరికీ తెలియటం మంచిదని నా అభిప్రాయం సర్...."

"అదేంటి వల్లీశ్వర్.... నాక్కూడా ఆయనంటే గౌరవమే. ఆయన నాకు సహాయం చేసిన సందర్భాలున్నాయి కదా! భాస్కరరెడ్డిని సిఎం చేయాల్సి వచ్చినప్పుడు కూడా పి.వి. నన్నూ, ఆయన్ను ఎదురెదురుగా కూర్చోబెట్టి నావాళ్ళకి ఎన్ని మంత్రి పదవులు ఇవ్వాలో స్పష్టంగా చెప్పారు. ఎటొచ్చీ ఆ ఇద్దరూ (జనార్దన రెడ్డి, విజయభాస్కరరెడ్డి వర్గాలు) నేనేదో పి.వికి వ్యతిరేకం అన్నట్లు ప్రచారం చేశారు కానీ, ఆయనెప్పుడూ నా గురించి వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడ లేదు. పైగా ఆయన సంస్కరణలు తెచ్చి దేశానికి మంచి చేశాడు కూడా...."

"మరి, వెళ్లి కలవచ్చు కదా సర్...."

"రేపు ఉదయం ఒకసారి మన బ్రీఫింగ్ అయ్యాక, ఫోన్‌లో అక్కడున్న వాళ్లతో కలుపు. ఇప్పుడు ఎవరున్నారు ఆయన సహాయకులు అక్కడ?"

"రాజశేఖర పాండే వున్నారు...."

మర్నాడు ఉదయం తన కార్యాలయ అధికారులతో రోజూవారీ సమీక్ష అయిపోయాక, నేను గుర్తు చేశాను. ఫోన్ కలపమన్నారు. పాండేజీతో మాట్లాడించాను.

"పాండేజీ, రాజశేఖర్ మాట్లాడుతున్నాను. పి.వి. సర్ ఎలా వున్నారు?... డాక్టర్లు ఏం చెబుతున్నారు?.... రావాలని చూడాలని వుంది? మాట్లాడగలనా?.... కనీసం ICCU లోకి వెళ్లి చూడవచ్చా?... మా నాయకుడయ్యా. చాలా గొప్ప నాయకుడు. నా మనసంతా అక్కడే వుంది...." ఇలా సాగింది ఆయన సంభాషణ. 4-5 నిమిషాల పాటు మాట్లాడారు.

మాట్లాడటం అయిపోయాక, "కనీసం చూడటానిక్కూడా ఎవర్నీ అనుమతించట్లేదట వల్లీశ్వర్! ఏం చేద్దాం? ఏ మాత్రం చూసే అవకాశం వున్నా చెప్తానని పాండే అంటున్నాడు. చూద్దాం మన అదృష్టం ఎంతో?.... Anyway, thanks" అన్నారు సిఎం

ఆ తరువాత పి.వి. ఆరోగ్యం ఇంకా క్షీణించింది. డిశంబరు 24న ఆయన తుదిశ్వాస తీసుకున్నారు.

హైదరాబాద్‌లో పి.వికి అంత్యక్రియలు జరిపి, సమాధి ఏర్పాటు చేసే అవకాశం మాత్రం రాజశేఖరరెడ్డిగారికి దక్కింది.

* * *



*డాక్టర్ మల్లాది కృష్ణానంద్ రచించిన 'ఆదాబ్ హైదరాబాద్' ఆవిష్కరణ సందర్భంగా*

# చంద్రబాబు నాయుడి తల్లి గురించి వైయస్సార్

**2005 జనవరి 7 తెల్లవారు ఝూమున.....**

ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డిగారు మూడు రోజుల విశ్రాంతి కోసం హైదరాబాద్ శివార్లలోని ఒక అతిథి భవనంలో వున్నారు.

సాధారణంగా ప్రతిరోజూ తెల్లవారుఝూమున నాలుగు గంటలకే హైదరాబాద్‌లో ప్రచురితమయ్యే తెలుగు, ఇంగ్లీషు దినపత్రికల సెట్ ఒకటి ముఖ్యమంత్రి ఇంటికి, ప్రధానకార్యదర్శి ఇంటికి, సమాచారశాఖ కమీషనర్ ఇంటికి, సిఎం ప్రధానపౌరసంబంధాల అధికారిగా నా ఇంటికి, ఇంటెలిజెన్స్ ఐ.జి ఇంటికి సరఫరా చేస్తారు. ఇది సమాచార పౌరసంబంధాల శాఖ పని.

కాని, సిఎం సిటీ బయట అతిథిభవనంలో వున్నప్పుడు ఈ పత్రికలు అక్కడికి చేరేసరికి బాగా ఆలస్యమయ్యేది.

ఆరోజు తెల్లవారు ఝూమున నాలుగున్నరకి అలవాటు ప్రకారం – పత్రికలు రాగానే ఒకసారి ప్రధాన హెడ్డింగ్‌లు చూస్తున్నాను. ఒకటి రెండు తెలుగు పత్రికలలో మొదటి పేజీలో చిన్న సింగిల్ కాలమ్ వార్త చూశాను. అర్ధరాత్రి దాటాక వచ్చివుంటుంది!

“చంద్రబాబు నాయుడుకి మాతృవియోగం” – అన్నదే ఆ వార్త.

వార్తలో ఆమె అర్ధరాత్రి దాటాక చనిపోయారనీ, చంద్రబాబు నాయుడుగారు ఒక ప్రైవేటు విమానంలో తెల్లవారు ఝూమున తిరుపతి బయల్దేరుతున్నారని వుంది.

సరే, ఇప్పుడు ఒక సిఎం సిపిఆర్ఓగా నేను చేయగలిగింది ఏమిటి?.... సిఎం చేత చంద్రబాబు నాయుడుగారితో మాట్లాడిస్తే?.... యస్. అలా చేయిస్తే రాజశేఖరరెడ్డిగారి మనసు, మానవతాగుణం అందులో ఆవిష్కృతమవుతుంది గదా?

అప్పటికి రాజకీయంగా ఇద్దరూ చాలా తీవ్రంగా ఎడమొహం, పెడమొహంగా ఉన్నారు. దానికి తోడు జలయజ్ఞం మీద అవినీతి ఆరోపణల రచ్చ జరుగుతోంది.

అయినా, సాయంత్రం ఎప్పుడో ఒక సంతాప సందేశపు ప్రకటన విడుదల చేయటంకన్నా, సిఎం చేత ఫోన్‌లో ఇప్పుడే మాట్లాడిస్తే, మంచిది కదా!... ఒకవేళ ఆయన మాట్లాడదలచుకోకపోతే?.... అలా చేయరు... ఆయన 'మాట్లాడను' అన్నా పోయిందేమీ లేదు. ఆయనకు ఏది మంచిదో అది నేను ప్రయత్నం చేసినవాణ్ణి అవుతాను.

అయిదుగంటలకి సిఎంకి ఫోన్ చేశాను. ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్ రెడ్డి నన్ను సిఎంతో ఫోన్‌లో కలిపారు.

విషయం చెప్పాను.... "సర్, మీరు చంద్రబాబు నాయుడిగారితో ఫోన్‌లో, రెండు మాటలు సంతాపం తెలుపుతూ మాట్లాడితే బాగుంటుంది...."

ఒక్క క్షణం కూడా సిఎం సంకోచించలేదు.

"ఆయన ఇప్పుడు ఎక్కడ వున్నారు?"

"తిరుపతికి ప్రత్యేక విమానంలో వెళ్తున్నారు సర్. మీకు మాట్లాడటానికి అభ్యంతరం లేదు కదా సర్...."

"అదేంటయ్యా! అమ్మ ఎవరికైనా అమ్మే గదా! కలిపించు మాట్లాడతా...."

నేను చంద్రబాబు నాయుడుగారి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నెంబరు సంపాదించి, రమేష్ రెడ్డికిచ్చాను. (ఆయన 2017-19లో హైదరాబాద్ – తూర్పు డి.సి.పి.) నాయుడు గారు తిరుపతిలో విమానం దిగి, కారు ఎక్కినట్లు రమేష్ రెడ్డి చెప్పగానే, సిఎంకి చెప్పాను. రమేష్ ఫోన్ కలిపారు.

రాజశేఖర రెడ్డిగారు మూడు నిమిషాల పాటు చంద్రబాబు నాయుడుగారితో వారి తల్లి అమ్మణ్ణమ్మ మరణం గురించి మాట్లాడారు. 'అమ్మ' ఔన్నత్యం గురించీ, అమ్మ లేనిలోటు గురించీ ఆయన భావాలు నాయుడు గారితో పంచుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తానన్నారు....

ఫోన్ కాల్ అయిపోయాక నాకు సిఎం ఫోన్ చేశారు.

"థ్యాంక్స్ వల్లీశ్వర్. మంచి పని చేశావు" అన్నారు.

ఆకాశవాణి ఏడుగంటల వార్తల్లోనే చంద్రబాబు నాయుడుగారిని వైయస్సార్ పరామర్శించిన వార్తని చెప్పించాను. టివిల్లో నడక వార్త సరేసరి.

* * *

# 'సునామీ' అడ్డు తొలగించిన వైయస్సార్

**2005 జనవరి 15……**

సమయం ఉదయం గం. 11.30….

సిఎం ఆఫీసు వుండే 'సి' బ్లాకులో గ్రౌండు ఫ్లోర్‌లో నేను క్రొత్తగా బాగు చేయించి వాడుకుంటున్న నా కార్యాలయంలో కూర్చుని ఏదో రాసుకుంటున్నాను.

సమాచారశాఖ కమీషనర్ కె.వి. రమణాచారి హడావుడిగా వచ్చారు.

"అన్నా, కొంప మునిగింది." అంటూ ఆంతరంగిక చర్చల గదిలోకి నన్ను లాక్కెళ్లారు.

"ఏం జరిగింది?…. ఎందుకంత ఖంగారు?"

ఆయన చాలా టెన్షన్‌లో వున్నారు. టెన్షన్ ఎక్కువగా వుంటే ధూమపానం చేయటం అప్పట్లో అలవాటు. ముందు అది చేసేశారు.

"అన్నా, చీఫ్ సెక్రటరీ మోహన్‌కందా వచ్చారన్నా. నేను సిఎం దగ్గర వుండగా వచ్చారు. వస్తూనే 'విజయవాడలో ఏవో నాటకాలు పెట్టావట గదా! మొన్నమొన్న (డిశంబరు 26న) సునామీ వచ్చి తీరప్రాంత గ్రామాలన్నీ దెబ్బతింటే, ఇప్పుడు బెజవాడలో నాటకాలు పెట్టడమేంటయ్యా! ప్రభుత్వ ప్రతిష్ఠకి ఎంత మచ్చ!….. అవి ఆపేసెయ్….' అన్నారన్నా… 'సిఎం గారూ, ఈ నాటకాలు ఇప్పుడు పెట్టడం మంచిది కాదు' అని సిఎంకి సలహా కూడా ఇచ్చేశారన్నా. సిఎం కూడా 'అయితే ఆపెయ్ రమణా' అన్నారు. నేను ఏం చెప్పాలని ప్రయత్నించినా సి.ఎస్ వినలేదు, సిఎం వినలేదు…… రేపే నాటకోత్సవాలు విజయవాడలో మొదలవుతున్నాయి. ఇప్పుడు 12 గంటలకు పత్రికా సమావేశం. నేను వెళ్లి ఎన్ని నాటకాలు, ఎంత మంది కళాకారులు….. ఈ వివరాలన్నీ చెప్పాల్సి వుంటే, ఇప్పుడేం చెప్పను! నందినాటకోత్సవాల్ని రద్దు చేశారని చెప్పాలా? కారణాలు ఏం చెప్పాలి? సిఎం పేరు, సి.ఎస్ పేరు చెప్పగలనా?…. ఏంటన్నా ఇదంతా!…. " అనుకుంటా నిర్వేదంలోకి వెళ్ళిపోయారు రమణాచారి.

రమణాచారిగారికి కళలన్నా, సాహిత్యమన్నా చాలా ఇష్టం. ఆయన ఏ పోస్టులో వున్నా సాహిత్యాన్ని, కళలనీ పోషించే వ్యక్తిగా పేరు పడ్డారు. ఇప్పుడు సమాచారశాఖ కమీషనర్ పదవితోపాటు, ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్, టెలివిజన్, థియేటర్ అభివృద్ధి సంస్థకి మేనేజింగ్ డైరెక్టరు కూడా. ఆ హోదాలో నాటకోత్సవాలని చాలా ప్రతిష్ఠాత్మకంగా విజయవాడలో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కి బయట నిర్వహించటం అదే మొదటిసారి కూడా. ఆయన తపన, ఆరాటం చూశాక నాకు చాలా బాధనిపించింది. ఎంతో మనసుపెట్టి ఆయన కార్యక్రమం చేస్తుంటే, విజయవాడకి సంబంధంలేని సునామీ పేరుతో వాటిని ఆపేయాలనటమేంటి?

ఒక ఐడియా ఇచ్చాను. దాని ప్రకారం – ఆర్థిక మంత్రి రోశయ్యగారికి రమణాచారి ఫోన్ చేశారు. విషయం అంతా చెప్పారు. "సర్, మీరు ఒక మాట సిఎంకి చెబితే బాగుంటుంది....." అన్నారు.

సిఎం, సి.ఎస్ కలిసి ఒక నిర్ణయం ప్రకటించాక తాను మాట్లాడటం బాగుండదని రోశయ్యగారు చెప్పారు. ఆయన కొన్ని సాంప్రదాయాలను పాటించే మనిషి. అంతే! మళ్లీ మొదటికొచ్చింది.

ఏం చేద్దాం! రమణాచారి గారి మొహంలో ఆదుర్దా, ఆరాటం, బెంగ.....!

సమయం 11.40.....

"ఓ పని చేద్దాం. ఇద్దరం కలిసి సిఎం దగ్గరకి వెళ్దాం. నేను మీకు మద్దతుగా సిఎంతో మాట్లాడతాను."

"లాభంలేదన్నా....."

"లాభం వుందోలేదో. ఇప్పుడు ఇదొక్కటే మార్గం. కొండకి దారం వేస్తున్నాం. వస్తే కొండ, పోతే దారం...." అన్నాను.

ఇంకో మార్గం లేదు. ఇద్దరం కలిసి నాలుగో అంతస్తులో సిఎం ఛాంబర్‌కి వెళ్లాం. అప్పటికి సమయం 11.45.

లోపల సి.ఎస్ ఇంకా వున్నారు. సిఎం వ్యక్తిగత సహాయకుడు సూరీడుకి చెప్పాను. "మేమిద్దరం ఈ ప్రక్కన భాస్కరశర్మ గదిలో వుంటాం. సి.ఎస్ గారు బయటకు వచ్చి, అలా వెళ్లగానే మమ్మల్ని లోపలికి పంపాలి. సరేనా!" సూరీడుకి మా పని అర్జంటు అని అర్థమైంది.

11.55 అయ్యేసరికి సి.ఎస్ బయటకు వచ్చారు. ఆయనటు వెళ్లగానే సూరీడు మమ్మల్నిద్దర్నీ లోపలికి పంపాడు.

సిఎం మమ్మల్ని ప్రశ్నార్థకంగా చూశారు. లోపలికి వెళ్తూనే నేను మొదలుపెట్టాను.

"సర్, మీరు నందినాటకోత్సవాలు ఆపేయమని చెప్పారటగదా?....."

"అవును వల్లీశ్వర్, సి.ఎస్ చెప్పారు – మొన్నీమధ్య సునామీ వచ్చింది కదా! ఇప్పుడు నాటకాలు పెడితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని....."

"సర్, సునామీ వల్ల విజయవాడలో నష్టం కలగలేదు. కాని, ఈ నాటకాలకి బర్హంపూర్, ఖరగ్‌పూర్, నాగపూర్, బొంబాయి, బెంగుళూరు, చెన్నై..... ఇలా చాలా ఇతర రాష్ట్రాల నుంచి కళాకారులు వస్తున్నారు సర్. వీళ్లంతా నాటకాల మీద సంపాదించుకునే ప్రొఫెషనల్స్ కాదు. ఉద్యోగాలు చేసుకుంటూ తీరిక సమయాల్లో సొంత ఖర్చుతో నాటకాలకి రిహార్సల్సు చేసుకునే ఔత్సాహికులు. వీళ్లు ఆర్నెల్ల ముందు నుంచి నందినాటకోత్సవాలకి తయారవుతారు. అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకుని రైళ్లలో వస్తారు. ప్రతినాటకంలో 10 మంది కళాకారులు వుంటే, వెనకాల టెక్నీషియన్స్ పది మంది వుంటారు. అయిదు రోజుల నాటకాలంటే కొన్ని వందల మంది భారీ సెట్టింగులు కూడా తయారు చేసుకుని వస్తారు.... సర్, మన నందినాటకోత్సవాల్లో బహుమతి రావటాన్ని వాళ్లంతా చాలా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు..... డిసెంబరు 26న వచ్చిన సునామీ వల్ల బెజవాడకి ఏమీ కాకపోయినా, ఈ నాటకోత్సవాలు చెడ్డపేరు తీసుకువస్తాయి అని మీరనుకుంటుంటే, వీటిని చివరి నిమిషంలో రద్దు చేయటం వల్ల ప్రభుత్వ ప్రతిష్ఠకి రంగస్థల కళాకారుల్లో ఇంకా చెడ్డపేరు వస్తుంది సర్....."

సిఎం రమణాచారి వంక చూశారు. ఆయన "అవును సర్" అంటూ ఆదుర్దాగా అన్నారు. నేను ఇంకో మాట చెప్పాను.

"సర్, మా సిఎం – కళల్ని, సాహిత్యాన్ని, క్రీడల్ని..... ఇలా అన్ని మంచి విషయాల్నీ ప్రోత్సహిస్తారు అని మేం చెప్పుకుంటుంటాం. 'ఆయనకి నాటకాలంటే ఇష్టంలేదు' అనే సంకేతాన్ని ఇప్పుడు పంపగలమా?.... వాటిని ఈ చివరి నిమిషంలో రద్దు చేయటం వల్ల నష్టమే ఎక్కువ సర్....."

సిఎం ఆసక్తిగా వినటాన్ని గమనించిన రమణాచారి గారు కొంచెం ఉత్సాహంగా కల్పించుకున్నారు.

"సర్, కళాకారుల ఉసురు మీ ప్రభుత్వానికి తగలకూడదు సర్....."

సిఎం మా ఇద్దర్నీ చూస్తూ దరహాసం చేశారు.

"సరే, చేసుకోండి......"

సలహా ఇచ్చింది ఎవరు అని కాక, ఆ సలహా వల్ల కలిగే మంచీచెడులను తన పరిణతితో బేరీజు వేయగల విజ్ఞత ఆ రెండు మాటల్లో నాకు కనిపించింది.

రమణాచారి ఖంగారు పడుతూ "మరి సి.ఎస్ గారు చెప్పారుగదా సర్....."

"అది నేను చూసుకుంటాలే. మీరు చేసుకోండి...."

సమయం 12 గంటలయింది.

రమణాచారి సిఎంకి నమస్కారం చేసి, లాంగ్ జంప్ చేస్తున్నంత వేగంగా లిఫ్ట్‌లోకి పరుగెత్తారు – ఎఫ్.డి.సిలో పత్రికాసమావేశంలో పాల్గొనటం కోసం.

ఆ నందినాటకోత్సవాలు ప్రభుత్వ ప్రతిష్ఠని పెంచాయి. ఎందుకంటే, హైదరాబాద్ దాటి బయట ప్రాంతాల్లో ఎఫ్.డి.సి వాటిని జరపటం అదే ప్రథమం.



*'నిప్పులాంటి నిజం' పుస్తకావిష్కరణ సభలో*

# ఏథెన్స్–వైయస్సార్

**2004 ఆగస్టు నెల 7...**

ఉదయం 9 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం తన కార్యదర్శులతో జరిపే రోజువారీ సమావేశం ముగిసింది. అందరూ వెళ్లిపోతున్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ కె.వి రమణాచారి, నేను మిగిలాం. సిఎం ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్ ఏవో కాగితాలు సర్దుకుంటున్నారు.

రమణాచారి వంక చూస్తూ సిఎం అడిగారు. "ఇంకేంటి రమణా, విశేషాలు?"

"సర్, ఈ నెల రెండో వారంలో ఏథెన్స్‌లో జరిగే ప్రపంచ ఒలింపిక్స్‌కి మన వాళ్లు ఏడుగురు వెళ్తున్నారు. మీరు ఒకసారి....." అంటూ అభ్యర్థిస్తున్నారు రమణాచారి.

"అదంతా స్పోర్ట్స్ అథారిటీ వాళ్లు చూస్తార్లే రమణా! చెప్పాను గదా!...." అంటూ సిఎం కొంచెం అసహనంగా అన్నారు. అంతలో జన్నత్ హుస్సేన్ అందుకున్నారు. "రమణా, సిఎం ఇదివరకే చెప్పేశారు. మళ్లీ ఎందుకు అదే విషయం ప్రస్తావిస్తారు?...." అంటూ గట్టిగా అన్నారు.

రమణాచారి చిన్నబుచ్చుకున్నారు. నేను సిఎంతో మాట్లాడే విషయాలు కూడా అయిపోయాయి. ఇద్దరం కలిసి బయటకొచ్చేశాం. లేక్‌వ్యూ గెస్టుహౌస్ మేడదిగి క్రింద గదికి వచ్చేశాం. రమణాచారి టెన్షన్ పడుతున్నారు. టెన్షన్‌లో ఒక ధూమపానం!

"అసలు విషయం ఏమిటి? మీరెందుకింత టెన్షన్ పడుతున్నారు?" అని అడిగాను.

"అన్నా, అంతర్జాతీయ ఒలింపిక్స్ ఈ ఆగస్టు 13 నుంచి ఏథెన్స్‌లో మొదలవుతున్నాయి. మన రాష్ట్రం నుంచి ఏడుగురు క్రీడాకారులు వెళ్తున్నారు. వాళ్లకి సిఎం తేనీటి విందు ఇచ్చి, నాలుగు మాటలు చెప్పి ప్రోత్సహిస్తే ఎంత బాగుంటుంది! నేనిది రెండోసారి సిఎంకి చెప్పడం. స్పోర్ట్స్ అథారిటీ వాళ్లు ఎలాగూ పట్టించుకోవడం లేదు. సిఎం అయినా చొరవ తీసుకోవద్దా?.... చెప్పు....."

రమణాచారిగారి ఆవేదన నాకు అర్థమైంది. గతంలో ఆయన స్పోర్ట్స్ అథారిటీ కార్యదర్శిగా చేసినవాడు. క్రీడల విలువ తెలిసినవాడు. ఈయన తపన అంతా ఆ ఏడుగురు

క్రీడాకారులకి సిఎం చేత నాలుగు ప్రోత్సాహక వాక్యాలు చెప్పించాలని. మంచిదే కదా! రాష్ట్ర అధిపతి ఇచ్చే ప్రోత్సాహం ప్రభావం చాలా వుంటుంది కదా!....

ఇలా అనుకుని రమణాచారి గారితో అన్నాను. "ఓ పని చేద్దాం. మనిద్దరం మళ్లీ సిఎంని కలుద్దాం. నేనూ ప్రయత్నం చేస్తాను. అయితే ముందుగా మన ఏడుగురు క్రీడాకారులు ఏయే ఫోన్‌ల మీద దొరుకుతారో కనుక్కోండి...."

రమణాచారి టకటకా మొబైల్ ఫోన్‌లో వాకబు చేశారు. తేలిందేమిటి? ముగ్గురు క్రీడాకారులు అప్పటికే ఏథెన్స్ చేరిపోయారు. ఇంకో ముగ్గురు ఆ రోజు ఉదయాన్నే ఏథెన్స్‌కి విమానం ఎక్కారు. ఒక్క కరణం మల్లీశ్వరి మాత్రమే మిగిలింది. ఆమె కూడా ఆ ఒక్కరోజు ఢిల్లీలో వుండి మర్నాడు ఏథెన్స్ బయల్దేరుతుంది. కొంచెం నీరసం వచ్చింది. అయినా ఆశ చావలేదు.

"ఎక్సలెంట్... మీరు వెంటనే కరణం మల్లీశ్వరికి ఫోన్ చేసి ఆశీస్సులు చెప్పండి. అలా చెప్పటం ద్వారా ఆమె ఆ నెంబరులో ఇప్పుడు వుందో లేదో నిర్ధారించుకోవాలి. ఆమె వుంది అంటే, మనం మళ్లీ సిఎం దగ్గరకి వెళ్దాం...." అన్నాను రమణాచారితో.

ఆయన మల్లీశ్వరికి ఫోన్ చేశారు. ఆమె దొరికింది. "Best of Luck చెప్పటానికే ఫోన్ చేశాను" అన్నారు.

ఇంక నేను ఆలస్యం చేయలేదు. రమణాచారి గారితో కలిసి మళ్లీ మేడ మీద సిఎం గదికి వెళ్లాను. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎ.వి.యస్.రెడ్డితో సిఎం మాట్లాడుతున్నారు. ఓ పదినిమిషాలు నిరీక్షించాల్సి వచ్చింది.

ఎ.వి.యస్ బయటికి వస్తూండగానే, సూరీడుకి చెప్పాను. "మేమిద్దరం మాట్లాడటం అయ్యేదాకా ఎవ్వర్నీ లోపలికి పంపకు...." అలా అంటూనే రమణాచారి, నేను లోపలికెళ్లిపోయాం.

సిఎం మావంక చూసి "మళ్లీ ఏమిటి?" అన్నారు. ఈసారి రమణాచారిగారు మాట్లాడలేదు. నేను మాట్లాడుతున్నాను.

"సర్, ఏథెన్స్‌లో జరిగే అంతర్జాతీయ ఒలింపిక్స్‌కి మన క్రీడాకారులు ఏడుగురు వెళ్తున్నారు...."

సిఎం ముఖం చిట్లించారు. "చెప్పేశాను గదా! ఇంకేంటి?"

"కొంచెం వినండి సర్. మొత్తం ఏడుగురిలో ముగ్గురు ఇప్పటికే ఏథెన్స్ చేరిపోయారు. ఇంకో ముగ్గురు విమానం ఎక్కేశారు. ఒక్కళ్లే మిగిలారు. ఆ ఒక్కళ్లూ కరణం మల్లీశ్వరి..... వీళ్లకి ఘనంగా వీడ్కోలు ఇచ్చేందుకు స్పోర్ట్స్ అథారిటీ వాళ్లు ఏమీ చేయలేదు. వాళ్లు చేసినా, ఒక్క ప్రోత్సాహక పదం మీ నుంచి వచ్చినంత ప్రభావం వుండదు.... సర్, మా ముఖ్యమంత్రికి కథలన్నా, సాహిత్యమన్నా, క్రీడలన్నా, ఆటలన్నా.... ఇలా ఏ మంచి విషయమయినా ఇష్టమే. ఇలాంటి మంచి విషయాలన్నింటిని ప్రేమించటం ఆయన తత్త్వం – అని ప్రపంచానికి తెలియజెప్పటం మా బాధ్యత. అలా మేం చేయాలంటే మీరు కొంచెం చొరవ తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రికి క్రీడలంటే ఇష్టం లేదు, సాహిత్యం, కళలు అసలు గిట్టవు – అని ఆయా వర్గాల్లో చెప్పుకోవటం మీ ప్రతిష్ఠకి మంచిది కాదు సర్...... కొంచెం అర్థం చేసుకోండి...." అంటూ అభ్యర్థించాను.

సిఎం ముఖం ప్రసన్నమైంది.

"సరే, ఇప్పుడేంచేయాలి చెప్పు."

"కరణం మల్లీశ్వరితో మాట్లాడండి సర్" అన్నాను. సిఎం "సరే, కలుపు" అన్నారు. రమణాచారి వెంటనే మల్లీశ్వరిని ఫోన్‌లోకి తీసుకున్నారు. "అమ్మా, సిఎం గారు మాట్లాడతారు...." అంటూ ఫోన్ సిఎం కిచ్చారు.

సిఎం ఏం మాట్లాడారు?

"అమ్మా, మల్లీశ్వరి, వెరీ సారీ. నేను మీ ఏడుగురినీ కలవాలనుకున్నాను. మా రమణాచారి చెబుతూనే వున్నాడు కానీ, నాకు పనుల వత్తిడివల్ల కుదరలేదు. కాని మీరంతా రాష్ట్రానికి గర్వకారణం.... మీ మిగతా ఆరుగురికి కూడా చెప్పు. ఈ ఒలింపిక్స్‌లో మీరు స్వర్ణం, రజితం..... ఏది తెచ్చినా మీ కోసం పది కోట్ల మంది ప్రజలు ఎదురుచూస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజెప్పే బాధ్యత మీ భుజస్కంధాల మీద వుంది. నేను మిమ్మల్ని కలుసుకోలేకపోయినా నా మనసంతా మీరే వున్నారు.... క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్‌ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలి మీరంతా....." అలా మనసారా ప్రోత్సాహకరంగా మల్లీశ్వరితో మాట్లాడారు సిఎం

ఆయన సంభాషణ మూడు నిమిషాలు నడిచింది.

మరో అరగంటలో నేను మీడియాకి ప్రెస్‌నోట్ పంపించాను.

* * *

# వైయస్సార్ డైరీలో ఒక రోజున....!

**2005 ఆరంభంలో ఒక రోజున ఒక ఆలోచన వచ్చింది.**

మన ముఖ్యమంత్రి పొద్దున్న 8 గంటల నుంచీ క్యాంపు కార్యాలయంలో ఎక్కడెక్కడ్నుంచో వచ్చిన సామాన్యప్రజల్ని కలుసుకుంటున్నారు. ప్రతి ఒక్కళ్ల సమస్య వింటున్నారు. చేయగలిగింది, చేస్తున్నారు. చేయలేనిది 'చెయ్యలేను' అని ఓపిగ్గా, అనునయంగా చెప్పి పంపిస్తున్నారు.

వచ్చినవాడు మరీ పేదవాడైతే, వాడికి తిరుగు ప్రయాణానికి రైలు ఛార్జీలు, భోజనం ఖర్చులు కూడా సూరీడు ద్వారా ఇచ్చి పంపిస్తున్నారు.

తెల్లవారుఝామున 5 గంటలకి లేచి, పత్రికలు చదవటం, శారీరక వ్యాయామం చేయటం, అర్జంటు టపాల్సు (ముందు రాత్రి సీల్డు కవర్లలో అధికారులు లేదా మంత్రుల నుంచి వచ్చిన లేఖలు) చదవటంతో మొదలుపెట్టి రాత్రి 8-9 గంటల దాకా పని చేస్తున్నారు. రోజుకి నాలుగైదు అధికారిక సమావేశాలు, విఐపిలు, పెట్టుబడిదారులు వస్తే కలుసుకోవటం, మధ్యాహ్నం నుంచి ప్రజాప్రతినిధుల్ని కలుసుకోవటం, సాయంత్రం సభలు, సమావేశాలు, రోజుకి 40-50 సార్లు ఢిల్లీ సహా ఎక్కడెక్కడి ఫోన్ కాల్సు మాట్లాడటం......

ఇన్ని చేస్తున్నారు కదా! ఈయన రాష్ట్రం కోసం ఇలా రోజూ ఎంత కష్టపడుతున్నారో ప్రజలకి తెలిసేలా చేయటం ఎలా? ఎలా?.... అన్ని ప్రశ్నించుకున్నాను.

ఒక ఆలోచన వచ్చింది. ఏదో ఒక మంచి న్యూస్ ఛానల్ కావాలి. ఏ న్యూస్ ఛానల్ అయితే నా ఆలోచనకి సహకరిస్తుంది? పైగా అది ప్రజాదరణ కలిగిన ఛానల్ అయి వుండాలి కదా! 'టి.వి.9'ని ఎంచుకున్నాను. ఆ ఛానల్ ప్రతినిధి మురళీకృష్ణకి కబురు చేశాను. ఇతని తండ్రి ప్రకాశ శాస్త్రిగారు నాకు మిత్రులు. ఒకప్పుడు ఇద్దరం 'ఆంధ్రపత్రిక'లో రిపోర్టర్స్‌గా పనిచేసిన వాళ్లం. ఆయన విజయవాడలో, నేను ఏలూరులో పనిచేశాం. మురళీకృష్ణ కూడా 'ఈనాడు' లో నేను వున్న కాలంలో పనిచేశారు. మురళీకృష్ణలో ప్రొఫెషనలిజం వుంది.

"మురళీకృష్ణా, మీకు ఒక ప్రత్యేక కార్యక్రమం చేయటానికి అవకాశం వచ్చింది. చేస్తారా?...."

"ప్రత్యేకంగా అంటే మాకు మాత్రమే ప్రత్యేకమా? ప్రత్యేకం అని చెప్పి ఇంకా ఇద్దరు ముగ్గురికిస్తారా?" ఇది మురళీకృష్ణ ప్రశ్న. (కొంత మంది అలా చేసిన PRO లు కూడా వున్నారు).

"మీకిచ్చే అవకాశాన్ని నేనింకెవరికీ ఇవ్వటం లేదు. ఇది పూర్తయ్యేదాకా ఎవరికీ తెలియకూడదు కూడా...."

"చెప్పండి..."

"ముఖ్యమంత్రి డైరీలో ఒక రోజు – అని కార్యక్రమం టైటిల్ పెట్టాలి. ఉదయం 5 గంటలకి సిఎం నిద్రలేచిన దగ్గర్నుంచి, రాత్రి ఆయన ఇంటికి తిరిగి వెళ్లేదాకా మీరు ఆయనతోనే వుంటారు. మధ్యాహ్నం ఆయన భోజనం చేసే సందర్భంతో సహా అన్ని మీటింగ్‌లు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులు అన్నీ రికార్డు చేసుకోండి. కానీ, అన్నీ ఒక్కరోజే. నీట్‌గా ఎడిట్ చేసి వెయ్యండి. దీన్ని న్యూస్ ప్రోగ్రామ్ లాగా చూపించాలే తప్ప, మధ్యలో వ్యాఖ్యానాలుండకూడదు...."

మురళీకృష్ణ ఒక్క రోజు సమయం అడిగారు. క్రమశిక్షణ కలవాడు కావటం వల్ల "మా బాస్‌ని అడిగి చెబుతాను సర్. నేనైతేరెడీ....."

మర్నాడు మురళీకృష్ణ సంసిద్ధత తెలియజేశాడు. అప్పుడు నేను సిఎంని ప్రత్యేకంగా కలిసి ఈ విషయం చెప్పాను. ప్రక్కన సూరీడు వున్నాడు.

"అంటే ఏం చేస్తారు?" సిఎం అడుగుతున్నారు.

"పొద్దుట మీరు లేచిన దగ్గర్నుంచీ...."

"అంటే బెడ్‌రూమ్‌లోకి వచ్చేస్తారేంటయ్యా?...."

సూరీడు నవ్వాడు.

నేను చిన్నబుచ్చుకున్నాను. సిఎం అయితే జోక్ చేశారు. కానీ, సూరీడు నవ్వాడు కదా?

"లేదు సర్, మీరు మేడ దిగి క్రిందకొచ్చి పేపర్లు చదువుకోవటం దగ్గర్నుంచి మొదలవుతుంది...."

"ఓ.కె. ఎప్పుడు?"

"రేపే సర్. ఎనీప్రాబ్లమ్...."

"నాకు ఏ రోజైనా ఫరవాలేదు. నేను ఖాళీగా కూర్చున్న రోజంటూ ఏదన్నా వుందా....?"

అనుకున్నట్లుగా మర్నాడు ప్రొద్దుట సిఎం గారింటికి అయిదుగంటలకి మురళీకృష్ణని, టి.వి9 కెమెరామ్యాన్‌ని తీసుకుని వెళ్లాను. బెల్‌కొట్టగానే సూరీడు తలుపు తీయటం దగ్గర్నుంచి షూటింగ్ మొదలైంది. ఇంట్లోకి వెళ్లేసరికి, సిఎం ఆకుపచ్చ లుంగీ, లాల్చీ ధరించి సోఫాలో కూర్చుని టేబిల్ ల్యాంపు ముందు టపాల్స్ చూసుకుంటున్నారు.

మురళీకృష్ణ ఆయనకి 'గుడ్ మార్నింగ్' చెప్పి కెమెరా సెట్ చేసుకుంటున్నాడు. అతనికి ఎలాంటి ప్రశ్నలు ఈ ఉదయం అడిగితే మంచిదో చెప్పాను.

ఇవతల కొచ్చి, సిఎంకి నా మొబైల్ నుంచి ఫోన్ చేశాను. ఎత్తారు.

"సర్, అతను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతాడు సర్. ఆ తరువాత మీ పనులు రికార్డు చేసుకుంటూ వెళ్తాడు సర్....."

"ఓ.కె."

సామాన్యప్రజలను ఆకట్టుకునేలా ఎలాంటి ప్రశ్నలు అడగమని నేను మురళీకృష్ణకు సూచించానో కూడా సిఎంకి ఫోన్‌లో చెప్పాను.

అంతే, ఆ రోజంతా టి.వి9 ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారి కారులో ఆయనతోనే తిరిగింది. ఆ రోజు సిఎంకి అసలు విరామం లేకుండా పోయింది.....

టివి9లో వచ్చిన "... 'ముఖ్యమంత్రి డైరీలో ఒకరోజు' ఐడియా చాలా బాగుంది వల్లీశ్వర్" అని ప్రసారం అయిన మర్నాడు కె.వి.పి అభినందించారు.

* * *

# ....చెప్పకుండానే చెప్పేసిన వైయస్సార్

**2005 మార్చి 13.....**

ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారి జయంతి.

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం వెనకాల బూర్గుల విగ్రహం ఒక ఎత్తైన వేదిక మీద ప్రతిష్ఠించి వుంది. ప్రతి జయంతికి ముఖ్యమంత్రి వెళ్లి పూలదండలు వేసి, నివాళులు అర్పించటం ఆనవాయితీ.

అలాగే ఆ రోజు ముఖ్యమంత్రి క్యాంపు ఆఫీసు నుంచి సిఎంతో నేనూ బయల్దేరాను. కారులో నాతోపాటు స్థానిక కాంగ్రెసు నాయకుడు దానం నాగేందర్ కూడా ఎక్కారు. నాగేందర్ సిఎంతో ఏదో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. బూర్గులవారి జీవిత చరిత్రని సంక్షిప్తంగా సిఎంకి వివరించటం నా విధి. మాకున్న సమయం 10 నిమిషాలు. నేను నాగేందర్‌గారిని గౌరవంగా ఆపి, బూర్గులవారి విశేషాలున్న కాగితాన్ని సిఎంకి చూపించి, వివరిస్తున్నాను.

నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయాక, వెల్లోడి ఆధ్వర్యంలో (తాత్కాలిక) ప్రభుత్వం ఏర్పడడం, తరువాత తొలిముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు ఎన్నిక..... ఇవన్నీ సిఎం చదువుతూ, ఒక ప్రశ్న వేశారు.

"అక్కడ మీటింగ్ ఏమన్నావుందా?"

"లేదు సర్....."

"మరి ఇదంతా ఎందుకు?"

"అకస్మాత్తుగా ఎవరన్నా ఏదన్నా అడిగితే....? మీకు విషయాలన్నీ తెలిసి వుండాలి కదా!"

సిఎం చివరి దాకా చదివారు. హైదరాబాద్ రాష్ట్రంతో ఆంధ్రరాష్ట్రం కలిసిపోయి, విశాలాంధ్రగా ఏర్పడితే తెలుగు వారంతా కలిసి వుంటారనీ, తెలుగుజాతి ఒక్కరాష్ట్రంగా

వుంటుందనీ, తెలుగు సంస్కృతీ వైభవం గొప్పగా ప్రకాశిస్తుందనీ..... ఇలాంటి ఉదాత్తమైన భావాలతో బూర్గుల రామకృష్ణారావు గారు తన ముఖ్యమంత్రి పదవిని త్యజించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకి మార్గం సుగమం చేశారని వివరించాను. ఆ బుల్లెట్స్ అన్నీ సిఎం చదువుకున్నారు.

బూర్గులవారి విగ్రహం దగ్గరకొచ్చేశాం. అక్కడ స్థానిక కాంగ్రెసు నాయకులు సిఎంకి సగౌరవంగా స్వాగతం చెబుతున్నారు.

బూర్గుల విగ్రహం వున్న వేదికకి రెండు వైపులా మెట్లు వుంటాయి. ఒక వైపు నుంచి ఎక్కి రెండో వైపు నుంచి దిగుతారు. సిఎం ఎటు నుంచి ఎక్కుతారో అక్కడ కాంగ్రెసు నాయకుల స్వాగతం, పరిచయం హడావుడి నడుస్తోంది. రెండో మెట్ల దారిలో 2-3 న్యూస్ టి.వి. కెమెరాలున్నాయి. వాళ్ల దగ్గర కెళ్లాను. వాళ్లలో ఒక న్యూస్ కెమెరామ్యాన్ కొంత న్యూస్‌సెన్స్ వున్నవాడు. అతని ముందుకెళ్లి చెప్పాను.

"సిఎం గారిని ఏదన్నా అడగండయ్యా."

"ఏం అడగచ్చు సార్?"

"40 ఏళ్ల క్రితం నాటి బూర్గుల రామకృష్ణారావుగారి జీవితానికి ఇప్పటి రాజకీయాల్లో ఏం స్థానం వుంది?.... అని అడుగు. ఇంకా ఎందుకు ఆయన్ని తలుచుకుంటున్నాం?.... అని అడుగు. ఏదో ఒకటి అడిగెయ్...."

"సిఎం చెబుతారంటారా?"

"అది ఆయన ఇష్టం. ఇది నీ హక్కు....." అనేసి ఇవతలకి వచ్చేశాను.

ఈ లోపల సిఎం, ఇతర నాయకులు వేదిక ఎక్కేశారు. బూర్గుల వారి విగ్రహానికి దండలు వేస్తున్నారు. నేను మెల్లగా సిఎం దగ్గరకి వెళ్తున్నాను. నేను వెళ్లే సరికి సిఎం దండలు వేయటం అయిపోయింది. ఆయన వచ్చిన మెట్లదారి మీదే దిగాలనుకుని వెనక్కి తిరిగి రెండు అడుగులు వేశారు. నేను చటుక్కున దగ్గరకు వెళ్లి, "ఆ మెట్ల మీంచి దిగాలి సర్....." అని రెండో వైపు (కెమెరాలున్న వైపు) చూపించాను.

"ఓ.కె" అంటూ సిఎం అటు వెళ్లారు.

ఆ మెట్లమీద అడుగుపెట్టగానే, నా సూచనతో ఉత్సాహం వచ్చిన కెమెరామ్యాన్ సిఎంని అడిగేశాడు.

"సర్, ఒక్క మాట. బూర్గుల రామకృష్ణారావు గారు చనిపోయి చాలా ఏళ్లయిపోయింది కదా! ఇప్పుడు ఇంకా ఆయన్ని గుర్తు చేసుకుంటున్నాం. అంత గొప్ప నాయకులా సర్?...." అని అతనికి తోచిన విధంగా వేగంగా అడిగేశాడు.

సిఎం రాజశేఖరరెడ్డి ఏమాత్రం తొట్రుపడకుండా ఆగారు. అతని కెమెరా వంక చూశారు. మరో రెండు న్యూస్ కెమెరాలు కూడా సిఎం మీద కేంద్రీకృతమయ్యేదాక ఆగారు.

"చాలా తప్పుగా అనుకుంటున్నారయ్యా. ఆయన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. దేశభక్తుడు. ఈ దేశంలో తెలుగు వాళ్లంతా ఒక జాతి అని నమ్మినవాడు. తెలుగు వాళ్లంతా కలిసివుండాలని, అలా కలిసుంటే తెలుగునేలకి న్యాయం జరుగుతుందనీ ఆశించినవాడు. అందుకోసం తన ముఖ్యమంత్రి పదవిని తృణప్రాయంగా ఎంచి త్యాగం చేసినవాడు...... అంత గొప్ప దేశభక్తుడు. ఆయన త్యాగం మాకు ఆదర్శం. ఏ లక్ష్యం కోసం అయితే ముఖ్యమంత్రి పదవిని ఆయన త్యాగం చేశాడో ఆ లక్ష్యం కోసం మనం అందరం పని చేయాలి. చేస్తాం...." అంటూ సిఎం మెట్లు దిగి వెళ్లిపోయారు.

నేను నా కారులో ఆఫీసుకి వెళ్లిపోయాను. ఒక్క పదినిమిషాల్లో సిఎం చెప్పింది ఆ 2-3 ఛానల్స్‌లో నడిచేవార్త (scrolling) గా వచ్చేసింది. అరగంటకల్లా ఆయన మాట్లాడిందంతా యథాతథంగా న్యూస్‌లో వచ్చింది.

అక్కడ, మీటింగ్ ఏమీ లేదని రావటం మానేసిన మీడియా ప్రతినిధులంతా ఈ వార్త చూసి, ఓ గంటలో నా ఆఫీసుకొచ్చేశారు.

"ఏమిటి సర్, రాజశేఖర రెడ్డిగారు ఏదో విధాన ప్రకటన చేసేశారట. మాకు తెలీనే లేదు. చెప్పండి.... చెప్పండి. ఏం జరిగింది? సిఎం ఏం చెప్పారు?....."

యథాతథంగా చెప్పాను.

నన్ను చాలా ప్రశ్నలడిగారు.

"అంటే అర్థం ఏమిటండీ! సిఎం గారు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకి వ్యతిరేకమా?.... ఆంధ్రప్రదేశ్ విభజన జరగకూడదని కోరుకుంటున్నారా? – జరగాలని కోరుకుంటున్నారా?.... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితితో కలిసి ఎన్నికలలో పోటీ చేసింది కదా కాంగ్రెసు పార్టీ! ఇప్పటికీ మిత్రపక్షమే కదా! ఇప్పుడు సిఎం గారు ఇలా అన్నారంటే ఉద్దేశ్యం ఏమిటి?" ఇలా అనేక ప్రశ్నల్ని మీడియా మిత్రులు సంధించారు.

ఓపిగ్గా మళ్లీ మళ్లీ సిఎం ఏం చెప్పారో అవే వాక్యాల్ని యథాతథంగా చెప్పాను. అది చాలా సున్నితమైన అంశం. నాకు తెలుసు. నేను ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన సందర్భం అది. ముఖ్యమంత్రి మనసులోవున్న రాజకీయ వైఖరి ఏమిటో నాకు తెలుసు. కాని, అది నేను సూటిగా చెప్పలేను. బూర్గుల జయంతి నాడు కెమెరాల ముందు రాజశేఖరరెడ్డిగారు చాలా లౌక్యంగా తమ వైఖరిని బూర్గుల వారి పేరు మీద వ్యక్తం చేశారు. దాన్ని మీడియా మిత్రులు ఎవరి కోణంలో వాళ్లు వ్యాఖ్యానించారు.

ఆ సాయంత్రం, ఆఫీసులో ఒక మీటింగ్ అయిపోయాక, సిఎంతో పాటు బయటకొస్తూ నేను సన్నగా ఆయనతో అన్నాను. "బూర్గుల వారి విగ్రహం దగ్గర మీరు మాట్లాడిందే ఇప్పుడు అన్ని టి.విలలో ప్రముఖవార్తగా చర్చనీయాంశమైపోయింది సర్...."

సిఎం నా వంక చిరునవ్వుతో చూసి, భుజం తట్టి వెళ్లిపోయారు.

* * *



*ముఖ్యమంత్రి జన్మదినోత్సవ సందర్భంగా*

# విజయమా? పునరంకితమా?

**2005 ఏప్రిల్ 21.....**

ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్ ఆ ఉదయం సిఎం కార్యాలయ అధికారులతో ఒక సమావేశం నిర్వహించారు.

"డాక్టర్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించి మే 14 నాటికి ఏడాది పూర్తికావస్తోంది. ఆ రోజు ఒక విజయోత్సవం నిర్వహించాలని పార్టీ వర్గాల అభ్యర్ధన. ముఖ్యమంత్రి కూడా చేయాలనే అంటున్నారు. సిఎం కార్యాలయం నుంచి సిఎం ప్రతిష్ఠ పెరిగేలా మనమేం చేయగలం? చెప్పండి....." అని అడిగారు.

ఆ సమావేశంలో పాల్గొన్న సమాచారశాఖ కమిషనర్ కె.వి.రమణాచారి, సిఎం కార్యదర్శులు ఎం.వి.జి. కుమారభాను, సుబ్రహ్మణ్యం, లవ్ అగర్వాల్, ప్రతాప్, OSD జనార్దన రెడ్డి..... ఎవరికితోచిన సలహాలు వాళ్లు ఇచ్చారు. పత్రికల్లో వ్యాసాలు రాయించాలనీ, ఛానళ్లలో డిబేట్స్ నిర్వహించాలనీ...... ఇలాంటివే చాలా ప్రతిపాదనలు వచ్చాయి. అవేవీ నాకు కొత్తగా అనిపించలేదు. నాకు వచ్చిన ఆలోచన వేరు. కాని దాన్ని అప్పుడు అక్కడ చెప్పాలనిపించలేదు???

జన్నత్ హుస్సేన్ అందరి ఆలోచనలనూ కలిపి తీసుకెళ్లి ఆ సాయంత్రం సిఎంకి వివరించారు.

నేను ఏం చెప్పాలనుకున్నానో దాన్ని సిఎంకే నేరుగా చెప్పాలనిపించింది. ఆ రాత్రి ప్రింటింగ్ ప్రెస్ వున్న మిత్రుడు రామచంద్రయ్య (సాయి శ్రీనివాస ప్రింటర్స్) దగ్గరకు వెళ్లి, wall – hanging ఫ్లెక్సీ డిజైన్ చేయించాను. అందులో దరహాసంతోవున్న సిఎం ముఖం ప్రస్ఫుటంగానూ, వెనకాల అశేషప్రజానీకం అస్పష్టంగానూ వుంటారు. దాని క్రింద ముఖ్యమంత్రి చెబుతున్నట్లుగా నాలుగు లైన్లు వుంటాయి.

**ప్రతిగుండెలో శాంతి, సంతృప్తి**
**ప్రతి గడపలో సౌభాగ్యం, సంతోషం**
**ఇవే మన లక్ష్యం.**

**అందరి కోసం ప్రతి ఒక్కరం సమష్టిగా శ్రమిద్దాం.**
**'హరితాంధ్ర ప్రదేశ్' సాధనకు పునరంకితమవుదాం.**

**2005 మే 13**

**మీ**
**వైయస్. రాజశేఖరరెడ్డి**
**ముఖ్యమంత్రి**

ఇది ప్రతి ప్రభుత్వ ఆఫీసులోనూ ప్రదర్శించగలిగితే, ప్రజల మనస్సులో 'వైయస్సార్' ముద్ర బలంగా పడుతుందని నా నమ్మకం.

అలాగే మే14 నాడు జరిపే ఉత్సవాన్ని 'విజయోత్సవం' అని కాక, 'పునరంకిత దినోత్సవం' అంటే హుందాగా వుంటుందని నేను నమ్మాను.... అందుకే ఈ భావాన్ని పై డిజైన్‌తో కలిపి ఆ రాత్రి సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రికి పంపించాను.

ప్రొద్దుటే రాజశేఖరరెడ్డిగారు క్యాంపు ఆఫీసుకి బయల్దేరే సమయానికి సిఎం ఇంటికి వెళ్లాను. ఆయనతో పాటే క్యాంపు ఆఫీసుకి బయల్దేరాను. సిఎం అప్పటికే నా ప్రతిపాదన మీద 'DISCUSS' అని రాశారు. దారిలో కారులోనే సిఎంతో మాట్లాడాను.

ఆ ప్రతిపాదనలో ఇంకో విషయం రాశాను. "ఆ మే 14 ఉదయం ముఖ్యమంత్రి – అందరు కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులతో ఒక సమావేశం జరుపుతారు. అందులో సిఎం తమ ప్రభుత్వ లక్ష్యాలని, వాటికి తాము పునరంకితమవుతున్న విషయాన్ని ప్రకటిస్తారు. పునరంకిత సందేశం ఒకటి (2 నిమిషాలు) చదువుతారు.... అప్పుడు Wall – Hanging విడుదల చేస్తారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని అన్ని టి.విలలో ప్రత్యక్షంగా ప్రసారం చేసేలా సమాచారశాఖ కమీషనర్ చూస్తారు...."

మొత్తం కార్యక్రమం టివిలలో ప్రత్యక్షంగా ప్రసారం అవుతుంది అన్నది సిఎంకి నచ్చింది. అలాగే 2 నిమిషాల పునరంకిత సందేశం కూడా నచ్చింది.

క్యాంపు ఆఫీసుకి వచ్చి, కూర్చుని, wall hanging లో రంగుల్లో మార్పుల గురించి సిఎం చెబుతున్నారు. సరిగ్గా అప్పుడే జన్నత్ హుస్సేన్ వచ్చారు. నేను లేచి నిలబడి, "మీరు నిన్న అడిగారు కదా ప్రతిపాదనలు. అదే సర్, సిఎంగారికిచ్చాను. చిరుమార్పులు చెబుతున్నారు....." అన్నాను. జన్నత్ నా వంక కొంత అసహనంగా చూశారు.

అంతలో సిఎం అన్నారు.

"జన్నత్, వల్లీశ్వర్ ప్రతిపాదన బాగుంది. మే 14న 10 గంటలకి జూబ్లీ హాలులో

అందరు సెక్రటరీలతో ‘పునరంకిత సమావేశం’ ఏర్పాటు చేయండి. అక్కడ నేను ఈ సందేశం చదువుతాను. ఆ wall hanging ఆవిష్కరిస్తాను...” అన్నారు.....

“అన్నట్లు జన్నత్, ఆ రోజు ఉత్సవాన్ని ‘విజయోత్సవం’ అనకండి. ‘పునరంకిత దినోత్సవం’ అనే మీడియాలో వచ్చేలా చూడండి....” అని సిఎం నొక్కి చెప్పారు.

ఆ కార్యక్రమం మొత్తం జూబిలీహాలులో ఆ ప్రతిపాదన ప్రకారమే జరిగింది. అదంతా టివిలలో ప్రత్యక్ష ప్రసారం అయింది.



Sir,

1. May 14ను 'one year celebrations' అని కాక ‘పునరంకిత దినోత్సవం’ (హరితాంధ్రప్రదేశ్ సాధనకు పునరంకితమవుదామన్న సందేశం) అన్న టైటిల్‌తో నిర్వహిస్తే చాలా హుందాగా వుంటుందనుకుంటాను.

2. మే 13న ప్రతి మండల కేంద్రంలోనూ ‘పునరంకిత ప్రతిన’ (నమూనా జతపరచబడింది) ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తే ఈ క్రింది ప్రయోజనాలు వుంటాయి.

ఎ) మండల స్థాయిలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనటానికి ఒక కార్యక్రమం వుంటుంది.

బి) మండల కార్యాలయంలో రోజువారీ సందర్శకులు ... ‘...తిన’ display చేయటం వల్ల ...న్ని చూసిన ప్రతిసారీ మొదటి ...భుత్వం ఎన్నో కార్యక్రమాలు ... - మనసులో స్థిరపడుతుంది. ...హరితాంధ్రప్రదేశ్)– స్వరూపం ...నానే అవకాశం వుంటుంది.

వల్లీశ్వర్



**‘పునరంకిత సందేశం’ విడుదల**

(13 మే 2005, జూబ్లీహాలు)

**ఉదయం**

| | |
|---|---|
| గం. 10.00 | ప్రార్థన (‘మా తెలుగుతల్లికి మల్లెపూదండ...) |
| గం. 10.03 | స్వాగత వచనాలు (ప్రధాన కార్యదర్శి) |
| గం. 10.05 | ‘పునరంకిత సందేశం’ విడుదల (గౌ.ముఖ్యమంత్రి) |
| గం. 10.07 | ప్రజలకు సందేశం (గౌ.ముఖ్యమంత్రి) |
| గం. 10.10 | ‘గవర్నెన్స్ రిఫార్మ్ స్ట్రాటజీ’ పుస్తకం విడుదల (గౌ.ముఖ్యమంత్రి) |
| గం. 10.12 | అధికారులకు సందేశం (గౌ.ముఖ్యమంత్రి) |
| గం. 10.25 | ధన్యవాదాలు సమర్పణ (పౌర సంబంధాల కమిషనర్) |
| అనంతరం | తేనీటి సేవనం |

~~~ 0 ~~~

\* \* \*
~~~

# ‘ఈనాడు’ మొదటి పేజీలో వైయస్సార్

డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి తొలిసారిగా ముఖ్యమంత్రిగా ఎన్నికై ఏడాది పూర్తి కావస్తోంది.

2005 ఏప్రిల్ 30 నాడు.....

‘ఈనాడు’ న్యూస్ ఎడిటర్ వై.ఎస్.ఆర్. శర్మ ఫోన్ చేశారు.

“ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డిగారు ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వివిధ పార్టీల నాయకులతో ఇంటర్వ్యూలు ప్లాన్ చేస్తున్నాం. రోజుకో ఇంటర్వ్యూ వేస్తాం. మీరు సిఎం గారితో కూడా ‘ఈనాడు’ కి ప్రత్యేకంగా ముఖాముఖీ మాట్లాడే ఏర్పాటు చేయగలరా?” అని అడిగారు.

శర్మగారు జర్నలిజమ్ ఒక వృత్తిగా తీసుకుని నిబద్ధతతో పనిచేసే వ్యక్తి. జర్నలిస్టులు కొన్ని విలువలు, ప్రమాణాలు పాటించి తీరాలని నమ్మేవాణ్ణి నేను. ఇప్పుడు నేను ముఖ్యమంత్రి కొలువులో ఆయనకి మీడియా సలహాదారు బాధ్యతలో పని చేస్తున్నాను. విలువలున్న, విలువలు లేని జర్నలిస్టులందరితోనూ నాకిష్టం వున్నాలేకపోయినా – చిరునవ్వుతో, గౌరవం ప్రదర్శిస్తూ పని చేయాల్సిన ఉద్యోగం నాది. ఇందులోనూ ఒక నిబద్ధత నాకుంది. అది – ముఖ్యమంత్రి ప్రతిష్ఠని కాపాడుకోవటం, పెంచుకోవటం. అందువల్ల ప్రభుత్వప్రతిష్ఠ కూడా కాపాడబడుతుంది.

శర్మగారు చెప్పిన దాని మీద కొద్దిక్షణాలు ఆలోచించాను. ఆయన మళ్లీ ప్రశ్నవేసేలోపున ఒక ఆలోచన తట్టింది.

“శర్మగారూ, మీ ప్లాన్ బాగుంది. అయితే, ముఖ్యమంత్రి ఇంటర్వ్యూ అనేది చాలా సాధారణంగా జరిగేదే కదా! దానికి బదులు నేను మీకు సిఎం గారి ఏడాది పాలన మీద ఆయనచేతే ఒక విశ్లేషణ రాయించి ఇచ్చాననుకోండి. ఎలా వుంటుంది? ఆలోచించండి.....”

“ఏమిటి, సిఎంగారు రాస్తారా?”

"అంత ఆశ్చర్యం ఎందుకు? ఆయన చాలా మంచి తెలుగు రాస్తారు. మీకు అభ్యంతరం లేదంటే నేను సిఎం గారిని ఒప్పిస్తాను. కనీసం ప్రయత్నం చేస్తాను..."

"అద్భుతం. అలాగే చేయించండి. అదే వేస్తాం... వెరైటీగా వుంటుంది కదా!.... అయితే నేను ఈ లోపల మిగతా రాజకీయ పార్టీల నాయకుల ఇంటర్వ్యూలు తీసుకోమని మావాళ్లకి చెబుతాను. వరుసగా అవన్నీ రోజుకో ఇంటర్వ్యూ వంతున వేస్తాం. చివర్లో సిఎంగారి విశ్లేషణ వేస్తాం. మీరు ఆ పని మీద వుండండి..." అన్నారు.

రెండు మూడు క్షణాలే ఆలోచించాను. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారి ప్రతిష్ఠ దృష్టిలో పెట్టుకుని చూసినప్పుడు ఏది మంచిది? ఈ ఏడాదిపాలనపై ప్రతిపక్షపార్టీల, మిత్రపక్షాల నాయకులందరి ఇంటర్వ్యూలు వచ్చేశాక, సిఎం విశ్లేషణ వ్యాసం రావటం మంచిదా? ముందే రావటం మంచిదా?....

అందరి ఇంటర్వ్యూల తరువాత సిఎం విశ్లేషణ ఏం రాయగలం? వాళ్లంతా – ముఖ్యంగా ప్రతిపక్షపార్టీలన్నీ తమ ఇంటర్వ్యూల్లో వైయస్ఆర్ పాలన మీద బురద జల్లుతాయి. దాన్ని కడుక్కోడానికి జవాబులివ్వటమే సరిపోతుంది. అది విశ్లేషణ కాదు కదా! నాన్సెన్స్. ఇది సిఎం ప్రతిష్ఠని ఎంత మాత్రం పెంచలేదు. మనదే (సిఎంగారి విశ్లేషణే) ముందుగా వచ్చేస్తే......! మనం (సిఎం) ఏం చెప్పాలనుకుంటే అదే చెబుతాం. దాన్నంతా ఖండించుకుంటూ వాళ్లేం ఇంటర్వ్యూలిస్తారో ఇచ్చుకుంటారు.

సిఎం మనోభావాలైతే ముందు ప్రజల్లోకి వెళ్లిపోతాయి గదా!

శర్మగారు ఫోన్‌లో పిలుస్తున్నారు.

"వల్లీశ్వర్‌గారు, మీరేమీ మాట్లాడటం లేదు. ఈ ప్లాన్ 'ఓకె'నా?"

"సారీ శర్మగారు, కంట్లో నలుసుపడితే ఆగాను... ఒక చిన్న సవరణ చేస్తే ఎలా వుంటుంది ఆలోచించండి. మీ (ఈనాడు) దృష్టిలో ముఖ్యమంత్రి గారు ఎలాంటి వాడైనా, రాష్ట్రానికి నాయకుడు (Head of the State) కదా! ప్రజాస్వామ్య బద్ధంగా అధిక శాతం శాసనసభ్యులతో ఎన్నుకోబడిన వ్యక్తి. అలాంటి నాయకుడు స్వయంగా ఆత్మవిశ్లేషణ రాసి ఇస్తే, దాన్ని ఇతర పార్టీల నాయకులందరి ఇంటర్వ్యూలు పూర్తయ్యాక, చివర్లో వేయటం బాగుంటుందా? మొట్టమొదటే ఆయనది వేస్తే అర్థవంతంగా వుంటుందేమో! ఆలోచించండి...."

ఆయన ఆలోచించి, "ఇది కూడా లాజికల్‌గా వుంది. సరే, నాకు ఎప్పుడు పంపించగలరు?" అని అడిగారు.

"సిఎం గారికి నేను చెప్పాలి. ఆయన ఒప్పుకోవాలి. ఆయన రాయాలి..... కనీసం 4-5 రోజులు పడుతుంది...."

"కనీసం వచ్చే బుధవారానికి (మే 4) ఇవ్వగలరా?.... అప్పుడు మేం గురువారం నుంచి ముఖ్యమంత్రి విశ్లేషణతో ప్రారంభిస్తాం...."

"ప్రయత్నం చేస్తాను.."

"సరే, గురువారం నుంచి సిఎంగారి విశ్లేషణతో మొదలుపెట్టి ఇంటర్వ్యూలు ప్లాన్ చేస్తాం."

.....అలా కార్యక్రమం ఖరారైంది.

ఆ రాత్రే సమాచార శాఖ కమీషనర్ రమణాచారితో నా ఆలోచన చెప్పాను. "బాగుందన్నా. అలా చేసేయ్" అన్నారు ఆయన ఉత్సాహంగా. మీడియా రిలేషన్స్‌లో ఆయన మహామేధావి కదా! మర్నాడు ఉదయం సిఎంతో ఏదో ఒక మీటింగ్ జరిగింది. అది అవగానే నేను ఈ విషయం చెప్పాను.

"సర్, 'ఈనాడు' వాళ్లు మీ ఏడాది పాలన మీద అన్ని పార్టీల నాయకులతో ఇంటర్వ్యూలు ప్లాన్ చేస్తున్నారు. మనల్ని అడిగారు...." అంటున్నాను. నా వాక్యం పూర్తయ్యే లోపలే సిఎం "వాళ్లు ఎలాగా నెగెటివ్ ఇంటర్వ్యూ కోసమే చూస్తారుగదా వల్లీశ్వర్...." అంటూ నవ్వారు.

"సర్" అంటూ నా ఆలోచన ఏమిటో వివరించాను. రమణాచారి కూడా నేను చెప్పింది సమర్థించారు. అంతా విన్నాక, సిఎం "సరే... మరి తయారు చేసి, చూపించు" అన్నారు. వెంటనే శర్మగారికి ఫోన్ చేసి చెప్పాను "సిఎంగారు విశ్లేషణ రాసివ్వటానికి ఒప్పుకున్నారు. మీకు బుధవారం ఇచ్చేస్తాను" అన్నాను.

మంగళవారం ఉదయం శర్మగారు గుర్తు చేశారు.

అప్పటికే ఆయన అడిగి మూడు రోజులు గడిచిపోయాయి. నాకు పని ఒత్తిడి బాగా ఎక్కువగా వుంది. రాయటం అవటం లేదు. ఇక ఆ రాత్రి పట్టుదలగా కూర్చున్నాను.

10 గంటలకి మొదలు పెట్టి రెండున్నర గంటల పాటు కళ్లు మూసుకుని నా పర్సనల్ అసిస్టెంట్ కామరాజుకి చెప్పుకుంటూ వెళ్లాను. అతను మంచి పనిమంతుడు. నేను ఎంత వేగంగా చెబితే అంత వేగంగా డిటిపి చేసేవాడు. రాత్రి 12 గంటలకి పూర్తయింది. తప్పుల్లేకుండా సరి చూసుకుని, సీల్డ్ కవర్‌లో సిఎం ఇంటికి అప్పటికప్పుడే పంపించేశాను. మర్నాడు ఉదయం సిఎం ఖమ్మం వెళ్తున్నారు. ఆయన వెంట డిప్యూటీ కార్యదర్శి లవ్ అగర్వాల్ వెళ్తున్నారు. కవర్ రాత్రి పంపించేస్తే, సిఎం హెలికాప్టర్‌లో చదువుకుంటారు గదా!

బుధవారం మధ్యాహ్నం శర్మగారు ఫోన్ చేశారు. "రేపే మొదలు పెడదాం. ఇవ్వాళ వచ్చేస్తుంది కదా?" అన్నారు.

"సిఎంగారు ఇంకా రాస్తున్నారు. ఇవ్వాళ వస్తుందో లేదో చెప్పలేను. రేపయితే ఖాయంగా ఇవ్వగలను..."

శర్మగారు అయిష్టంగా "సరే" అన్నారు.

బుధవారం రాత్రి సిఎం ఖమ్మం నుంచి రాగానే లవ్ అగర్వాల్ నేను రాసిన 'సిఎం గారి ఆత్మవిశ్లేషణ' నాకు తిరిగి పంపించేశారు. కాని, దాని మీద సిఎం సవరణలు, తుడుపులు ఏమీ లేవు. సంతకం కూడా లేదు. అంటే, ఏమైందీ? అసలు సిఎం చదివారా?.... లవ్ అగర్వాల్‌కి ఆ రాత్రి 10 గంటల ప్రాంతంలో ఫోన్ చేశాను.

"బాస్, సిఎం నేను పంపిన కాగితాలు చదివారా? లేదా? కామెంట్స్ ఏమీ లేవేమిటి?"

"సారీ గురూజీ, మీకు నేను చెప్పటం మర్చిపోయాను. హెలికాప్టర్‌లో వెళ్లేటప్పుడే సిఎం మొత్తం చదివేశారు. 'చాలా బాగుంది. నేను రాసినట్లే వుంది' అని మీకు చెప్పమన్నారు. సారీ, సారీ...." అంటున్నారు లవ్. నాకు అవేవీ వినబడటం లేదు.

"నేను రాసినట్లే వుంది.... నేను రాసినట్లే వుంది" అన్న మాటలే చెవుల్లో మిగిలిపోయాయి ఇప్పటికీ.

గురువారం ఉదయం 11 గంటలకల్లా చిన్న అచ్చుతప్పులు సరి చూసుకుని, రెడీ చేసుకున్నాను. వెంటనే పంపించెయ్యాలి కదా 'ఈనాడు'కి... పంపబోతుంటే మళ్లీ ఇంకో ఆలోచన మెరిసింది....

ఇవ్వాళ గురువారం. ఇవ్వాళే ఈ వ్యాసం ఇస్తే రేపు (శుక్రవారం) 'ఈనాడు' లో వేస్తారు. రేపు ఇస్తే, శనివారం పేపర్లో వస్తుంది. అదే, శుక్రవారం రాత్రి బాగా పొద్దు

పోయాక ఇస్తే, ఆదివారం పేపర్లో వస్తుంది. ఆదివారం నాడు ఓ లక్షో – రెండు లక్షలో ఎక్కువ కాపీలు ప్రింట్ చేస్తారు? అందువల్ల ఎక్కువ మంది చదువుతారు గదా!....

గురువారం 12 గంటలయ్యేసరికి 'ఈనాడు' న్యూస్ ఎడిటర్ శర్మగారు ఫోన్ చేశారు. "అయ్యా, సిఎం గారి వ్యాసం రెడీ అయిందా? రేపు వేసెయ్యాలి గదా!..."

"ఆ....ఆ... అయిపోయినట్లే. ఇంకా కొన్ని సవరణలు జరగాల్సి వుంది. ఇవ్వాళ అవకపోవచ్చు..... సిఎం చాలా బిజీగా వున్నారు. రేపు సాయంత్రానికి ఖాయంగా వచ్చేలా చూస్తాను..." అన్నాను. అబద్ధం చెబుతున్నాను. నాకే నచ్చలేదు. చేతిలో వ్యాసం రెడీగా పెట్టుకుని అబద్ధం చెప్పటం ఎందుకు?.... మరి నేను ఇక్కడ ఎందుకు పని చేస్తున్నాను. సిఎం ప్రతిష్ఠ పెంచటం కోసం. దట్సాల్.

శర్మగారు "రేపెలాగయినా వచ్చేలా చూడండి. పేజీలు ప్లాన్ చేసుకోవాలి గదా..." అంటూ ఫోన్ పెట్టేశారు. ఆయన కంఠంలో అసహనం నాకు తెలిసిపోయింది. కానీ....!

శుక్రవారం పొద్దుటే ఫోన్ చేశాను శర్మగారికి. "సిఎం గారి నుంచి తుది మార్పులతో ఆ వ్యాసం నా చేతికి ఈ రాత్రికి వస్తుంది. ఎన్ని గంటలకి వస్తుందో తెలీదు. తెల్లవారే లోపల నేను మీకు చేరుస్తా..." అని చెప్పి ఫోన్ పెట్టేశాను. ఆయన శనివారం నాడు 'సిఎం గారి విశ్లేషణ'తో ఆ ఇంటర్వ్యూలు మొదలు పెట్టాలనుకున్నారు. నేనొక దూ(దు)రాలోచన చేశాను!

శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో – శర్మగారికి ఆ వ్యాసం పంపించేశాను. దాన్ని వాళ్లు శనివారం వేయలేరు. చదువుకోవాలి. డిటిపి చేయాలి. పేజీల్లో స్థలం ప్లాన్ చేయాలి. ఎంత పని వుంటుందో నాకు తెలుసు కదా!

నేను ఆశించినట్లుగా, ఆలోచించినట్లుగా ముఖ్యమంత్రి ఆత్మ విశ్లేషణ వ్యాసం ఆయన పేరు మీద, ఆయన సంతకంతో ఆ ఆదివారం (మే 8) 'ఈనాడు' లో ప్రచురితమైంది. ముఖ్యమంత్రి అంటే రాష్ట్రానికి పాలకుడు కాబట్టేమో – మొదటి పేజీలోనే 'గత ఏడాదిగా నాలో మనసంతా మీరే' అన్న పతాకశీర్షికతో ప్రచురించారు. అది రెండో పేజీకి కూడా కొనసాగింది.

కాని, ఒక అపరాధ భావన ఇప్పటికీ నా మనసులో మెదుల్తూంటుంది.

– అప్పుడు శర్మగారికి రెండు రోజుల పాటు అబద్ధం చెప్పాను.



THE LARGEST CIRCULATED DAILY IN ANDHRA PRADESH

ఈనాడు

హైదరాబాద్ 8-5-2005 ఆదివారం సిటీ

సంపుటి 31 . సంచిక 269 . పేజీలు 16 . రూ. 3-50 పైసలు

Published from Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajahmundry, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Cuddapah, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bangalore, Mumbai, Delhi

అచ్చ తెనుగు పంచెకట్టు... ఐదు వేళ్లూ ముడిచి విడచి ముచ్చట్లు... అయ్యా, అమ్మా అంటూ ఆత్మీయ సంబోధన... అనురాగం, ఆవేశం కలగలసిన స్వరం... వీటన్నింటి సమాహారం వై.ఎస్.రాజశేఖర రెడ్డి! ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టి... చూస్తుండగానే ఏడాదవుతోంది. ఈ వ్యవధిలో ఎన్నో అనుభవాలు... మరెన్నో ఆలోచనలు. వీటి గురించి ఆయనే మనకు చెబితే? అదే అడిగింది 'ఈనాడు'! వైఎస్ వెంటనే సరేనన్నారు. ఉదయం నుంచీ రాత్రిదాకా.. అధికార విధులు.. అలుపు లేకుండా పనులు.. అనుక్షణం ఒత్తిడి! అయినా.. తన అంతరంగాన్ని జనంతో పంచుకునేందుకు ఆయన అంగీకరించారు. ప్రజాపథం ప్రయాణ సమయంలో ఆలోచనలను గుదిగుచ్చి.. ఆ తర్వాత వాటికి అక్షర రూపం ఇచ్చి అందించారు. అదే ఈ స్వగతం... 'ఈనాడు' పాఠకులకు ప్రత్యేకం...

"గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు నాతో మాట్లాడాలని, నాతో నేరుగా సమస్యలు చెప్పుకొంటే తమకేదో పరిష్కారం జరుగుతుందని ప్రజలు ఆతృతగా తోసుకు వస్తున్నప్పుడు, వాళ్ళ మొహాల్లో కనిపించే కల్మషం లేని విశ్వాసం. వాళ్ళతో నా మానసిక బంధాన్ని మరింత పెంచేస్తూ ఉంటుంది"

## ఏడాదిగా నాలో...

# మనసంతా మీరే!

(డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి)



ఆదివారం మే 8, 2005

ఈనాడు

# మనసంతా మీరే!

(మొదటి పేజీ తరువాయి)

ఇంకెవరికి చెబుతాం?

శాంతి కోసం ఆరాటపడ్డా

పట్టుదల పెంచిన అద్దంకులు

మనసుకి తృప్తి కోసం...

ఆవేశం వచ్చింది; కానీ...

ఎంతో సంతోషం.. సంతృప్తి

వై.యస్.రాజశేఖర రెడ్డి

* * *

# సిఎం ఇష్టపడని నా బదిలీ

**2005 మే 15 ఆదివారం....**

సాయంత్రం ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఆయన అలా విమానం ఎక్కగానే 75 మంది ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

చాలా రోజుల తరువాత సిఎం మూడు రోజుల పాటు ఢిల్లీ క్యాంపు వెళ్లటంతో కొంచెం ఆటవిడుపు దొరికింది. నేను నా కుటుంబంతో కలిసి హిందీ సినిమా 'బోస్' చూడటానికి ప్రసాద్ ఐమాక్స్‌కి వెళ్లాను. అది సుభాష్ చంద్రబోస్ కథ. చాలా రసవత్తరంగా కథ నడుస్తోంది.

అకస్మాత్తుగా ఎనిమిది గంటల ప్రాంతంలో ఢిల్లీ నుంచి జన్నత్ హుస్సేన్ ఫోన్ చేశారు. థియేటర్ లోంచి బయటకొచ్చాను.

"సిఎం గారు మీతో మాట్లాడాలంటున్నారు వల్లీశ్వర్" అన్నారు.

"సరే ఇవ్వండి" అని లైన్లో వున్నాను. సిఎం గొంతు వినబడుతోంది. వేరే ఫోన్‌లో మాట్లాడుతున్నట్లున్నారు. ఓ ఐదు నిమిషాలు నిరీక్షించాను. జన్నత్ లైన్లోకి వచ్చారు. "సారీ వల్లీశ్వర్, సిఎం ఒక అర్జంటు కాల్ మాట్లాడుతున్నారు. మళ్లీ మాట్లాడిస్తా" అన్నారు. నేను థియేటర్‌లోకి వెళ్లిపోయాను.

ఓ పావుగంట తరువాత మళ్లీ జన్నత్ ఫోన్ చేశారు. "సిఎం అడుగుతున్నారు మిమ్మల్ని" అన్నారు. నేను థియేటర్ లోంచి బయటకొస్తూనే, "సర్.. సర్" అంటున్నాను. మళ్ళీ అదే పరిస్థితి. సిఎం ఇంకో ఫోన్ మాట్లాడుతున్నారు. మళ్లీ జన్నత్ నాకు 'సారీ' చెప్పారు.

మళ్లీ పదినిమిషాలకి మరోసారి జన్నత్ ఫోన్ చేశారు. కట్ అయిపోయింది. నేను బయటకు వచ్చి నెంబరు డయిల్ చేశాను. ఏడెనిమిది రింగ్‌లు వెళ్లాక జన్నత్ ఫోన్ ఎత్తారు. "సర్. సిఎం..." అంటున్నాను.

"సారీ వల్లీశ్వర్, సిఎంకి ఒక విఐపి కాల్ వచ్చింది. మీతో రేపు మాట్లాడతానని చెప్పమన్నారు..." అన్నారు జన్నత్ నొచ్చుకుంటూ.

నేను ఈసారి ఫోన్ ఆపలేదు.... "విషయం ఏమిటి సర్? మీరు చెప్పండి తెలిస్తే...." అన్నాను.

జన్నత్ కొంచెం ఇబ్బంది పడుతూ, నిదానంగా చెప్పారు. "మీ స్థానంలో ఛీఫ్ పి. ఆర్..ఓగా విద్యుత్ శాఖకి చెందిన పి.ఆర్.ఓ చంద్రశేఖరరెడ్డిని నియమించాల్సి వస్తోంది. కాని, సిఎంకి మిమ్మల్ని వదులుకునే ఉద్దేశ్యం లేదు. ఆ మాటే మీతో స్వయంగా చెప్పాలని చాలా ప్రయత్నించారు. కుదరలేదు. ఏమైనా రేపు ఉదయం నేను సిఎం చేత మీతో మాట్లాడిస్తాను.... సారీ మరోసారి...." ఎలాంటి పరిణామానికైనా నేను మానసికంగా సిద్ధపడిపోయాను.

మే 18 బుధవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో జన్నత్ హుస్సేన్ ఫోన్ చేశారు.

"సిఎం మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు వల్లీశ్వర్. 11 గంటలకి రాగలరా?...."

ఆ సమయానికే వెళ్లాను. సిఎం తన ఛాంబర్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందాతోనూ, తన ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్‌తోనూ ఏదో ముఖ్యవిషయం మాట్లాడుతున్నారని పి.ఎస్ భాస్కరశర్మ చెప్పారు. అంతలో సూరీడు నన్ను చూశాడు.

"సర్, సర్, సిఎం గారు మీరు రాగానే లోపలికి పంపమన్నారు..." అంటూ సూరీడు నన్ను వెంటనే సిఎం ఛాంబర్‌లోకి పంపించాడు.

వాళ్లు ముగ్గురూ సీరియస్‌గా ఏదో మాట్లాడుకుంటున్నారు. సిఎం నన్ను చూస్తూనే, "రా వల్లీశ్వర్, మొన్న ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడలేకపోయాను. సారీ..." అంటూ లేచి చిరునవ్వు నవ్వుతూ నాతో కరచాలనం చేసి కూర్చోమన్నారు.

ఆ తరువాత నేను మాట్లాడింది చాలా తక్కువ. ఆయనే మోహన్‌కందాగారితో చెబుతున్నారు.

"సిఎస్‌గారూ, వల్లీశ్వర్ నాకు చాలా ఇష్టమైన వ్యక్తి. చేయి తిరిగిన జర్నలిస్టు. తిరుపతిలో వున్నప్పుడే పరిచయం వున్నా, ఢిల్లీలో పని చేస్తున్నప్పట్నుంచీ బాగా దగ్గరగా చూడటం జరిగింది. కొన్ని విలువలకి కట్టుబడి పనిచేస్తుంటాడు... నేను కొన్ని అనివార్య

కారణాలవల్ల చంద్రశేఖరరెడ్డిని తీసుకోవాల్సి వచ్చింది. కాని, వల్లీశ్వర్‌ని నేను వదలుకోలేను. మీడియా వాళ్లతో సంబంధాలు తప్ప మిగతా విషయాలన్నీ అతను ఇంతకు ముందులాగానే చూసుకుంటాడు. ఇంతకు ముందున్న అన్ని సదుపాయాలూ కల్పిస్తూ, అతను నాకు అందుబాటులో వుండేలా ఒక మంచిపోస్టులో నియమించాలి. మీరు జన్నత్ కలిసి నిర్ణయించండి. He should be with me....”

ఫలితంగా సమాచారశాఖ కమీషనర్ రమణాచారి చొరవతో జూన్ తొమ్మిదిన ప్రభుత్వం నన్ను ‘ఆంధ్రప్రదేశ్’ మాసపత్రికకి ప్రధాన సంపాదకుడిగా నియమించింది. ఆ బాధ్యతలో పదేళ్లు పని చేశాను.

* * *



*ఎన్జీఓల సభలో ఛీఫ్ సెక్రటరీ డా. మోహన్ కందా, ముఖ్యమంత్రి వైయస్సార్‌లతో*

# 'రాను' అన్న బిట్స్ 'వచ్చింది'!

**2005 సెప్టెంబరు చివరి వారంలో ఒకరోజు......**

మధ్యాహ్నం నేను కాక్స్‌టన్ ప్రెస్‌లో 'ఆంధ్రప్రదేశ్' (ప్రభుత్వ మాసపత్రిక) కి సంబంధించిన పనిలో మునిగి వున్నాను.

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నా మొబైల్‌కి కాల్ వచ్చింది. అది సిఎం కార్యాలయంలో కొద్ది మాసాల క్రితమే కార్యదర్శిగా చేరిన ప్రభాకరరెడ్డిగారి కాల్. సంస్కారం, సమర్థత కల అధికారిగా ఆయనకి పేరుంది. అయితే, అంతకుముందు ఆయనతో నాకు పరిచయం లేదు.

"నేను ప్రభాకరరెడ్డిని మాట్లాడుతున్నాను..... 'బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (BITS), పిలాని, వాళ్లకి సిఎం ఒక లెటర్ రాశారు. వాళ్ల క్యాంపస్ ఒకటి హైదరాబాద్‌లో పెట్టించమని ఆ లెటర్‌లో కోరాం. అయితే 'బిట్స్' ఛాన్సలర్ బిర్లాగారు 'అది సాధ్యపడదు' అని జవాబిచ్చేశారు. ఈ విషయంలో సిఎం మీతో మాట్లాడమన్నారు....."

దీనికి నాకు ఏమిటి సంబంధం? ఈయన నాకెందుకు ఫోన్ చేసి ఇదంతా చెబుతున్నట్లు? ఒకవేళ వేరే ఎవరికో చేయాల్సిన కాల్ పొరబాటున నాకు చేశారా? సిఎం నాతోనే మాట్లాడమన్నారా? ఈయన తప్పుగా విని, ఫోన్ చేస్తున్నారా?..... ఇలాంటి అనేక సందేహాలు ఆ క్షణంలో నా మనస్సులో పరుగులు తీశాయి.

అదే అడిగాను ఆయన్ని.

"బిట్స్ ఛాన్సలర్ బిర్లా గారి గురించి నేనేం చేయగలనండీ?" అని అడిగాను.

ఆయనో నవ్వునవ్వినట్లు ఫోన్‌లో వినిపించింది.

"సిఎం గారు ఈ లెటర్స్ మీకు పంపించమన్నారు...."

"నేనేం చేయాలి వాటిని?"

"మీరొక సారి ఇక్కడకి రాగలరా? మాట్లాడదాం....!"

ఆ సాయంత్రం వెళ్లి ప్రభాకర రెడ్డిగారిని కలిశాను. ఆయన సిఎం పేరుతో కె.కె. బిర్లా గారికి రాసిన లెటర్, దానికి బిర్లాగారిచ్చిన సమాధానం – ఈ రెండూ నా చేతిలో పెట్టారు.

"ఎలా రాయాలో వల్లీశ్వర్‌కి తెలుసు అతనికి పంపించండి – అన్నారు సిఎం ఇప్పుడు ఎలాగైనా బిట్స్ క్యాంపస్ ఇక్కడికి తీసుకురావాలని సిఎం పట్టుదలగా వున్నారు. తెలంగాణకు ఐ.ఐ.టి ఇప్పించాలని సిఎంకి వుంది. అది ఇప్పుడప్పుడే అయ్యేలా కనబడటం లేదు. కనీసం 'బిట్స్' అయినా తీసుకురావాలని తహతహలాడుతున్నారు. బిట్స్ ఛాన్సలర్ కె.కె. బిర్లా గారు ఒప్పుకుంటేనే అది జరుగుతుంది. ఆయన ఒప్పుకునేలా లెటర్ మేం రాయలేకపోయామని ఆయన అభిప్రాయం. ఆ పని మీకు అప్పగించమన్నారు. మీకేమైనా సందేహాలుంటే సిఎం గారితో మాట్లాడండి...." ప్రభాకరరెడ్డి విషయాన్ని సూటిగా చెప్పేశారు.

నేను "సరే, విషయం అర్థమైంది కాబట్టి, ఏకంగా బిర్లాగారికి లెటర్ తయారు చేసి తీసుకొస్తాను. అప్పుడే, సిఎంని కలుద్దాం....." అన్నాను.

ఆ రాత్రి ఆ లెటర్స్ రెండూ చదివాను.

"ఆంధ్రప్రదేశ్ పిల్లలు బిట్స్‌లో చదువుకోవటానికి వీలుగా 'బిట్స్' క్యాంపస్‌ని మా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నాను....." అని కోరుతూ ఆగష్టు పధ్నాలుగున నాలుగు పేరాల లేఖని కె.కె. బిర్లాగారికి సిఎం రాశారు.

దానికి జవాబుగా డాక్టర్ కె.కె. బిర్లాగారు ఆగష్టు 19న ఆరు పేరాల లెటర్ రాశారు. "గత ఏడాది గోవాలో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేశాం. దాని మీద కోట్లు ఖర్చుపెట్టాం. ఇప్పుడు కొత్త క్యాంపస్‌ని ప్రారంభించలేం. పైగా నేను వచ్చే సంవత్సరం రిటైరయిపోతున్నాను. ఏమైనా, మీ ప్రతిపాదనని కొత్త ఛాన్సలర్ దృష్టికి తీసుకువెళ్తాను...." అని ఆ లెటర్‌లో రాశారు.

ఇప్పుడు నేనేం చేయాలి? పూర్తిగా "సాధ్యపడదు" అని రాసిన బిర్లాగారి చేత "సరే, చేస్తాం" అనిపించాలి. ఇది నా వల్ల సాధ్యమా? నేను ఈ పని చేయగలనా?

కాని రాజశేఖరరెడ్డిగారు నా మీద విశ్వాసంతో ఈ బాధ్యత నాకు అప్పగించారు. ఆయన విశ్వాసమే నా శక్తి. కాబట్టి నా శక్తి మేరకు ప్రయత్నం చేయాలి. నా జర్నలిజం నాకు నేర్పిందే కమ్యూనికేషన్ స్కిల్స్. ప్రయత్నం చేద్దాం.... అనుకున్నాను.

బిర్లాగారి లేఖకి సిఎం జవాబుని తయారు చేసి అక్టోబరు 10 న ప్రభాకరరెడ్డి గారిని కలిశాను. ఆయన అది చదువుతూనే, "అందుకే అంటారు – గుజ్జుం పని గుజ్జుం చేయాలి,.....! మీ పని మమ్మల్ని చేయమంటే ఎట్లా?"

వెంటనే ఆ లెటర్‌ని ముఖ్యమంత్రి లెటర్ హెడ్ మీద ప్రింట్ కూడా తీయించాను. నేను రాసిన లేఖని, లెటర్ హెడ్ మీద ప్రింట్‌ని – రెండూ తీసుకుని మధ్యాహ్నం ముఖ్యమంత్రి గారిని – ఆయన విరామం అయిన వెంటనే – నేనూ, ప్రభాకర రెడ్డిగారూ కలుసుకున్నాం. అది ఆయన చేతికిచ్చి నిలబడ్డాం. ఆయన కూర్చోమన్నారు. నేనిచ్చిన డ్రాఫ్టుని ఆసాంతం చదివారు. ముఖం వికసించింది. చదవడం పూర్తవగానే – "ఇంక బిట్స్ రావటం ఖాయం వల్లీశ్వర్" అంటూ కరచాలనం చేశారు.

"లెటర్ హెడ్ మీద ప్రింట్ చేసి తీసుకురాకపోయారా? సంతకం పెట్టేసేవాణ్ణి కదా?" అన్నారు సిఎం

ప్రభాకరరెడ్డిగారు దాన్ని కూడా సిఎం కి ఇచ్చారు. ఆయన సంతకం అయ్యింది. అప్పటికప్పుడే ఇమెయిల్‌లో బిట్స్ (పిలాని) లో డా. వి.ఎస్. రావు గారికి సిఎం లెటర్ పంపారు ప్రభాకరరెడ్డి.

అక్టోబరు 28న...

బిర్లాగారు రాజశేఖర రెడ్డిగారికి నాలుగు పేరాల్లో ఇలా రాశారు. "రాజశేఖర్, నీ లెటర్ నన్ను బాగా కదిలించింది. సరే, నేను ఒక స్థలం ఎంపిక కమిటీని పంపిస్తాను. మీరు 3–4 స్థలాలు చూపించండి. వాటిల్లో కమిటీ ఎంచుకున్న దాన్ని ఖరారు చేస్తాం.... నీళ్లు, విద్యుత్తూ నువ్వు మాకు తగ్గింపు ధరకి ఇస్తే చాలు.... అంతా సవ్యంగా జరిగితే మార్చిలో భూమి పూజ చేస్తాం. 18 మాసాల్లో భవనాలు కట్టిస్తాం....."

ఆ తరువాత భూమి పూజపూర్తయ్యే దాకా అన్ని లెటర్సూ (4) ప్రభాకరరెడ్డి నా చేతే రాయించారు.

2006 మార్చి 30న భూమి పూజ జరిగింది.

# ఇందిర బదులు దుర్గాబాయిని 'ఓకె' అన్నారు

**2005 అక్టోబర్ 10.....**

ముఖ్యమంత్రి కార్యదర్శులలో ఒకరైన డాక్టర్ సుబ్రహ్మణ్యం నాకు ఫోన్ చేశారు. ఆ రోజు నేను 'ఆంధ్రప్రదేశ్' పత్రిక పనిలో చాలా వత్తిడిలో వున్నాను.

"వల్లీశ్వర్, మహిళా సంక్షేమం క్రింద జిల్లాల్లో నడుపుతున్న మహిళా బాల శిక్షణా ప్రాంగణాలకి ఒక మంచి పేరుపెట్టాలి. ఆ శాఖాధికారులు కొన్ని పేర్లు పంపించారు. సిఎం గారు అవన్నీ మీకు పంపించమన్నారు. మంచి పేరు ఎంపిక చేసి పంపండి...." అన్నారు సుబ్రహ్మణ్యం.

ఇప్పుడు పేరు మార్పిడి వ్యవహారం ఎందుకు వచ్చింది?

ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా వుండగా మహిళా సంక్షేమం కోసం ప్రతి జిల్లాలో ఒక శిక్షణాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాటికి 'తెలుగుబాల మహిళా ప్రగతి ప్రాంగణం' అని పేరు పెట్టారు. ఇప్పుడు ఆ పేరు మార్చాలన్నది ప్రతిపాదన.

"సరే పంపండి" అన్నాను.

ఆ సాయంత్రం సుబ్రహ్మణ్యం ఈ కొత్తగా ప్రతిపాదించిన పేర్లు పంపించారు. ఆ జాబితాలో ఏం వున్నాయంటే –

ఇందిరా మహిళా బాల ప్రాంగణం...

ప్రియదర్శిని మహిళా ట్రెయినింగ్ సెంటర్......

.....ఇలా ఓ అర డజను పేర్లు రాసివున్నాయి. అన్నింటిలోనూ ఇందిరా ప్రియదర్శిని గాంధీ పేరునే రకరకాలుగా మార్చి ప్రతిపాదించారు. సృజనాత్మకత అంతా ఒకే పేరుని రకరకాలుగా రాయడంలో చూపించారు ఆ శాఖాధికారులు.

నాకు నచ్చలేదు! నచ్చనిది వాళ్లు పంపిన జాబితా మాత్రమే కాదు. అసలు ఈ పథకానికి 'ఇందిగాంధీ' పేరు పెట్టడమే నచ్చలేదు.

ఆ సాయంత్రం సిఎం కార్యాలయానికి వెళ్ళి సుబ్రహ్మణ్యాన్ని కలిశాను. నా వాదన చెప్పాను.

"ఇప్పటి దాకా చాలా పథకాలకి ఇంధిరాగాంధీ పేరే పెడుతున్నారు. పోలవరం ప్రాజెక్టుకి 'ఇందిరా గాంధీ' పేరు, ఖమ్మం జిల్లాలో ఇరిగేషన్ పథకానికి రాజీవ్‌గాంధి పేరు, పేదల ఇళ్ళకి 'ఇందిరమ్మ ఇళ్ళు'.... అన్నీ ఇలాగే వుండాలని ఏమైనా రూలుందా? ప్రాంతీయంగా ఈ పథకానికి పేరు పెట్ట దగ్గ వ్యక్తులున్నారు కదా? వాళ్ళ పేర్లు పెట్టచ్చు గదా!....."

సుబ్రహ్మణ్యం నావంక వింతగా చూశారు.

"వల్లీశ్వర్, సిఎం కి ఇష్టమైన పేర్లు సిఎం పెట్టుకుంటారు. మంత్రివర్గం ఆమోదిస్తుంది. మనకెందుకు మధ్యలో?"

"మనం వున్నది దేనికి సుబ్రహ్మణ్యంగారు. సిఎంకి ఏది మంచిదో అది చెప్పాలి కదా? 'అన్నింటికీ ఇందిరమ్మ పేరు పెట్టుకున్నాడు ఈ సిఎం' – అని వెగటు పుట్టేలా జనం చెప్పుకుంటే, అది సిఎంకి మంచిదా? సిఎంకి మంచి పేరు తెచ్చేలా మంచి పేర్లు మనం ఎందుకు సూచించకూడదు?...."

"సరే, మీరు ఏం సూచిస్తారు?"

నేను అనుకున్నది చెప్పాను. చెప్పి "ఈ విషయాన్నే సిఎంకి సీల్డ్ కవర్‌లో రాత్రికి పంపండి. రేపు సిఎం ఏమంటారో చూద్దాం. ఆయనకి నచ్చకపోతే, ఆయన కిష్టమైనట్లే చేద్దాం....."

"చాలా బాగుంది" అన్నారు. కాని సుబ్రహ్మణ్యం సంకోచించారు. "అలా రాసి సీల్డ్‌కవర్‌లో పంపాల్సివస్తే....! ఓ పని చేయండి. మీరే పంపండి."

నాకు అర్థమైంది. ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారో అని ఆయన వెనకాడుతున్నారు. ముఖ్యమంత్రికి ఏది మంచిదో అది చెయ్యటానికి సంకోచం ఎందుకు? "సరే" అన్నాను.

అప్పటికప్పుడే నేను అనుకున్నది తెల్లకాగితం మీద రాశాను. దానికి శాఖాధికారులు పంపిన జాబితా కూడా జత చేశాను. అక్కడే, సీల్డ్ కవర్‌లో పెట్టి, భాస్కరశర్మ (సిఎం కి పి.ఎస్) కిచ్చాను. ఆయన మెసెంజర్ కిచ్చి సిఎం ఇంటికి పంపేశారు.

మర్నాడు సుబ్రహ్మణ్యం నాకు ఫోన్ చేశారు. "వల్లీశ్వర్, సిఎం మీ ప్రతిపాదన మీద 'డిస్కస్' అని రాశారు...."

నేను

సిఎంకి పంపిన

సీల్డ్ కవర్‌లో

ఏం రాశానంటే –



Sir,

M. Discuss 10/10/05

'తెలుగు మహిళా బాలప్రాంగణం' - మహిళలకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ నివ్వటానికి ఉద్దేశించిన ఈ ప్రాంగణాలకు మంచి పేరు పెట్టాలని ప్రతిపాదించినట్లు తెలిసింది.

ఇది క్రొత్త పథకం కాదు కనుక నా ఈ క్రింది సూచనను పరిశీలించగలరు...

మన రాష్ట్రంలో విద్యద్వారా మాత్రమే మహిళలు చైతన్యవంతులు కాగలరని విశ్వసిస్తూ అందుకోసం జీవితాంతం ఉద్యమించి, అనేక మహిళా విద్యాసంస్థలను - ఆంధ్ర మహిళాసభను నెలకొల్పిన, పద్మభూషణ్ వయసులోనే కాకినాడ కాంగ్రెసు ఏకైక మహిళా సంస్కర్తగా మహాసభలో జవహర్‌లాల్ నెహ్రూ గారి ప్రశంస అందుకున్న కాంగ్రెసు కార్యకర్త, శ్రీ. దుర్గాబాయి. అనేక సభలలో మహాత్మాగాంధీ ప్రసంగాలకు అనువాదకురాలు....

'తెలుగు మహిళా బాల ప్రాంగణం' పేరును 'దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం' అని మారిస్తే ఈ క్రింది ప్రయోజనాలు వుంటాయి...

-2-

1. ప్రాంతీయ సంస్కర్తలను కూడా గుర్తించి గౌరవిస్తుంది ఈ ప్రభుత్వం - అనిపించుకోవచ్చు.

2. మహిళల విద్యా వికాసానికి దుర్గాబాయిని మించిన మహిళ రాష్ట్రంలో వేరొకరు లేరు కనుక ఈ పేరు అర్థవంతంగానూ వుంటుంది, వివాదరహితంగానూ వుంటుంది.

3. చిన్నవయసు నుండే దేశభక్తి భావాలతో స్వాతంత్ర్య సమర యోధురాలిగా కాంగ్రెసు కార్యకర్తగా రాణించిన మహిళ కనుక ఒక కాంగ్రెసు కార్యకర్త/దేశభక్తురాలి పేరును ఈ కేంద్రాలకు పెట్టినట్లు వుతుంది.

4. మహిళలలో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరగటానికి దోహదపడుతుంది.

... పరిశీలించగలరు.

With regards,
వల్లీశ్వర్ 10-10-05

అమ్మయ్య! సిఎం పూర్తిగా తిరస్కరించలేదు కదా అనుకున్నాను.

రెండు రోజుల తరువాత **దసరా నవరాత్రుల** శలవుల్లో నగరం బయట రిసార్ట్స్‌లో సిఎం విశ్రాంతి తీసుకుంటున్నారు. ముఖ్యమైన ఫైల్సు అన్నీ అక్కడికే రప్పించుకొని చూస్తున్నారు.

ఆ రోజుల్లో విజయ దశమి రోజు ఉదయం 11 గంటల ప్రాంతంలో సుబ్రహ్మణ్యం నాకు ఫోన్ చేశారు.

"వల్లీశ్వర్, కంగ్రాట్స్. ఇప్పుడే సిఎం దగ్గర్నుంచి బయటకొస్తున్నాను. సిఎం మీ ప్రతిపాదనని ఎలాంటి చర్చా లేకుండా ఆమోదించారు. ఎక్సలెంట్....."

ఆ తరువాత మాటలు గుర్తు లేవు. కానీ మాటల్లో చెప్పలేనంత ఆనందం. కేవలం సిఎం నా ప్రతిపాదన ఆమోదించినందుకు కాదు. ఒక సలహాలో మంచిని గుర్తించే విజ్ఞత, సంస్కారం చూపించినందుకు. ఆ సాయంత్రమే పత్రికా ప్రకటన కూడా నేనే తయారు చేసి విడుదల చేశాను.

ఇంతకీ ఆ కేంద్రాలకి నేను ప్రతిపాదించిన పేరు – 'దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం'.



దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాలుగా పేరు మార్పు : సిఎం

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

**హైదరాబాద్, అక్టోబర్ 13:** మన రాష్ట్రంలో మహిళలు బాలల వికాసం కోసం 1996లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసిన తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణమును ఇక పై దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి నేడు ఒక నిర్ణయం తీసుకున్నారు.

ఈ ప్రాంగణాల పేర్లు గ్రామీణ ప్రజలు పలకటానికి సులభంగా ఉండాలనీ , వీటిని అందరికీ అర్ధమయ్యే పద జాలంతో పిలవబడేలా ప్రభుత్వానికి వస్తున్న పలుసూచనలను ముఖ్యమంత్రి పరిశీలించారు.

మహిళలు బాలలు సమగ్ర వికాసానికి తోడ్పడేటందుకు వీటిని ఏర్పాటు చేయడం జరిగింది. కనుగ మహిళా శిశు వికాస కేంద్రంగా ఈ ప్రాంగణాలను వ్యవహరించడం సముచితంగానూ, అర్ధవంతంగానూ ఉంటుందన్న సూచనతో ముఖ్యమంత్రి ఏకీభవించారు. అయితే ఈ కేంద్రాలకు రాష్ట్రంలో మహిళా విద్య కోసం జీవితమంతా ధారపోసిన స్వాతంత్ర్య సమరయోధురాలు, విద్యావేత్త, సంస్కర్త అయిన శ్రీమతి దుర్గాబాయి పేరు పెడితే ఇవి మహిళా వికాసానికి మరింత స్ఫూర్తిదాయకంగా ఉంటాయని, కనుక వీటిని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాలుగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

శ్రీమతి దుర్గాబాయి అసంఖ్యాకంగా విద్యా సంస్థలు , వృత్తి విద్యా కేంద్రాలు, కళాశాలలు మన రాష్ట్రంలోను, చెన్నైలోనూ అసంఖ్యాకంగా స్థాపించారు. స్వాతంత్ర్య సమరంలో చురుకైన పాత్ర వహించడమే కాక, చట్టసభ సభ్యురాలుగా, తొలి ప్రణాళికా సంఘం సభ్యురాలిగా, కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి ( సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్) అధ్యక్షురాలిగా మహిళా సముద్ధరణకు ఎనలేని సేవలిందిచారు. భారత జాతికి ముఖ్యంగా మహిళా లోకానికి ఆమె అందించిన విశిష్టసేవలకు గుర్తింపుగా తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణాలను దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాలు పేరు మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చెప్పారు.

* * *

# జార్జిబుష్ – వైయస్సార్ – నేను

**2005 నవంబరు 10.....**

పెళ్లయిన మా అమ్మాయికి అమెరికా వెళ్లేందుకు Dependant Visa కోసం చెన్నై వెళ్లాను.

వీసా స్టాంపింగ్ అయిన రోజు సాయంత్రం అమెరికన్ కన్సులేట్‌లో పని చేస్తున్న ఒక మిత్రుడు మాగంటి కోటేశ్వరరావుగారిని కలవటానికి ఇంటికి వెళ్లాను. అతను మాటల్లో 2006 ఫిబ్రవరి, మార్చి మాసాలలో అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ మన దేశానికి వస్తున్నట్లు చెప్పారు.

"ఎక్కడెక్కడ తిరుగుతారు?" అని అడిగాను.

"పూర్తి పర్యటన ఇంకా ఖరారు కాలేదు."

"ఢిల్లీ కాక ఏయే రాష్ట్రాలకి వెళతారు?"

"అది కూడా ఇంకా ఏమీ నిర్ధారణ కాలేదు."

నాకు మనసులో ఒక ఆలోచన వచ్చింది. అప్పటికి ఒక మాసం క్రితమే శాసనసభ లాబీల్లో మీడియాతో ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, "ఇదేం పాలన ఇక్కడ? రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఏర్పడి 18 మాసాలు కావస్తున్నా ఒక్క VIP (ప్రముఖులు) కూడా ఈ రాష్ట్రాన్ని సందర్శించలేదు. ఇదో ప్రభుత్వం, ఇదో పాలనా?...." అంటూ వైయస్సార్ పాలనని ఎద్దేవా చేస్తూ మాట్లాడారు. అది గుర్తుకొచ్చింది. దాంతో ఒక ఆలోచన చేశాను. జార్జిబుష్‌ని మన రాష్ట్రానికి తీసుకురాగలిగితే.....?

మాగంటి ఇంకా ఇతర విషయాలు మాట్లాడారు. హైద్రాబాద్‌లో కన్సులేట్ పెట్టడానికి ఒక భవనం కోసం వాళ్ళు చూస్తున్నారనీ, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ అయితే మంచిదనుకుంటున్నారనీ చెప్పారు. ఈ అంశాన్ని చూస్తున్న కన్సులర్ ఒకరితో ఫోన్‌లో కూడా మాట్లాడించారు.

నేను చెన్నై నుంచి తిరిగి వచ్చిన రోజే (నవంబరు 11) మధ్యాహ్నం సిఎం ని కలిశాను. ప్రభుత్వ సలహాదారు కె.వి.పి రామచంద్ర రావుగారు కూడా వున్నారు. ఈ రెండు విషయాలు

చెప్పాను. కన్సులేట్‌కి లేక్‌వ్యూ ఇచ్చేదిలేదని స్పష్టంగా చెప్పేయమన్నారు. ప్రత్యామ్నాయంగా దిల్‌కుష్ లేదా HUDA భవనం (ఇప్పుడు కన్సులేట్ పెట్టింది) ఇస్తామని చెప్పేయమన్నారు.

జార్జిబుష్ పర్యటన గురించి వివరించాను. "సర్, 18 నెలలవుతున్నా ఒక్క VIP రాలేదని చంద్రబాబు నాయుడు గారంటున్నారు. మనం ఒక ప్రయత్నం చేద్దాం. జార్జిబుష్ గారిని తీసుకురావచ్చు...."

"చేద్దాం" అన్నారు వాళ్లిద్దరూ. "అయితే ఏం చేయాలి?" అని అడిగారు.

నాకున్న పరిజ్ఞానం ఉపయోగించి చెప్పాను.

"ముఖ్యమంత్రి గారు ఢిల్లీలోని అమెరికన్ రాయబారి మడ్‌ఫోర్ట్‌కి, వాషింగ్‌టన్‌లో భారత రాయబారి రొనేన్ సేన్‌కీ లెటర్స్ రాస్తారు. మీ పరపతి ఉపయోగించి మా రాష్ట్రానికి అతిథిగా మీ అధ్యక్షుడు వచ్చేలా చూడండి – అని రాస్తాం. లెటర్ ప్రతి ఒకటి చెన్నైలోని అమెరికన్ కన్సులేట్ జనరల్‌కి కూడా పంపిస్తాం. ఈ కన్సులేట్ జనరల్ 'యస్' కన్నా 'నో' కి విలువ ఎక్కువుంటుంది, కాబట్టి అతను 'నో' చెప్పకుండా చూసుకోవటం అవసరం..... అలాగే ముఖ్యమంత్రి గారు విదేశీ వ్యవహారాల శాఖామంత్రి నట్వర్‌సింగ్ గారికి ఒక లేఖ రాస్తారు – బుష్‌గారిని మన రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నట్లుగా.... ప్రభుత్వపరంగా మన ప్రధానకార్యదర్శి గారు విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శికి రాస్తారు...."

సిఎం వెంటనే తన ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్‌ని పిలిపించారు.

"జన్నత్, అమెరికా అధ్యక్షుడు బుష్‌ని మన రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నాం. వల్లీశ్వర్ ఒక విధానం చెప్పాడు. ఆ ప్రకారం లెటర్స్ అన్నీ తను రాస్తాడు. మీరు చూసి, అవసరమైతే సరిచేసి తీసుకురండి. వెంటనే పంపించేద్దాం...." అన్నారు సిఎం

మర్నాడు నేను ప్రధానకార్యదర్శి లెటర్‌తో సహా అయిదు లెటర్సూ రాసి తీసుకెళ్లాను. జన్నత్ చిన్న చిన్న సవరణలు చేశారు. లెటర్స్ అన్నీ వెళ్లిపోయాయి.

2006 జనవరిలో సిఎం ఢిల్లీ వెళ్తున్నారు. ఆ పర్యటనలో ప్రధానమంత్రి డాక్టర్ మన్‌మోహన్ సింగ్‌ని కలవటం కూడా వుంది. నేను ఆ ముందు రోజే సిఎంని కలిశాను.

"సర్, విదేశీ వ్యవహారాలశాఖ ఇప్పుడు ప్రధాన మంత్రి దగ్గరుంది. రేపు ఈ లెటర్ మరోసారి మీరు మన్‌మోహన్ సింగ్‌గారికి ఇచ్చి 'బుష్ తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌కి రావాలి' అని చెబితే బాగుంటుంది....."

"ఓ.కె" అన్నారు. ఢిల్లీ వెళ్లాక అలాగే చేశారు.

మార్చి.... 1,2,3 తేదీల్లో ఇండియాలో పర్యటిస్తూ, మూడవ తేదీన అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ ఆంధ్రప్రదేశ్‌కి వచ్చారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన రైతులతో మాట్లాడారు. రెండు గంటలకు పైగా ఇక్కడ గడిపారు.

విచిత్రం ఏమిటంటే – 2000లో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ గారు హైద్రాబాద్ వస్తే, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి క్లింటన్‌గారు అతికష్టం మీద రెండు నిమిషాలు కేటాయించారు. ఇప్పుడు బుష్ గారు ఎయిర్ పోర్టులో దిగి, హెలికాప్టర్ ఎక్కి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతులతో మాట్లాడి, ISBకి వెళ్లి తిరిగి ఎయిర్ పోర్ట్‌కి వచ్చి విమానం ఎక్కేదాకా – ఆ రెండు గంటలూ రాజశేఖర్ రెడ్డిగారిని తనతోనే తీసుకెళ్లారు. అనేక విషయాలు మాట్లాడారు.

సిఎం ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అమెరికన్ ఎకానమీలో భారతీయుల పాత్ర, అందులో ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగాల్లో తెలుగువారి సేవ గురించి, వారి సమస్యల గురించి జార్జిబుష్‌తో ప్రస్తావించారు.

జార్జిబుష్ వెళ్ళిపోయాక మీడియా సమావేశంలో తన రెండు గంటల అనుభవాన్ని రాజశేఖర్ రెడ్డి వివరించారు.



అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్‌తో వైయస్సార్

* * *

# ప్రత్యక్ష ప్రసారంలో వైయస్సార్

**2005 సెప్టెంబరు 20.....**

ఆ సెప్టెంబరు 24న అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలకు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి వెళ్ళలేకపోయారు (వెళ్లలేదు). కానీ ప్రచారం ఎలా జరుగుతుంది? మంత్రులు, శాసన సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కె.వి.పి రామచంద్రరావు ముఖ్యమంత్రి తరఫున అంతా పర్యవేక్షిస్తున్నారు.

నాకు ఒక ప్రశ్న? ఇప్పుడు నేనేం చేయగలను? వెంటనే ఒక ప్రకటన (పార్టీ పేరు మీద) తయారు చేసి సిఎంకి సీల్డ్ కవర్‌లో పంపించాను. నా ప్రయత్నం వృథా పోలేదు. అది అట్నుంచి అటే కె.వి.పి గారికి వెళ్లింది. సెప్టెంబరు 22న అన్ని పత్రికలలో ప్రముఖంగా వచ్చింది. ఎలాంటి హెడ్డింగ్ లేకుండా, నేను తయారు చేసిన ప్రకటన అది.

సిఎం దాన్ని 'ఓకె' చేశారని తెలియగానే సమాచారశాఖ కమీషనర్ రమణాచారికి ఒక ప్రతిపాదన ఇచ్చాను. ఆయనే దాన్ని తీసుకెళ్లి సిఎంకి ఇచ్చారు. దాని ప్రకారం –

ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు అందరికీ రెండ్రోజులపాటు ఒక శిక్షణా శిబిరం (ఆ పేరుతో ఒక కార్యక్రమం) హైద్రాబాద్‌లో నిర్వహిస్తాం. సంబంధిత అధికారులచేత ఛైర్మన్లు, మేయర్లకు విధులు, అధికారాలు వగైరా చెప్పిస్తాం.

ఇందులో సిఎంకి ప్రయోజనం ఏమిటంటే – ఆ శిబిరం ప్రారంభోత్సవంలోనూ, ముగింపులోనూ సిఎం మాట్లాడేదంతా టి.విల్లో ప్రత్యక్షంగా ప్రసారం అయ్యేలా ఏర్పాటు చేస్తాం. సిఎం ఎంత వాడుకుంటే అంత ప్రచారం!!

ఆ ప్రతిపాదనని సిఎం యథాతథంగా ఆమోదించారు. ఆ తరువాత, 2005 నవంబరు 24,25 తేదీల్లో కార్పొరేషన్ మేయర్ల, మున్సిపల్ ఛైర్మన్ల వర్క్‌షాప్ జరిగింది. సిఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం జరిగింది.

Sir,

మున్సిపల్ / కార్పొరేషన్ల అధ్యక్షుల వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో మీ ప్రసంగానికి పనికి వస్తాయని కొన్ని అంశాలు జతచేశాను.

పరిశీలించగలరు.

Regards.

వల్లీశ్వర్
23-11-05

## ముఖ్యమంత్రి ప్రసంగం కోసం కొన్ని అంశాలు

*నేను రాజకీయాలలోకి ప్రవేశించాక – 28 ఏళ్ళ రాజకీయ జీవితంలో – నేను ప్రచారంలో పాల్గొనకుండా జరిగిపోయిన ఎన్నికలు ఇవి.*

*నగరబాటలో నేను ఒక విషయం గమనించాను. ప్రజలు ఎక్కడా –మా పట్టణాన్ని ఎయిర్ కండిషన్డ్ చేసేయండి అనో, మాకు పన్నులు లేకుండా పంచభక్ష్య పరమాన్నాలు పెట్టండి అనో అడగలేదు. వాళ్ళవి చాలా చిన్న కోరికలు.*

*వాళ్ళు మంచి పారిశుధ్యం కావాలని కోరుకుంటున్నారు. మాపేట రోడ్లు బాగుండాలని, మంచినీళ్ళు కొళాయిల్లో రోజూ రావాలనీ, మునిసిపల్ స్కూళ్ళలో వసతులు మెరుగుపడాలనీ, బర్త్ సర్టిఫికెట్‌లు – డెత్ సర్టిఫికెట్ల కోసం మునిసిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి పోవాలని, దుర్గంధం వ్యాపించే మురికి కుప్పలు పోవాలనీ... ఇలాంటి చిన్న కోరికలు.*

*ప్రజా జీవితంలో ఎప్పుడైనా వెనక్కి తిరిగి చూసుకుంటే – "నేను ప్రజల కోసం ఫలానా మంచి పనులు చేశాను" అనే సంతృప్తికి మించిన ఆనందం మరొకటి లేదు.*

*మీ ఊళ్ళో కొన్ని లక్షలమంది ప్రజలు వుండగా వాళ్ళ శ్రేయస్సు కోసం పనిచేసే ప్రథమ పౌరుడిగా ఈ అవకాశం మీకే దక్కింది.*

*రాబోయే అయిదేళ్ళ కాలాన్ని మీ మీ పట్టణాల / నగరాల అవసరాల ప్రాధాన్యతలను బట్టి – మొదటి సంవత్సరంలో ఏం సాధించాలి? రెండో సంవత్సరంలో ఏం సాధించాలి?... ఇలా విభజించుకోండి.*

*చేస్తున్న పని విషయంలో, సాధించిన అంశాల విషయంలో ప్రజలకి ఎప్పుడూ వాస్తవాలను చెబుతూ వుండండి. ప్రజా జీవితంలో మనం ప్రజలకోసం ఏం చేస్తున్నామో ఎప్పటికప్పుడు వెల్లడిస్తూ వుండటం అవసరం. దయచేసి అలా మభ్యపెట్టే ప్రయత్నాలు చేయకండి. ఒక్కోసారి చేదుగా వున్నప్పటికీ వాస్తవాలే చెప్పండి.*

*ఒక నిర్ణయం తీసుకునే ముందు, ఒక కార్యక్రమం చేపట్టేముందు – "ఇది నేను ఎన్నికలలో చేసిన వాగ్దానాలకి అనుగుణంగా, ప్రజలకు ఉపయోగపడేలా వుందా?" అని ప్రశ్నించుకోండి. సమాధానం 'ఔను' అని వస్తే వాయిదా వేయకుండా అమలు చేయండి.*

*....*

*....*

* * *

# మీకు ఋణపడివున్నాను : వైయస్సార్

**2006 జూలై 27....**

ఉదయం 10 గంటలకి 'ఆంధ్రప్రదేశ్' ఆఫీస్‌కి వెళ్లగానే ఈ రోజు సిఎం కోసం ఏం చేయగలను – అని ప్రశ్నించుకున్నాను. పత్రికలు చూడగానే స్ఫురణకు వచ్చింది. రెండు రోజుల్లో పంచాయితీ రాజ్ ఎన్నికల ప్రచారానికి చివరి రోజు.

కొన్ని క్షణాలు ఆలోచించగానే కొత్త ఆలోచన ఒకటి మొలకెత్తింది.

ప్రచారం ఇవ్వాళ ఆఖరి రోజు కాబట్టి సిఎం పేరు మీద కొత్త రకంగా ఒక ప్రకటన జారీ చేస్తే బాగుంటుంది.

అప్పటికప్పుడు 'నేను మీకు ఋణపడి వున్నాను' శీర్షికతో ఒక ప్రకటనని కొత్త తరహాలో సిఎం పేరు మీద తయారు చేశాను. మధ్యాహ్నం 2 గంటలకి సిఎం భోజనం తర్వాత విశ్రాంతి అయిన వెంటనే కలిసి చూపించాను. సిఎం అంతా చదివారు. "చాలా బాగుంది వల్లీశ్వర్. ఒకసారి పార్టీ తరఫున ఏమన్నా తయారు చేశారేమో కనుక్కుంటాను. నీకు ఫోన్ చేస్తాను...." అన్నారు సిఎం

నేను ఆఫీస్‌కి వచ్చేశాను. 3–4 గంటల మధ్య ప్రభుత్వ సలహాదారు కె.వి.పి రామచంద్రరావు గారు ఫోన్ చేశారు.

"వల్లీశ్వర్, సిఎం చెప్పారు. మీరేదో ఒక ప్రకటన పంచాయితీరాజ్ ఎన్నికల కోసం తయారు చేశారట. పార్టీ నుంచి ఏమీ తయారయి లేదు. సిఎంకి కూడా మీరు చేసింది నచ్చింది. అందుకని మీరు తయారు చేసిందే మీడియాకి ఇచ్చేయమని సిఎం చెప్పారు. దాన్ని వెంటనే సిఎం ఆఫీసుకి పంపించేయండి. దాన్నే పార్టీ పేరు మీద వేయించేస్తాం...."

మనసులో చిన్న ఆనందం – నా శ్రమ వృథాపోలేదు.

8 బుధవారం, 28 జూన్ 2006



# నేను మీకు ఋణపడి వున్నాను...

కల్మషం లేని ప్రేమతో, విశ్వాసంతో 2004 అసెంబ్లీ ఎన్నికలలోనూ, 2005 మున్సిపల్ ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీని గెలిపించిన నా సోదర ప్రజలందరికీ నేను ఋణపడి వున్నాను.

ఆంధ్రప్రదేశ్ అంతా 'స్వర్ణ'మయం చేస్తాననీ, ఇళ్లిల్లూ బంగారంతో నింపేస్తాననీ ఇచ్చకాలు చెప్పే ధైర్యం నేను గతంలోనూ చెయ్యలేదు, ఇప్పుడూ చెయ్యలేను.

"చెయ్యగలను" అని విశ్వసించిన వాటినే చేస్తానని వాగ్దానం చేశాను, అమలు చేస్తున్నాం. ఎందుకంటే, మీరు నా మాటల్లో ఎంత విశ్వాసం వుంచారో తలుచుకున్నప్పుడల్లా, దానిని నిలబెట్టుకుని తీరాలన్న తపన, ఆపత్రయం నాలో అణువణువునా పరవళ్ళు త్రొక్కుతుంటాయి.

పల్లె జీవితాల్లోని స్వచ్ఛత, పల్లెవాసుల కపటం లేని పలకరింపులు - ఇవే నేను పుట్టి పెరిగిన పల్లెసీమలో నన్ను ప్రభావితం చేసిన సుగుణాలు. అందుకే నా మనసెప్పుడూ పల్లె జీవనం గురించి ఆలోచిస్తూంటుంది. మీ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆరాటపడుతూంటుంది.

తొలకరి కోసం ఆకాశంలో మబ్బుల్ని వెతికే రైతులు, ఆ రైతుల పొలాల్ని నమ్ముకున్న రైతు కూలీలు, గ్రామాలు పచ్చగా వుంటే పనులు పెరుగుతాయని ఆశపడే చేతివృత్తుల కుటుంబాలు, పిల్లలకు - వృద్ధులకు జబ్బు చేస్తే అందుబాటులో లేని వైద్యం కోసం తహతహలాడే పల్లెవాసులు, చదువుల కోసం మైళ్ళ కొద్దీ దూరం పుస్తకాల సంచీలు, అన్నం ముంతలు మోసుకు వెళ్ళే పిల్లలు, సొంతగూడు లేక భూస్వాముల పంచన తలదాచుకునే పేద కుటుంబాలు.. దళారీల తరబడి నేను చూస్తూ వచ్చిన పల్లె ప్రపంచం ఇది.

ఇప్పుడు నేను కలలుగంటున్న 'హరితాంధ్రప్రదేశ్', 'ఇందిరమ్మ'లలో జలయజ్ఞం ద్వారా బీడు భూముల్లోకి సేద్యపు నీరు ప్రవహిస్తుంది.. వర్షాలు కురవకపోయినా కూలీలకు ఉపాధి లభిస్తుంది. చేతివృత్తుల వారికి ప్రభుత్వ ఆసరా పెరుగుతుంది.. పల్లెపల్లెకి బడి, ఆసుపత్రి అందుబాటులోకి వస్తాయి.. ఆసరాలేని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు లభిస్తాయి. సొంతిల్లు లేని ప్రతి పేద కుటుంబానికీ ఓ ఇల్లు సమకూరుతుంది.. ప్రతి ఇంట్లో శాంతి, సంతోషం.

నా ఈ కల నిజం కావాలన్న ఆరాటంతో మీ ప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన ముఖ్య ప్రయత్నాలను ఒకసారి గుర్తు చేస్తాను.

- పేద రైతులకు ఉచిత విద్యుత్
- పాత విద్యుత్ బకాయిల రద్దు
- రైతులకు కొత్త రుణాలపై రిజిస్ట్రేషన్ ఛార్జి మాఫీ
- మాన్‌శాంటో వంటి కంపెనీలతో విత్తనాల ధర తగ్గింపుకై పోరాటం
- పరిశోధనల ఫలితాలు రైతుకి చేరేలా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ
- 'జలయజ్ఞం'లో భాగంగా ఈ ఖరీఫ్‌లో క్రొత్తగా ఏడున్నర లక్షల ఎకరాలకు నీరు
- విద్యుత్ రేట్లు పెరగకుండా చర్యలు
- సింగిల్ బల్బు వాడకం విలువ మేరకు పేదల గృహాలకు విద్యుత్ రాయితీ
- విద్యుత్ సదుపాయం లేని పేదల ఇళ్ళకి 'రాజీవ్ విద్యుద్దీకరణ' క్రింద ఉచితంగా విద్యుత్ కనెక్షన్
- భూమిలేని పేదలకు మూడు లక్షల ఎకరాలకు పైగా భూ పంపిణీ
- గతంలో పంచిన భూమిని సాగులోకి తీసుకురావడానికి 'ఇందిరప్రభ'
- పేద పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు
- పల్లెల్లో మహిళలకు ప్రసూతి సాయంగా ఉచిత బస్‌పాస్, ఆర్థిక సాయం
- పేద కుటుంబాల్లో ఆడపిల్ల పుడితే భారం అనుకోకుండా బాలికా సంరక్షణ పథకం క్రింద రూ.లక్ష బీమా
- నాలుగేళ్ళపాటు విద్యా ఉపకార వేతనం
- దళిత బాలికల కోసం 'చదువుల తల్లి'
- బాలికల్లో నిరక్షరాస్యత ఎక్కువగా వున్న చోట 'కస్తూరిబా బాలికా గురుకులాలు'
- ఇంజనీరింగ్ చదివే ఆడపిల్లలకు 'జవహర్ నాలెడ్జ్ సెంటర్'ల ద్వారా ఉద్యోగావకాశాలు లభించేలా పరిశ్రమలతో అనుసంధానం
- ప్రతి మహిళా తన ఆర్థిక స్తోమతుని పెంచుకునేలా 'ఇందిరా క్రాంతి పథం' క్రింద పావలా వడ్డీకే రుణాలు
- డ్వాక్రా మహిళలకు క్రొత్తగా ఆరోగ్య బీమా
- ప్రతి పేదవాడి 'సొంత ఇంటికల' నిజం చేసేలా మూడేళ్ళలో 55 లక్షల ఇళ్ళ నిర్మాణం
- అల్పాదాయ వర్గాల కోసం 'రాజీవ్ గృహకల్ప'
- రోజువారీ కూలీ మీద ఆధారపడి జీవించే పేదవాళ్ళ కోసం 'ఉపాధి హామీ పథకం'
- ఏ ఆధారం లేని వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు గత రెండేళ్ళలో లక్ష పెన్షన్ల పెంపు - పెన్షను పరిమాణం పెంపు
- క్రొత్తగా ఫ్లోరోసిస్ బాధిత వికలాంగులకు పెన్షన్లు
- వృద్ధులైన చేనేత కార్మికులకూ పెన్షన్లు
- కుల వృత్తి మీద ఆధారపడి జీవించే బి.సి.ల కోసం 'రాజీవ్ అభ్యుదయ యోజన' ద్వారా మద్దతు
- గ్రామాలకే అధికారులు వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే 'ప్రజాపథం'
- విద్య, వైద్యం, రోడ్లు, నివసించడానికి గూడు... వగైరా అన్ని మౌలిక సదుపాయాలతో మూడేళ్ళలో పల్లెలు కళకళలాడేలా 'ఇందిరమ్మ' పథకం...

ఈ పథకాలు, కార్యక్రమాలు ఫలించి, నా 'హరితాంధ్రప్రదేశ్' కల నిజం కావాలంటే స్థానిక ఎన్నికలలో కూడా కాంగ్రెసు ప్రభుత్వ విధానాన్ని సమర్థించే, సమర్థంగా అమలుచేసే నాయకత్వం కావాలి. అందుకే ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేయండి. మరోసారి శ్రీమతి సోనియాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెసు పార్టీకి, నా ప్రభుత్వానికి మీ ఆశీస్సులందించండి. మీ రుణం తీర్చుకునే అవకాశం కల్పించండి.

మీ
ప్రేమాభిమానాలు కోరుకునే

**వై.యస్. రాజశేఖర రెడ్డి**

**కాంగ్రెస్ హస్తం - పేదల నేస్తం**

* * *

# వైయస్సార్ హత్తుకున్న క్షణాలు

**2007 మే 14.....**

ఆ రోజు తెల్లవారుఝామునే సిఎం రాజశేఖరరెడ్డిగారు అమెరికా యాత్ర నుండి తిరిగి వచ్చారు.

ఉదయం 9 గంటలకు సిఎం క్యాంపు ఆఫీసులో ఒక పుస్తకం ఆవిష్కరణ వుంది. అప్పటికి 'ఆంధ్రప్రదేశ్' పత్రిక ప్రధాన సంపాదకుడుగా వున్న నన్ను కూడా వాళ్లు మరీ మరీ పిలిచారు.

నేను సిఎం క్యాంపు ఆఫీసులోకి ప్రవేశించి, క్యాంపు భవనంకేసి వెళ్తున్నాను. నాకు కుడివైపు ప్రహరీగోడ ప్రక్కనే ఏర్పాటు చేసిన షెల్టర్ క్రింద తనని చూడటానికి వచ్చిన ప్రజల్ని ముఖ్యమంత్రి పలకరిస్తూ వస్తున్నారు. అయిపోవచ్చింది. అయినా నేను భవనం కేసి వెళ్ళిపోతున్నాను.

అకస్మాత్తుగా సిఎం నన్ను చూశారు.

"వల్లీశ్వర్....." అని పిలిచారు. నేను అటు చూశాను. ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్ రెడ్డి ఆయన దగ్గర్నుంచి ఒక పరుగులాంటి నడకతో నా దగ్గరకు వచ్చారు. (రమేష్ రెడ్డి 2017-19 కాలంలో హైదరాబాద్ – తూర్పు మండలం డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్‌గా వున్నారు)

"సిఎం గారు మిమ్మల్ని వుండమంటున్నారు" అన్నారు.

ఆగాను. అయిదు నిమిషాల్లో ఆ సందర్శకులందర్నీ ముగించుకొని సిఎం నా దగ్గరకొచ్చారు.

వస్తూనే ఆప్యాయంగా భుజం మీద చేయివేశారు. కుడిచేత్తో కరచాలనం చేశారు. "ఎక్సలెంట్..... అది చాలా బాగుంది వల్లీశ్వర్" అన్నారు. ఆయన దేని గురించి చెబుతున్నారో నాకు అర్థమైంది. నేను 'థాంక్స్' చెప్పేలోపల ఢిల్లీ నుంచి ఏదో ఫోన్ కాల్ వచ్చింది. సి.ఎస్.ఓ రమేష్ ఆ మొబైల్ ఫోన్ సిఎం కిచ్చారు.



సిఎం నా భుజం మీద చేయి తీయకుండానే, మరో చేత్తో ఫోన్ మాట్లాడుతూ క్యాంపు భవనంకేసి నడిచారు. అలా నడుచుకుంటూ వెళ్లాం. భవనం మెట్ల దగ్గరకి వెళ్ళాం. ఫోన్ కాల్ అయిపోయింది.

సిఎం తన చెయ్యి నా భుజం మీదే వుంచి అన్నారు.

"నువ్వు అమెరికా పంపించిన చిన్న పుస్తకం చాలా బాగా వచ్చింది వల్లీశ్వర్. అమెరికాలో ఆ సమావేశంలో మన వాళ్లు పంచిపెట్టారు. చాలా మంది నా దగ్గరకొచ్చి ఆ పుస్తకం గురించే చెప్పారు. నా భార్య కూడా బాగా మెచ్చుకుంది. బాగా వచ్చిందయ్యా. వెరీగుడ్....." అంటున్నారు.

"బాగా వచ్చి తీరుతుందని నాకు తెలుసు సర్...." అన్నాను.

వెంటనే నా భుజం మీద చెయ్యి తీసేశారు. నా వంక కొంచెం ప్రశ్నార్థకంగా చూస్తూ, "ఓహో! అలాగా! ఎందుకని.....?" అని అడిగారు.

"మనసు పెట్టి చేశాను కదా...." అన్నాను.

ఆ వాక్యం వింటూనే నా భుజం మీద చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నారు. కరచాలనం చేస్తూ, నా చెయ్యి గట్టిగా నొక్కేశారు.

ఆయన అభిమానం, అభినందన రెండూ ఆ స్పర్శలో వున్నాయి.

నా చేయిపట్టుకుని వదలకుండా ఒక నిమిషంపాటు ఆ పుస్తకం గురించీ, అమెరికాలో విశేషాల గురించీ మాట్లాడారు.

తరువాత నేను భవనం లోపలికి వెళ్ళగానే, సమాచారశాఖ కమీషనర్ సి. పార్థసారథి, సిఎం ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్ కనిపించారు. నన్ను చూస్తూనే జన్నత్ హుస్సేన్ ఉత్సాహంగా, "వల్లీశ్వర్, your book 'Dawn of a New Era' was very impressive. Madam repeatedly praised it. In US also......" అంటూ అభినందనలు కురిపించారు.

ఆ పుస్తకంలో నేను వివిధ రంగాల్లో ప్రభుత్వ పురోగతి బుల్లెట్స్‌తో పాటు ప్రతి పేజీలో ఒక్కొక్క బాక్స్‌లో వైయస్సార్ అభిరుచులు రాసి పెట్టాను. అవి ఆయన మొత్తం వ్యక్తిత్వానికి అద్దం పడతాయి.




* * *

# పొత్తూరి గారి 'న్యాయవిచారణ' లో వైయస్సార్, నేను

**2007 అక్టోబర్ 25....**

ముఖ్యమంత్రిగారి ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్ నాకు ఫోన్ చేశారు.

"వల్లీశ్వర్, సిఎం గారికి సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వేంకటేశ్వరరావు గారు ఒక లెటర్ రాశారు. ఇది చాలా సీరియస్ వ్యవహారం. దీనికి సరైన జవాబు ఇవ్వాలి. నేను చెప్పాను – 'వల్లీశ్వర్ అయితే బాగా రాస్తాడు' – అని. ఆ లెటర్ మీకు పంపిస్తున్నాను. జవాబు మంచిగారాసి నాకు పంపించండి...." అన్నారు జన్నత్.

అది ఏం లెటరో నాకు అప్పటికే తెలుసు. మీడియాలో ప్రచారం అవుతోంది. జలయజ్ఞం విషయం మీద, ఇతర అవినీతి ఆరోపణల విషయంలో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుగారికి, ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డిగారికి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. అది చిలికి చిలికి చివరికి "దమ్ముంటే న్యాయవిచారణ జరిపించండి" అంటూ ప్రతిపక్షనాయకుడు డిమాండు చేయటం, "మేం సిద్ధమే" అంటూ ముఖ్యమంత్రి న్యాయవిచారణకు సిద్ధపడటం జరిగింది.

ఈ దశలో ఒక బాధ్యతకల పౌరుడిగా సీనియర్ పాత్రికేయులు (నాకు గౌరవనీయులు) పొత్తూరి వేంకటేశ్వరరావుగారు ముఖ్యమంత్రికి ఒక లేఖ రాశారు. అంతవరకే నాకు తెలుసు. అందులో ఏముందో తెలీదు.

మర్నాడు వెళ్లి జన్నత్ హుస్సేన్ గారిని కలిశాను. ఆ లెటర్ ఇచ్చారు. దానికి జవాబు రాయాలని సిఎం నోట్ చేశారు. ఆ లెటర్ అంతా చదివాను.

"..... ఇలాంటి న్యాయ విచారణలు గతంలోనూ జరిగాయి. ప్రతాప్‌సింగ్ ఖైరాన్ నుంచి ఇటీవలి మాయావతి, జయలలితల దాకా, రాజీవ్‌గాంధీపై మోపబడిన బోఫోర్స్ కేసు సహా అన్ని కేసుల్లోనూ ఇలాగే పంతాలకు పోయి న్యాయవిచారణలకు ఆదేశించటం జరిగింది. ఆ విచారణలు ఏవీ ఏమీ సాధించలేదు. కాని, ఈ క్రమంలో ప్రజలకు ఈ ప్రజాస్వామిక వ్యవస్థమీద విశ్వాసం సడలిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.... దయచేసి

మీరిద్దరూ అలాగే పంతాలకు పోయి ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాల్ని జాతీయ వేదిక లెక్కించకండి. విధానాల మీద విమర్శలు చేసుకోండి. కాని వ్యక్తిగత దూషణలకి దిగి, మీ అనుయాయులంతా చిల్లరగా వీధి పోరాటాలకి దిగే ప్రమాదం రానివ్వకండి...."

ఇదీ పొత్తూరి వేంకటేశ్వరరావు గారు రాసిన లేఖ సారాంశం.

ఈ లెటర్‌కి జవాబు ఎవరివ్వాలి?

దీన్ని జన్నత్ గారు నాకు పంపటమేమిటి?.... ఆయన్ని ఆ మాట గట్టిగా అడగలేను. ఆయన కూడా నాకు బాసే.

మరునాడో, ఇంకో రోజో సమయం చూసుకుని రాజశేఖరరెడ్డిగారిని కలిశాను. పొత్తూరి గారి లెటర్ చూపించాను.

"సర్, దీనికి జవాబు తయారు చేయమని జన్నత్ గారు నాకిచ్చారు సర్. కానీ, ఇది మీరు...." అంటున్నాను.

ముఖ్యమంత్రి గట్టిగా ఓ నవ్వు నవ్వేశారు. "నేను అనుకుంటూనే వున్నాను. అది తిరిగి తిరిగి నీ దగ్గరకే వస్తుందని. ఓకె. పోయిందేముంది. రాసేయ్. నీకు తెలుసుగదా! నేను రాయాల్సి వస్తే ఎలా రాయటం మంచిదో ఆలోచించి రాసేయ్ వల్లీశ్వర్. రాసి నాకే పంపించెయ్...." అన్నారు.

ఆ తరువాత నాలుగైదు రోజులపాటు సిఎం ఏదో టూర్‌లో వెళ్లారు. నవంబరు 3-4 తేదీలలో ఆ జవాబు రాసి, సీల్డ్ కవర్‌లో సిఎంకి, జన్నత్‌గారికి పంపించాను. దాన్నే యథాతథంగా నవంబరు 5న పొత్తూరి గారికి సిఎం కార్యాలయం పంపించింది.

ఏ పరిస్థితుల్లో తాను న్యాయవిచారణకు సిద్ధపడాల్సి వచ్చిందో అందులో వివరిస్తూ "......అయినప్పటికీ మీవంటి పెద్దలు విజ్ఞతతో ఇచ్చిన సలహా మేరకు నేను నా నిర్ణయాన్ని పునస్సమీక్షించుకుంటాను" అని సిఎం చెప్పటంతో ఆ లేఖ ముగిసింది. జన్నత్ ఫోన్ చేసి, "CM is very pleased with your draft...." అన్నారు.

అంతే! ఆ తరువాత ఏ విచారణా జరగలేదు!

e-mail: maitripuri@gmail.com, maitripuri@hotmail.com | Ph : 0863 - 231 2121

**October 17, 2007**

**Dear Dr. Rajasekhara Reddy garu,**

**Vijaya Dasami Greetings to you and every one in your family.**

**Please treat this as an appeal from a senior citizen of the state to the Hon'ble Chief Minister and the Hon'ble Leader of the Opposition in the Assembly. (The same text is being sent to both of you, though separately addressed.)**

**I have been following the various allegations mutually leveled by the Hon'ble Chief Minister and the Hon'ble Leader of the Opposition in the Assembly, together with the challenges, in the recent days, and felt distressed. Critical statements and charges of corruption are not uncommon in politics. But both of you have taken the wrangle to the extreme and have been repeatedly asking for a judicial probe into the recriminations. The amounts involved in the allegations are unprecedented and run into astronomical figures.**

**The demand for judicial probe is fraught with very serious consequences. Charges of corruption easily attract the attention of the people, more so when made in courts of law. Both of you are being watched by the entire nation, judging by the coverage in the national media.**

..

..

..

**I am appealing to both of you to stop this smear campaign against each other and drop the demand for judicial enquiry. It may have commercial value to the media, entertainment value to some political parties and may even make the enemies of democracy happy in and outside the country, but for us, the people of the state, it would mean loss of face. We cannot hope for any Andhra leader to emerge on the national scene, in future. The prospect of national leaders emerging from among the Telugu people should not end at this point of time.**

**Please stop this unseemly wrangle. Confine your criticism to the policies and do not indulge in personality attacks. The openly bitter attacks by both of you are inadvertently prompting your followers and camp-activists on either side to carry the fight to the streets. You will not be able to reverse the trend after a few days. It is time you take the interests of the entire people of Andhra Pradesh and their future into consideration before launching political tirades.**

**With Best Regards,**

**Sincerely,**

**(Potturi Venkateswara Rao)**

Dt 05.11.2007

This is in response to your letter dated 17.10.2007 addressed to me as well as the Opposition leader in the State Assembly.

The concerns you have raised, as a responsible senior citizen and as an eminent journalist, regarding the credibility of our democratic system and the image of the State in connection with the proposed judicial inquiry are understandable.

You have rightly pointed out that charges of corruption easily attract public attention. It is quite natural for opposition parties to benefit from this phenomenon.

All said and done, here is an opposition party that could not prove *even a single charge* out of the litany of allegations it made with regard to the execution of *Jalayagnam* during the 40-week-long 'Open Enquiry.' This party is now painfully resorting to mud-slinging at the drop of a hat.

This time, you must have noticed, the sole objective of the opposition party's campaign is clearly character assassination of the Head of the Government.

From a public standpoint, it may not be always appropriate to refrain from responding to wild charges made by the opposition party. In some cases, lack of a credible response could be construed as acceptance of the opposition party's charges.

When the opposition party has chosen to launch a relentless tirade with an ulterior motive, we need to act and find a permanent solution. In present-day politics, "Even a blatant lie, if unopposed, is deemed to be truth."

In this context, ordering a judicial probe appears to be the best option available to incontrovertibly establish that the opposition party's allegations are baseless. This is the only objective. I have no intention to personally belittle Opposition leader Mr. Chandrababu Naidu.

As you are among veteran journalists based in this State, I need not recount the background and circumstances under which Mr. Chandrababu Naidu and our family entered politics in 1978. Everybody knows what we both of us are today at the individual level, with our political rise or fall.

I hope you are now clear about why I opted for a judicial enquiry, while being fully aware of its implications in terms of costs, time, energy, intellect and man hours.

Still, considering that your well-meaning letter perhaps reflects the views of many enlightened citizens of the State, I assure that I will re-examine my stand on this issue in the larger interests of the State.

YS RAJASEKHARA REDDY

* * *

# తెలుసుకుందాం రండి – మనసు తలుపులు తెరిచి

**2007 చివర్లో.....**

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికను ప్రచురించే సమాచార పౌరసంబంధాలశాఖ కమీషనర్ సి. పార్థసారథి నాకు ఫోన్ చేశారు.

"ముఖ్యమంత్రిగారు తెలంగాణ కోసం ప్రభుత్వం ఏం చేస్తోంది? ఎలా పనిచేస్తోంది?... అన్న అంశాల మీద ఒక చిన్నపుస్తకం తయారు చేయాలనుకున్నారు. ఈ బాధ్యత మీరు తీసుకొని చేయాలని నా కోరిక...."

"సరే చేద్దామండి... అయితే వివిధ శాఖల క్రింద గణాంకాల వివరాలన్నీ కావాలి గదా!...." అన్నాను. ఆయన తెప్పిస్తానన్నారు.

ఒక వారం రోజుల్లో గణాంకాలు వచ్చాయి. మొత్తం డేటాని చిరుపుస్తకంలోఎలా ఇమడ్చాలీ అన్న అంశం దగ్గర్నుంచి కవర్ పేజి టైటిల్ దాకా మొత్తం డిజైన్ బాధ్యత నాకు అప్పగించారు. తెలంగాణకి అప్పటి వరకూ ముఖ్యశాఖల క్రింద జరిగిన అభివృద్ధి ఏమిటి? వైయస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయనున్న కార్యక్రమాలు ఏమిటి?.... ఇదే ఆ చిరుపుస్తకం.

మొత్తం పుస్తకం తయారయ్యాక దానికి పేరు ఇలా పెట్టాను.

"తెలుసుకుందాం రండి – మనసు తలుపులు తెరిచి"

పార్థసారథి డిజిటల్ ప్రింటు తీసుకెళ్లి ముఖ్యమంత్రికి చూపించారు. "చాలా చాలా మెచ్చుకున్నారు సిఎం" అని తరువాత పార్థసారథి నాకు చెప్పారు.

ఒకవారం తరువాత ముఖ్యమంత్రి కార్యదర్శి కుమారభాను ఏదో పని మీద ఫోన్ చేశారు. ఆ సంభాషణ అవగానే నేను అడిగాను. "తెలంగాణ అభివృద్ధి మీద నేను ఒక చిరుపుస్తకం డిజైన్ చేశాను. దాని మీద సిఎం గారి స్పందన ఏమిటి?"

భాను ఆశ్చర్యం ప్రకటించారు. "ఆ పుస్తకం మీరు డిజైన్ చేశారా? ఆ టైటిల్ ఎవరిదీ?"

"నేనే ఇచ్చాను...."

"అయ్యో, సిఎంకి ఈ విషయం తెలీదు. అంతా సమాచారశాఖ వాళ్లే చేశారనుకుంటున్నారు. చెబుతాను..." అంటూ ఫోన్ పెట్టేశారు.

మర్నాడో, ఆ మర్నాడో సిఎం పి.ఎస్ భాస్కరశర్మ ఫోన్ చేసి, సిఎంకి కనెక్ట్ చేశారు. సిఎం ఉత్సాహంగా మాట్లాడారు.

"వల్లీశ్వర్, ఆ 'మనసు తలుపులు తెరిచి....' పుస్తకం అంతా నువ్వే చేశావట గదా? చాలా బాగా వచ్చింది. ముఖ్యంగా ఆ టైటిల్, పుస్తకం చదివించేలా చేస్తోంది... కాంప్లిమెంట్స్.... సారీ, నాకు ముందు తెలియలేదు."

"థాంక్స్ సర్" అన్నాను ఓ చిన్న ఆనందంతో.




* * *

# 'ప్రసంగం' లేదు, ప్రసంగించారు

2006 డిశంబరులో 'ఆంధ్రప్రదేశ్' రజతోత్సవ సంచికని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు విడుదల చేయాలని కోరుకున్నాను. ఎందుకంటే....?

ఆలోచన వచ్చిన దగ్గరనుంచి సమయం చాలా తక్కువ వుంది. కాని నా సహచరులు కె.ఎస్.శాస్త్రి, చెన్నూరి గణేశ్, రాజఫణి, పద్మనాభరెడ్డిల సహకారంతో చేయగలిగాను.

ఆ సంచికలో 1956 డిశంబరులో 'ఆంధ్రప్రదేశ్' తొలి సంచిక నాటి నుంచి – 2006 వరకూ ఈ పత్రిక కోసం పని చేసిన అందరు సంపాదకుల నుంచీ వ్యాసాలను, ఈ పత్రికలో వాళ్ల అనుభవాలను సేకరించి వేయటం జరిగింది. ఒకప్పుడు ముఖ్యమంత్రిగారి సందేశం సకాలంలో రాకపోతే, రోజుల తరబడి ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లోనే సంపాదకవర్గం నిద్రించేవాళ్లట. భండారు పర్వతాల రావు గారు రాశారు. కుందుర్తి ఆంజనేయులు, బి.సి. కామరాజు (అడివి బాపిరాజు మేనల్లుడు), ఎన్.వి.గోపాలశాస్త్రి, నర్రా గోపాలకృష్ణమూర్తి, జి.రామారావు, ఎ.బి.కె. ప్రసాద్, రావుల సూర్యనారాయణ మూర్తి వంటి పెద్దలు పనిచేశారు. 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రం ఏర్పడక ముందున్న 'ఆంధ్రరాష్ట్రం' లో త్రిపురనేని గోపీచంద్ దీర్ఘకాలం పని చేశారట.

నా తపన ఒక్కటే – ఇవ్వాళ ఈ పత్రిక కొన్ని భాషా, సాహితీ ప్రమాణాలతో నిలబడివుందంటే – అందుకు గతకాలపు సంపాదకులు, వాళ్లకి సహకారం అందించిన కమీషనర్లు (పబ్లిషర్) కారణం. వాళ్లకి దక్కాల్సిన గౌరవం దక్కాలి.

ప్రత్యేక సంచిక పూర్తయింది. ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డిగారు దాని ఆవిష్కరణకు క్యాంపు కార్యాలయంలో సమయం కేటాయించారు. మీడియా ప్రతినిధులు, న్యూస్ టి.వి కెమెరామేన్‌లు బాగా వచ్చారు.

ఆ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి ప్రసంగం చేర్చబడలేదు. ఆయనకి అంత సమయంలేదని పి.ఎస్ భాస్కరశర్మ చెప్పారు. కాని, నాకు మాత్రం సిఎం మాట్లాడితే బాగుండునని వుంది. సమయం కేటాయించకుండా మాట్లాడమని నేను అప్పటికప్పుడు అడగలేను. కాని, ప్రసంగం లేకుండా ఆవిష్కరణ ఏమిటి? – నాకే నచ్చలేదు.

చూద్దాం, ఆ సమయానికి ఏదో మార్గాన్ని పైవాడు చూపించకపోతాడా అనుకున్నాను.

ఉదయం 9 గంటల ప్రాంతంలో సిఎం ఆవిష్కరణకు వస్తున్నారని కబురు వచ్చింది. సమావేశం హాలులో అన్ని ఏర్పాట్లు చేసుకొని వున్నాను. అకస్మాత్తుగా నా దృష్టి 1956 డిశంబరు నాటి తొలి సంచిక మీద పడింది. అది తెరిచి చూస్తుంటే, 'ఆంధ్రప్రదేశ్' అవతరణోత్సవం నాడు అప్పటి ముఖ్యమంత్రి శ్రీ.నీలం సంజీవరెడ్డి ఆకాశవాణిలో చేసిన ప్రసంగం కనుపించింది. ఎగిరి గంతేయాలనిపించింది. ఎందుకంటే, ఆ ప్రసంగమే డాక్టర్ రాజశేఖరరెడ్డిగారి రాజకీయ విధానం కూడా.

ఆ పుస్తకంలో ఆ పేజీలో ఒక కలర్ ఫ్లాగ్ పెట్టాను....

ముఖ్యమంత్రి వచ్చేశారు. అన్ని కెమెరాలు 'రెడీ' అయ్యాయా లేదా అని చూసుకొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమాచార శాఖామంత్రి షబ్బీర్ ఆలీ, సమాచార శాఖ ఇన్‌ఛార్జి కమీషనర్ ఎ.ఎల్.కిస్మత్ కుమార్ కూడా వున్నారు.

స్టిల్ కెమెరాలు 'క్లిక్–క్లిక్' అంటుండగా, టి.వి కెమెరాలు రోల్ అవుతుండగా అందరి కరతాళ ధ్వనుల మధ్య ఆయన 'ఆంధ్రప్రదేశ్' స్వర్ణోత్సవ సంచికను ఆవిష్కరించారు.... అయిపోయింది.

"అయిపోయిందా?" అన్నారు సిఎం కదలబోతూ.

"ఒక్క నిమిషం సర్. ఇది చూడండి. 'ఆంధ్రప్రదేశ్' తొలి సంచిక ఇది. ఇందులో అప్పటి ముఖ్యమంత్రి సంజీవరెడ్డి గారు రాష్ట్ర అవతరణ దినంనాడు ఆకాశవాణిలో చేసిన ప్రసంగం పాఠం వుంది......" అంటూ ఫ్లాగ్ పెట్టిన పేజిని ఠక్కున తీసి చూపించాను. అందులో కూడా సంజీవరెడ్డి ప్రసంగంలో ముఖ్యమంత్రి రాజకీయ విధానానికి అనుకూలంగా వున్న మూడు పేరాలు మార్క్ చేసి మరీ చూపించాను.

ఆ మూడు పేరాలూ క్షణాల్లో మనసులో చదువుకున్నారు ముఖ్యమంత్రి. ఆయనకి ఉత్సాహం వచ్చేసింది. తనంతటతనే మైక్ చేతుల్లోకి తీసుకుని సంజీవరెడ్డిగారి ప్రసంగంలోని ఆ మూడు పేరాలూ టకటక చదివేశారు.

ఆ మూడు పేరాల్లో సారాంశం ఏమిటంటే...

"ఆంధ్ర రాష్ట్రం, హైద్రాబాద్ రాష్ట్రం కలిసి ఒకే 'ఆంధ్రప్రదేశ్'గా ఏర్పడటం మన అదృష్టం. ఈ కలయిక ముచ్‌కుందా (మూసీ), కృష్ణా నదుల సంగమం వంటిది. మంజీర,

గోదావరి నదుల సంగమం వంటిది. ఈ కలయికవల్ల తెలుగు వారి సాహితీ సౌరభాలు మరింత దృఢంగా ఖండఖండాంతరాల్లో విస్తరిస్తాయి....

ఈ కలయిక స్థిరమైనది, బలమైనది, ఎన్నటికీ చెరగనిది, తరగనిది...."

... అని అక్కడ వున్న మూడు పేరాలు చదివేసి సిఎం వెళ్ళిపోయారు.

ఆ రోజు అన్ని టివిల్లోనూ ఈ మూడు పేరాల సారాంశమే ప్రముఖ వార్తగా మ్రోగిపోయింది.

ఒక జర్నలిస్టు మిత్రుడు నన్ను అడిగారు. "ఇంతకీ సిఎంగారు ప్రసంగించినట్లా లేనట్లా?....."

నేను ఓ వెర్రి నవ్వు నవ్వాను.

* * *



'ఆంధ్రప్రదేశ్' పత్రిక స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణలో ముఖ్యమంత్రి వైయస్సార్, మంత్రి షబ్బీర్ అలీ, సమాచారశాఖ కమీషనర్ ఇన్‌ఛార్జ్ కిస్మత్ కుమార్‌లతో

# సంస్కృత భాష కోసం సిఎం

**2007 ఫిబ్రవరి 15.....**

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన ఏలూరు నుంచి కొంతమంది మిత్రులు వచ్చి నన్ను కలిశారు.

ఏలూరులో అప్పటికి 60 సంవత్సరాలకు పైగా చెఱుకువాడ వారి ధర్మసత్రం ఆవరణలో – ఆ సత్రం ధర్మకర్తల కేటాయింపుతో – నడుస్తున్న 'హేలాపురి సంస్కృత పాఠశాల'ను స్వాధీనం చేసుకుంటామని దేవాదాయశాఖ 2007 జనవరి 31న ఉత్తర్వులు ఇచ్చిందనీ, పాఠశాల స్థలం ప్రభుత్వం చేతుల్లోకి వెళితే, ఇక ఏలూరులో సంస్కృత భాషాబోధన శాశ్వతంగా స్తంభించిపోతుందనీ వాళ్లు ఆవేదన చెందారు.

"ఎలాగైనా మీరు మీ పరపతి ఉపయోగించి మన పాఠశాల మనకి దక్కేలా చేయాలి. లేదంటే కొన్ని వందలమంది మీ వంటి వాళ్లకి సంస్కృతం నేర్పిన ఈ పాఠశాల స్థానంలో రేపు ఓ పానశాలకి ఈ స్థలాన్ని ఎండోమెంట్ శాఖ లీజుకిచ్చినా ఆశ్చర్యపడనక్ఖర్లేదు. వివిధ స్థాయిల్లో ప్రయత్నాలు చేసి, చివరి సారిగా మీ దగ్గరకు వచ్చాం. ఏదో ఒకటి చేసి దీన్ని ఆపించండి....." అంటూ అప్పటి పాఠశాల కమిటీ కార్యదర్శి చక్రధర్ అభ్యర్థించారు.

సంస్కృతభాషని నేర్చుకున్న వాళ్లు మాత్రమే వేదవిజ్ఞానాన్ని చదివి అర్థం చేసుకోగలరు. అందుకే సంస్కృత భాషని దేశంలో అధికార భాషగా చేయాలని డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ సయితం వాంఛించారు. సంస్కృతభాషా ప్రచారం విస్తృతంగా జరగటం ఒక్క భారతదేశానికే కాక, మొత్తం ప్రపంచానికే మంచిదని విశ్వసించే వాళ్లలో నేనూ వున్నాను.

60 ఏళ్లకు పైగా వందలాది విద్యార్థులకు ఉచితంగా సంస్కృతం బోధించిన శ్రీ కంచి కామకోటి హేలాపురీ సంస్కృత పాఠశాలని దక్కించుకుని తీరాలన్న సంకల్పం నాకు కూడా కలిగింది.

అప్పుడు – వాళ్లు తెచ్చిన వినతి పత్రం స్వరూపాన్ని మార్చాను. ఎలా వినతి పత్రం వుంటే, అధికారులు సులువుగా 'నో' అనటానికి వీలుండదని నేను అనుకుంటున్నానో అలా తయారు చేశాను.

మర్నాడు ఉదయమే సిఎం క్యాంపు ఆఫీసుకి వెళ్లి, సిఎంకి ఆ వినతి పత్రం ఇచ్చాను. “ఇది జరిగి తీరాలి సర్” అన్నాను అభ్యర్థనగా.

“నువ్వు కూడా మన అరవిందరావు (ఇంటెలిజెన్స్ IG) గారిలాగా సంస్కృతం మాట్లాడతావా?” అని సిఎం అడిగారు.

“సంస్కృతం చదవగలను. కొంచెం కొంచెం అర్థం చేసుకోగలను. కానీ, మాట్లాడటం అలవాటు లేదు.....”

సిఎం ఓ నవ్వు నవ్వారు. ఆ వినతి పత్రం మీద ఓ పొట్టి సంతకం పెట్టి, నాకే తిరిగి ఇచ్చేశారు. అంటే, నేనే అధికారుల వెంటబడి చేయించుకోవాలని ఆయన ఉద్దేశ్యం. అప్పటికప్పుడే, సిఎం కార్యదర్శి సుబ్రహ్మణ్యం గారికి తీసుకెళ్లి ఇచ్చాను. “ఇది మా వూరి సమస్య. నేను చదువుకున్న పాఠశాల సమస్య. జరిగేలా చూడాలి....” అన్నాను. ఆయన అప్పటికప్పుడే, ఆ వినతి పత్రానికి ఒక నోట్ జతపరిచారు. “గౌరవ ముఖ్యమంత్రి ఈ వినతి పత్రం మీద మీరు తగుచర్యలు తీసుకొని, మళ్లీ ఈ కార్యాలయానికి తెలియజేయాలని కోరుతున్నారు” అని రెవెన్యూ కార్యదర్శి రాశారు.

ఆ కాగితాల కట్ట నా చేతికిచ్చేయమన్నాను. ఆయన ఇచ్చేశాడు. అవి తీసుకుని రెవెన్యూ (ఎండోమెంట్) కార్యదర్శి డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి దగ్గరకి వెళ్లాను. మళ్లీ ఆ కథంతా చెప్పాను. “ఇది ఎలాగైనా జరిగి తీరాలి సర్” అన్నాను. ఆయన అందంగా ఓ నవ్వు నవ్వారు.

ఓ నెల రోజుల తరువాత డాక్టర్ ఐ.వి.సుబ్బారావు నాకు ఫోన్ చేశారు. “ఆ నోట్ మీద ఏలూరు ఎండోమెంట్ అధికారుల దగ్గర్నుంచి సానుకూలంగా వివరణ తెప్పించాను. ఆ ఫైలు ఇప్పుడు దేవాదాయ శాఖామంత్రి జె.సి. దివాకరరెడ్డి గారికి వెళ్లింది. అక్కడ తిరస్కరించకుండా చూసుకోండి...” అని సుబ్బారావుగారు చెప్పారు.

మర్నాడు పొద్దుటే దివాకరరెడ్డి గారింటికి వెళ్లాను. మళ్లీ ఈ కథంతా ఆయనకి చెప్పాను. “మీరు ఎలాగైనా ఇది జరిగేలా చేయాలి” అన్నాను అభ్యర్థనగా. (ఆయన నాకు 1990 నుంచి తెలుసు.) “అలాగా, తప్పకుండా చేసేస్తాను వల్లీశ్వర్” అన్నారు. ధైర్యంగా తిరిగొచ్చేశాను.

రెండు రోజుల తరువాత డాక్టర్ ఐ.వి.సుబ్బారావు గారు ఫోన్ చేశారు. “వల్లీశ్వర్, మంత్రి దివాకరరెడ్డిగారు అడ్డంగా రాసేశారు. ఈ స్థలం పాఠశాలకి ఇవ్వనక్కర్లేదని కుండబద్దలు కొట్టినట్లు రాశారు. ఇప్పుడేం చేద్దాం?.....”



"నేను ఏం చేయాలి సర్? మీరే ఆ ఫైలుని సిఎంకి పంపించండి. నేను సిఎం గారి దగ్గర మాట్లాడుకుంటాను...."

"మంత్రి 'నో' అని రాశాక, ఆ ఫైలుని నా అంతట నేను సిఎం ఆఫీసుకి పంపకూడదు. సిఎం కార్యాలయం అడిగితేనే పంపగలను...." అన్నారు డాక్టర్ సుబ్బారావు. ఆయన చాలా క్రమశిక్షణ పాటించే అధికారి.

మళ్లీ మర్నాడు సిఎం కార్యదర్శి సుబ్రహ్మణ్యంని కలిశాను. పరిస్థితి వివరించాను. "సుబ్రహ్మణ్యంగారు, సంస్కృత భాష విలువ మీకు తెలిసి వుంటుంది. వందలాది విద్యార్థుల్ని తయారు చేసిన, చేస్తున్న సంస్థని ఇలా దేవాదాయశాఖ లాక్కోవటం న్యాయమేనా? నాకు ఎలాగైనా పని జరిగి తీరాలి. మీకు ఏమైనా ఇబ్బంది వుంటే, నేను మళ్లీ సిఎంని కలుస్తాను..."

ఆయన దళిత నేపథ్యం నుంచి ఎదిగినవాడు. సంస్కారవంతుడు. పేదవాళ్లయిన దళిత పిల్లల కోసం మిత్రులతో కలిసి నెల్లూరులో ఒక వితరణ సంస్థని నడుపుతున్నాడు. నేను ఆ సంస్థ కోసం 'అడుగుజాడల్లో' అనే పుస్తకం కూడా తయారు చేసి ఇచ్చాను.

"వల్లీశ్వర్, మీరు దీని కోసం మళ్లీ సిఎంని కలవనక్కర్లేదు. నాకు వదిలేయండి" అన్నారు సుబ్రహ్మణ్యం. ఆ ఫైలుని ఆయనే డాక్టర్ సుబ్బారావు దగ్గర్నుంచి తెప్పించుకుని, సిఎం ముందుపెట్టారు. అప్పుడేం జరిగిందంటే (సుబ్రహ్మణ్యం మాటల్లో).....

"ఇది వల్లీశ్వర్ అడుగుతున్న ఏలూరు సంస్కృత పాఠశాల స్థలం విషయం, మంత్రి దివాకరరెడ్డి 'ఇవ్వనక్కర్లేదు' అని రాసేశారు – అని సిఎంకి చెప్పాను. ఆయన ఓ నవ్వు నవ్వేసి, 'సంస్కృత భాష విలువ దివాకరరెడ్డికేం తెలుసు?' అన్నారు. అంటూనే ఫైలు మీద 'వెంటనే జిఓ (ప్రభుత్వ ఉత్తర్వు) ఇచ్చేయండి' అంటూ రాసేశారు వల్లీశ్వర్."

మర్నాడు సుబ్రహ్మణ్యం నన్ను పిలిచి ఆ 2007 మే 31 నాటి జిఓ చేతికిచ్చారు. ఆ జిఓ ప్రకారం – ప్రభుత్వం 2007 జనవరి 31 నాటి దేవాదాయశాఖ ఉత్తర్వుల్ని రద్దు చేసింది. అదే సత్రం ఆవరణలో శ్రీ కంచి కామకోటి హేలాపురి సంస్కృత పాఠశాల నడుపుకోవటానికి దీర్ఘకాలిక లీజు మంజూరు చేసింది.

* * *

# వందేకరాలిచ్చిన 'నిప్పులాంటి నిజం'

**2008 జూన్ 1 ...**

ఆ రోజే అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతంలో మే 29న శాసనసభకు జరిగిన ఉపఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెలంగాణ రాష్ట్రసమితికి చెందిన శాసనసభ్యులు, ఎంపీలు రాజీనామా చేయటం వల్ల జరిగిన ఉపఎన్నికలు అవి. ఆ ఎన్నికలలో టి.ఆర్.ఎస్ స్థానాలు అసెంబ్లీలో 16 నుంచి 9కి, పార్లమెంటు స్థానాలు 4 నుంచి 2కు తగ్గిపోయాయి. ఎక్కువ సీట్లను కాంగ్రెసు, ద్వితీయ స్థానంలో తెలుగుదేశం గెల్చుకున్నాయి. సిఎం రాజశేఖరరెడ్డి మొహంలో ఆనందం తొణికిసలాడుతోంది.

ఆ సమయంలో 'ఎమెస్కో' సంస్థ అధిపతి దూపాటి విజయకుమార్ గారితో కలిసి నేను సిఎంని క్యాంపు ఆఫీసులో కలిశాను. అప్పుడే బయటనుంచి వస్తున్న సిఎం మమ్మల్ని చూసి ఆగిపోయారు. "సర్, రాజీవ్‌గాంధీ 'హత్య–దర్యాప్తు'ల మీద ప్రత్యేక దర్యాప్తు బృందం సారథి డి.ఆర్. కార్తికేయన్, IPS, రాసిన 'Triumph of Truth' అనే పుస్తకాన్ని మీ వల్లీశ్వర్ తెలుగులోకి అనువదించాడు. దీన్ని ఈ జూన్ 08 న మీరు ఆవిష్కరించాలి..... ఆ రోజు ఆదివారం. ఉదయం 10 గంటలకు జూబ్లీ హాలులో జరుగుతుంది. మీరు ఎలాగైనా రావాలి...." అని విజయకుమార్ చెబుతున్నారు. అంత తక్కువ వ్యవధిలో అలా నిర్దిష్టమైన తేది, సమయం చెప్పి రమ్మంటే సిఎం రాగలగడం అనేది మహా దుర్లభం.

సిఎం నావంక చూస్తూ, "ఏమిటి నువ్వు పుస్తకాలు రాస్తావా?" అని అడిగారు. "ఇదే మొదటి అనువాద రచన. విజయకుమార్ రాయించారు" అన్నాను.

"ఇంకేంటి విజయకుమార్‌గారూ, మా వల్లీశ్వర్ రాసిన పుస్తకం గదా!.... చేసేద్దాం" అంటూ తన పిఎస్ భాస్కరశర్మని పిలిచి, "ఆ తేదీ, ఆ సమయం ఖాళీ వున్నాయా?" అని అడిగారు. (అప్పటికే నేను భాస్కరశర్మతో మాట్లాడి వున్నాను.) ఆయన వెంటనే చెప్పాడు – "వున్నాయి సర్...."

విజయకుమార్‌కి సిఎం అభయం ఇచ్చేశారు. "ఓకె. వచ్చేస్తాను" అన్నారు.

జూన్ 08 ఆదివారం ఉదయం 10 గంటలకల్లా జూబ్లీ హాలు కిటకిటలాడిపోయింది. రాజశేఖరరెడ్డిగారు ఓ 30 నిమిషాలు ముందుగా వచ్చేశారు. దాంతో ఆయన్ని శాసనమండలి విఐపి లాంజ్‌లో కూర్చోబెట్టాం. ఆ సభకు అధ్యక్షత వహిస్తున్న 'ఇంగ్లీషు, విదేశీభాషల విశ్వవిద్యాలయం' (EFLU) వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అభయమౌర్యని అక్కడే నేనూ, విజయకుమార్ సిఎంకి పరిచయం చేశాం. విజయకుమార్‌గారు నాకు ముందే చెప్పారు. "అభయమౌర్య గారికి సిఎం అప్పాయింట్‌మెంటు దొరకటం కష్టంగా వుంది. వాళ్ల యూనివర్శిటీకి భూమి కావాల్సి వుంది. ఓ మంచి పని కదా! మనం ఎలాగైనా సిఎంని కలిపించాలి". మా ప్లాన్ ప్రకారం లాంజ్‌లో సిఎంని ఆయనకి కల్పించాం. అక్కడ్నుంచి విశ్వవిద్యాలయ కార్యకలాపాల గురించి ఆసక్తిగా సిఎం అడిగి తెలుసుకున్నారు. మాటల్లోనే ప్రొఫెసర్ మౌర్య – తమ విశ్వవిద్యాలయానికి హైద్రాబాద్‌లో తార్నాక సమీపంలోని ఆవరణ సరిపోవటం లేదనీ, తాము విశ్వవిద్యాలయాన్ని కొత్త కోర్సులతో విస్తరించాలనుకుంటున్నామనీ, అందుకు ప్రభుత్వం భూమి ఇవ్వాలనీ కోరారు.

"ఎంత భూమి కావలసివస్తుందీ?...."

"వంద నుంచి 150 ఎకరాల వరకు సర్...."

"సరే ఈ మీటింగ్ అయిపోయాక నాకు గుర్తు చేయండి" అన్నారు సిఎం

డి.ఆర్.కార్తికేయన్, రిటైర్డ్ ఐఎఎస్ పి.వి.ఆర్.కె.ప్రసాద్, ఎం.పి టి.సుబ్బిరామిరెడ్డి, మంత్రి మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్న సభలో 'నిప్పులాంటి నిజం' పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. పి.వి.ఆర్.కె ప్రసాద్ తన ప్రసంగంలో 'నిప్పులాంటి నిజం' పుస్తకాన్ని సమీక్ష చేశారు. ఒక రేసుగుఱ్ఱం పరుగెత్తినట్లు చదివించిందని అన్నారు.

సిఎం మాట్లాడుతూ, "ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, అన్ని ఇతర రకాల కమ్యూనికేషన్స్... ఇలా ఏవి తెలుగులో రాయాల్సివచ్చినా, వల్లీశ్వర్ రాసినంత సరళంగా, స్పష్టంగా రాసే వాళ్లని తాను చూడలేదని మా ప్రభుత్వ ఆర్థిక విషయాల సలహాదారు సోమయాజులుగారు చెబుతుంటారు. ఈ విషయంలోనాకు భేదాభిప్రాయం లేదు...." ఇలా సాగింది సిఎం ప్రసంగం. సాహితీరంగానికి 'ఎమెస్కో' సేవలను సిఎం ప్రత్యేకంగా అభినందించారు.

సిఎం వేదిక దిగబోయే ముందు EFLU వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అభయమౌర్య సిఎంకి తమ విశ్వవిద్యాలయ అవసరాన్ని గుర్తుచేశారు.

ఆ సాయంత్రం ప్రొఫెసర్ అభయమౌర్యకి సిఎం దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే ఆయన సిఎం క్యాంపు ఆఫీసుకెళ్లారు. సిఎం ఆయనకి అతిథిమర్యాదలు చేసి, శుభవార్త చెప్పారు.

"నల్గొండ జిల్లాలో మీ EFLU అవసరాల కోసం వంద ఎకరాల భూమిని కేటాయిస్తున్నాం...." అంటూ ప్రకటించారు.

అభయమౌర్య ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ఆయన మాటల్లో చెప్పాలంటే – "ఇంత శీఘ్రంగా నిర్ణయాలు తీసుకునే నాయకులు ఈ దేశంలో ఇంకా వున్నారా?"

ఆ రాత్రి అభయమౌర్య గారు నాకూ, 'ఎమెస్కో' విజయకుమార్‌కి ధన్యవాదాలు చెబుతూ, "మీ నిప్పులాంటి నిజం' ఆవిష్కరణ వల్ల మా యూనివర్సిటీకి వందెకరాలు లభించింది....!" అన్నారు.






* * *

# అభివృద్ధి వేగం 9% కాదు!

**2008 మార్చి 3.....**

ఉదయం సమాచార పౌరసంబంధాల శాఖలో నా 'ఆంధ్రప్రదేశ్' కార్యాలయానికి చేరే సరికి 12 గంటలు కావస్తోంది.

ఆఫీసుకి చేరగానే పత్రికలు తిరగేశాను. ముందు రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే' (దేశ ఆర్థిక పరిస్థితి విశ్లేషణ) వార్త ప్రముఖంగా ప్రచురితమైంది.

ఆ సర్వేప్రకారం 2007-08 సంవత్సరంలో భారతదేశ అభివృద్ధి వేగం తొమ్మిది శాతం.

ఏ పత్రిక చూసినా అదే వార్త ప్రముఖంగా వుంది. అభివృద్ధి వేగం 9%.....9 శాతం.... ఇలా అన్ని పత్రికలూ ఒకటే విషయం రాశాయి. మన రాష్ట్రంలో అభివృద్ధి వేగం 10.37 శాతం కదా! అంతకు ముందు శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చెప్పారు. మన ప్రగతి వేగం 10.37% అంటే, జాతీయ స్థాయికన్నా మనమే ఎక్కువ అనుకుంటున్నాం.

తటాలున ఒక ఆలోచన వచ్చింది. వెంటనే కంప్యూటర్ ముందు కూర్చున్నాను. ఒక గంటసేపు కుస్తీపడితే, నేను అనుకున్న విధంగా ఒకటి తయారైంది.

అప్పటికి సమయం మధ్యాహ్నం 1 గంట దాటింది.

ముఖ్యమంత్రిగారి కోసం ఫోన్ చేశాను. ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఫోన్ ఎత్తారు. "సిఎంగారు భోజనానికి ఇంటికి వెళ్లారు సర్. రెండు గంటలకి హెలికాప్టర్‌లో టూర్ వెళ్తున్నారు...." అని చెప్పారు.

నాకున్న సమయం 30-40 నిమిషాలు. వెంటనే నేను తయారు చేసిన విషయం తీసుకుని సిఎం క్యాంపు ఆఫీసుకి పరుగెత్తాను. అప్పటికే అక్కడ సిఎం వెంట టూర్‌లో వెళ్లటానికి ఆయన కార్యదర్శి సుబ్రహ్మణ్యం సిద్ధంగా వున్నారు.

ఆయనకి నా ఆలోచన వివరించాను. ఆయన “చాలా బాగుంది.... రా.. రా..” అన్నాడు. ఇద్దరం కలిసి సిఎం ఇంటికి (క్యాంపు ఆఫీస్ వెనకాల) వెళ్లాం. మేం వెళ్లిన అయిదు నిమిషాలకి సిఎం బయటకొచ్చారు.

“ఏం వల్లీశ్వర్!” అన్నారు.

నేను తీసుకెళ్లిన ప్రింట్ చూపించాను. ఆయన చూస్తుంటే చెప్పాను.

“సర్, ఇప్పుడు దేశమంతా చర్చిస్తున్న వార్త – జాతీయ అభివృద్ధి వేగం 9 శాతం అన్నదే. నిన్ననే పార్లమెంటులో ‘ఎకనామిక్ సర్వే’ చెప్పింది కదా. అందరూ అదే మాట్లాడుతున్నారు. ఈ సమయంలో మనం ఈ ప్రకటన అన్ని జాతీయ దినపత్రికలలో వేయిస్తే, మన రాష్ట్ర ప్రగతి వేగం జాతీయ స్థాయిని మించిపోయిందనీ తెలుస్తుంది, మీ సారథ్యంలో మీ రాష్ట్రం ఎలా వేగంగా ముందుకు పోతున్నదీ తెలుస్తుంది. జాతీయ స్థాయిలో అందరి దృష్టిని మీ నాయకత్వం ఆకర్షించడానికి ఇదొక గొప్ప అవకాశం....”

అది చూస్తూనే రాజశేఖరరెడ్డిగారి మొహంలో చిరునవ్వు మెరిసింది. నేను తీసుకెళ్లిన ప్రింట్ మీద ‘Ok’ అని సంతకం చేశారు. నా భుజం తట్టి, కారెక్కేశారు.

ఒక అరగంట తరువాత సిఎం ఆదేశాల్ని, నేను తయారు చేసిన ప్రకటన నమూనాని కమీషనర్ పార్థసారథి గారికి అందించాను.

మర్నాడు దేశంలోని అన్ని ప్రధాన ఆంగ్ల దినపత్రికలలోనూ అంటే – Hindustan Times, Times of India, Economic Times, Indian Express, Financial Express, Deccan Chonicle, Business Line, Business Standard, The Hindu పత్రికలలో నాలుగో వంతు పేజిలో ఆ ప్రకటన ప్రముఖంగా ప్రచురితమైంది.


THE HINDU

**No,**
**growth-rate is not 9%,**
**it is 10.37 %...**

...in Andhra Pradesh in 2007-08.
It is a record in the history of Andhra Pradesh.
The highest ever food-grains production now is 180 Lakh tons.

"Holding 9% growth is challenge; achieving two digit growth is even greater": Economic Survey

* * *

# నన్ను డైరక్టర్‌ని చేసి '108'

**2007 డిశంబరు 8.....**

ఆ శనివారం రాత్రి EMRI (Emergency Medical Response Initiative) నుంచి జ్వాలా నరసింహారావు ఫోన్ చేశారు.

"రేపు ఉదయం మా '108' సర్వీసుల మీద తీస్తున్న షార్ట్‌ఫిలిమ్‌కి ముఖ్యమంత్రిగారి మాటలు కొన్ని షూట్ చేస్తున్నాం. కొంచెం మీరు కూడా రావాలి...."

"మీ షార్ట్‌ఫిలిమ్‌తో నాకేం సంబంధం? ఆదివారం కదా! సొంత పనులుంటాయి. నన్ను వదిలేయండి" అన్నాను.

జ్వాల వదిలిపెట్టలేదు.

"కాదు, కాదు, క్రిందటిసారి '108' అంబులెన్స్ డిజైన్‌లో రాజీవ్‌గాంధి ఫొటో విషయంలో సిఎంకి కోపం వచ్చినప్పుడు మీరు మాకు సాయం చేశారు. ఈ షార్ట్‌ఫిలిమ్‌ని కె. రాఘవేంద్రరావుగారు డైరెక్ట్ చేస్తున్నారు కదా! సిఎం మనసులో ఎలా వుందో తెలీదు. కొంచెం మీరు దగ్గరుంటే ఆయన విసుక్కోకుండా ఆయన మాటలు వీడియోరికార్డింగ్ చేయగలుగుతాం. ప్లీజ్, ప్లీజ్...." అంటూ జ్వాల నన్ను చాలా మొహమాట పెట్టారు. జ్వాల మంచి మిత్రులు. తన పని అయ్యేదాకా వదిలిపెట్టని పట్టుదల గల మనిషి.

ఆ ఆదివారం నాకు చాలా ముఖ్యమైన పని వుంది. అయినా జ్వాలని కాదనలేకపోయాను. (2014-19లో ఈయన తెలంగాణ సిఎంకి సిపిఆర్వోగా వున్నారు.)

**డిశంబరు 9 ఆదివారం.....**

ఉదయం 9 గంటలకల్లా సిఎం క్యాంపు ఆఫీసుకి వెళ్లాను. లాంజ్ – Iలో షూటింగ్‌కి ఏర్పాట్లు చేసుకోమని EMRI సి.ఇ.ఓ వెంకట్ చంగవల్లి గారికి, జ్వాలకి చెప్పాను.

షూటింగ్‌లో ఏయే అంశాలు సిఎం చెప్పాలో జ్వాల ఒక కాగితం మీద రాసుకొచ్చారు. ఆ అంశాలన్నీ విడివిడిగా పెద్ద అక్షరాలలో వేర్వేరు కాగితాల మీద రాయించి, సిఎం వచ్చే సమయానికి డిటిపి చేయించి పెట్టాను.

సిఎం రాగానే అందర్నీ చిరునవ్వుతో పలకరించారు. ఒక్కో అంశం వున్న కాగితాన్ని కెమెరామేన్ కెమెరా ప్రక్కన పట్టుకుని నిలబడితే, సిఎం చదువుతున్నారు. రెండు సార్లు తప్పులు చదివారు. అప్పటికే 20 నిమిషాలు దాటింది. సిఎం వీళ్లకిచ్చిన సమయం 15 నిమిషాలు. సిఎం తప్పులు చదివినప్పుడల్లా నేను 'రీటేక్' అంటున్నాను. అలా మూడుసార్లు చెప్పాను. సిఎం కొంచెం అసహనంగా కదిలారు. "సరే, తర్వాత బుల్లెట్......" అంటున్నారు. వెంకట్‌గారు, జ్వాలగారు ఖంగారు పడుతున్నారు. సిఎంకి కోపం వస్తే, మొత్తం షూటింగ్ ఆగిపోతుందేమోనని వాళ్ల ఆదుర్దా. పైగా గతంలో '108' అంబులెన్స్ మీద రాజీవ్‌గాంధి ఫొటో విషయంలో సిఎంగారి కోపాన్ని వాళ్లు చవిచూసి వున్నారు.

నేను ధైర్యం చేసి సిఎం గారితో ఒక మాట అన్నాను.

"సర్, ఇలా మేం రాసి, మీకు చూపించి, మీరు అవి చదివీ, తప్పులు వచ్చీ.... ఇదంతా ఎందుకు? '108' అంబులెన్స్‌లు ఎందుకో, అవి ఎలాంటి సేవ చేస్తాయో, ప్రజలు ఎలా వినియోగించుకోవాలో, ఎలాంటి సందర్భాల్లో వినియోగించుకోవాలో – అన్నీ మీకు తెలుసు గదా! ఒక్కొక్క అంశాన్ని విడివిడిగా మీ అంతట మీరే సొంతంగా చెప్పేయండి. మరీ బాగా లేకపోతే 'రీటేక్' చేద్దాం.... ఆ అవసరం రాకపోవచ్చు కూడా...." అన్నాను.

రాజశేఖరరెడ్డిగారికి ఇది నచ్చింది. "ఓకె" అన్నారు. "అయినా, వాళ్లు తయారు చేసిన పాయింట్స్ అన్నీ ఓసారి చూడనీ" అన్నారు. ఇచ్చాను. ఆయన అన్నీ చూసుకుని "ఓకె" అన్నారు.

అంతే! ఆ తరువాత షూటింగ్ అంతా నల్లేరు మీద బండి నడకలా సాగింది. ఒకే ఒక్క రీటేక్‌తో మొత్తం షూటింగ్ జరిగిపోయింది. అప్పటికే మూడుసార్లు సిఎం పి.ఎస్ కిరణ్‌కుమార్ రెడ్డి వచ్చారు. సిఎంగారి తరువాత అపాయింట్‌మెంట్స్ అన్నీ లేటయిపోతున్నాయంటూ ఆయన ఖంగారు పడుతున్నాడు.

మొత్తం షూటింగ్ పూర్తయ్యాక సిఎం గారు వెంకట్‌చంగవల్లిగారితో, జ్వాలతో కరచాలనం చేస్తూ చిరునవ్వుతో "ఈ ఫిలిమ్ 108 సేవలు అర్థవంతం అయ్యేలా చేయాలి..." అన్నారు.

వెనక్కి తిరిగి నన్ను చూసి జోక్ చేశారు.

"నువ్వు డైరక్టర్ అయిపోవచ్చు వల్లీశ్వర్...."

కొంచెం సిగ్గుపడ్డాను.

అంతకుముందు 2006లో రాష్ట్రచలన చిత్ర టెలివిజన్ నాటకరంగ సినిమా సంస్థ ప్రభుత్వ అభివృద్ధి పథకాల మీద తయారు చేస్తున్న ఒక ఫిలిమ్ షూటింగ్‌లో ఆ సంస్థ ఛైర్మన్ ఘట్టమనేని శేషగిరిరావు గారు తయారు చేయించిన అంశాలని షూట్ చేసేటప్పుడు ఓ గంట సేపు సిఎం గారూ నేనూ కుస్తీపట్టాం. వాళ్లు రాయించిన భాషని పల్లెప్రజలకు అర్థమయ్యేలా సరళంగా మార్చమన్నారు నన్ను సిఎం. అప్పుడూ ఇలాగే రీటేక్‌లూ, మార్పులూ....!

ఆ వైయస్సార్ ఇప్పుడులేరు. కాని ఆయనతో షార్ట్‌ఫిల్మ్‌ల అనుభవం మిగిలింది.



*108 అంబులెన్స్ షూటింగ్‌లో ముఖ్యమంత్రి వైయస్సార్, EMRI సిఇఓ వెంకట్ చెంగవల్లితో*



* * *

# వైయస్సార్ తిరగరాసిన 'అర్చక' చరిత్ర

**2007 డిశంబరు 15....**

1987 లో ఎన్.టి. రామారావు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేవాలయాలలో వంశ పారంపర్య అర్చకత్వాన్ని, అన్ని రకాల మిరాసీ హక్కుల్ని రద్దు చేస్తూ దేవాదాయ ధర్మాదాయ చట్టాన్ని సవరించింది. అందుకు తగిన కారణంగా – తిరుమల తిరుపతి దేవస్థానాల్లోని మిరాసీ వ్యవస్థను ప్రభుత్వం చూపించింది.

అలా నేరుగా చెప్పకుండా, ముందు మిరాసీ వ్యవస్థ మీద చల్లా కొండయ్య కమీషన్ వేసింది. కమీషన్ లక్ష్యానికి అనుగుణంగా 'ఈనాడు' లో 'కలియుగ వైకుంఠం' అనే పేరుతో వ్యాసాలు వరుసగా ప్రచురితమయ్యాయి. చివరికి కమీషన్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా ఎన్.టి.రామారావు ప్రభుత్వం (ముందుగానే నిర్ణయించుకున్న అజెండా ప్రకారం) మిరాసీ వ్యవస్థని రద్దు చేసింది.

రాష్ట్రంలో 30 వేలకు పైగా దేవాలయాలున్నాయి. అన్ని దేవాలయాలకూ తిరుమల దేవాలయంలా కోట్లల్లో ఆదాయాలున్నాయా? అలాంటి చోట వంశ పారంపర్య హక్కుదారులు కోట్లకుకోట్లు సంపాదిస్తారా? అయినా, వంశ పారంపర్య అర్చక వ్యవస్థని ఒక్క తిరుమల సాకుగా – అన్ని దేవాలయాల్లో ఎలా రద్దు చేస్తారు?.... ఈ అంశం మీద అర్చకులందరికీ కడుపు మండిపోయింది. చిలుకూరులోని బాలాజీ ఆలయానికి చెందిన (ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు) ప్రొఫెసర్ సౌందర రాజన్ ఆధ్వర్యంలో అర్చకులు ఉద్యమించారు. ఆ ఒక్క ప్రొఫెసర్ – ఏ అర్చక సంఘం కలిసి వచ్చినా, రాకపోయినా సుప్రీం కోర్టు దాకా పోరాడారు. 'చట్టం కోరల్లో దేవాలయాలు' అని పుస్తకాలు రాసి ప్రభుత్వవైఖరిని ఎండగడుతూ ప్రచారం చేశారు.

ప్రతి ఎన్నికల సమయంలోనూ ప్రతి పార్టీ నాయకుణ్ణీ కలిసి – మీ ఎన్నికల ప్రణాళికలో "ఈ క్రూరమైన చట్ట సవరణని రద్దు చేస్తాం" అని ప్రకటించండీ – అని బ్రతిమాలారు, అర్థించారు. అరిచారు. ఆక్రోశించారు.

ఒక్క డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి మాత్రమే అర్చకుల ఆక్రందనకి స్పందించారు. 2004 ఎన్నికల ప్రణాళికలో ఈ వాగ్దానాన్ని చేర్చారు. ఆ ఎన్నికల్లో గెలిచారు. గెలిచాక మళ్ళీ అనేక సార్లు సౌందరరాజన్ గారూ, ఆయన కుమారుడు రంగరాజన్ గారూ సెక్రటేరియట్ చుట్టూ తిరిగారు.

2006లో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు అప్పటి రెవెన్యూ (ఎండోమెంట్) కార్యదర్శి డాక్టర్ ఐ.వి.సుబ్బారావు గారిని పిలిచి చెప్పారు. "ఇరవయ్యేళ్ల క్రితం నాటి దేవాదాయ చట్ట సవరణని రద్దు చేస్తూ, అర్చకుల ప్రయోజనాలు కాపాడేలా కొత్త సవరణ తీసుకువచ్చి తీరాలి.... నేను వాళ్లకి వాగ్దానం చేశాను. మాట తప్పానని నాకు మాట రాకూడదు...."

డాక్టర్ సుబ్బారావు గారు తక్కువ మాట్లాడుతూ ఎక్కువ పని చేసే, చిత్త శుద్ధి, నిజాయితీ కల అధికారి. ఏడాదిపాటు అర్చకుల సంఘాలన్నింటితో మాట్లాడారు. అనుభవజ్ఞులైన దేవాదాయశాఖ పాత, ప్రస్తుత అధికారులతో మాట్లాడారు. తాను టి.టి.డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేసినప్పటి అనుభవాల్ని ఈ సమాచారంతో క్రోడీకరించారు. చాలా శ్రమించారు. (2018-19 కాలంలో డా.ఐ.వి.సుబ్బారావు ఉపరాష్ట్రపతికి కార్యదర్శిగా వున్నారు)

చివరికి 2007లో 1987 నాటి చట్టాన్ని సవరిస్తూ, శాసన సభ ఒక కొత్త చట్టాన్ని (చట్ట సవరణ) తెచ్చింది. దాని ప్రకారం వంశపారంపర్య అర్చకత్వం అర్చకులకు ఒక బాధ్యత. వాళ్లకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనీ, పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలనీ, అర్చక శ్రేయోనిధి ఏర్పాటు చేయాలనీ...... ఇలాంటి అనేక కొత్త అంశాలతో ఆ చట్టం వచ్చింది.

ఇరవయ్యేళ్లుగా పోరాడి అలసిపోయిన అర్చకులంతా డాక్టర్ రాజశేఖరరెడ్డి గారిని హైద్రాబాద్‌లోని తిరునిలయంలో 2007 డిశంబరు 15 తేదీనాడు అత్యంత ఘనంగా సత్కరించి, తమ కృతజ్ఞత చాటుకున్నారు.

దానికి రెండు రోజుల ముందు, సిఎం ముఖ్యకార్యదర్శి సుబ్రహ్మణ్యం నాకు ఫోన్ చేశారు. "అర్చక సంఘాల సత్కార సభలో మాట్లాడేందుకు సిఎంకి ప్రసంగాంశాలు కావాలి. బాగా వుండాలని సిఎం మీకు చెప్పమన్నారు. మీరే ఆ రోజు సిఎంగారికి ఇచ్చేయచ్చు...." అన్నారు. రాసి పంపించాను.

ఆ సభలోకి వెళ్లాక ముఖ్యమంత్రి ఆ ప్రసంగాంశాలని ఒక్కసారి చూసుకున్నారు. ప్రసంగించేశారు. అర్చకులంతా లేచి నిలబడి, కరతాళ ధ్వనులతో ముఖ్యమంత్రిని అభినందిస్తూ, ఆశీర్వచనాలు పలికారు. నేను అక్కడికి వెళ్లటం వీలుపడలేదు.

తరువాత సుబ్రహ్మణ్యం గారికి ఫోన్ చేసి అడిగాను. "ప్రసంగాంశాలు ఎలా వచ్చాయి?"

"సిఎంగారు మీరు రాసిన అంశాలని చాలావరకు వాడుకున్నారు. వల్లీశ్వర్ గ్రామాల్లో అంతా చూసినట్లు రాశాడయ్యా– అన్నారు" అని అభినందించారు డాక్టర్ సుబ్రహ్మణ్యం.

ఆ నాటి ముఖ్యమంత్రి ప్రసంగాంశాలలో ముఖ్యమైనవి కొన్ని :

*....నా చిన్నతనంలో మా వూళ్లోగాని, చుట్టప్రక్కల గ్రామాల్లో గానీ ఎవరికన్నా జబ్బు చేస్తే వెంటనే "పూజారిగారి దగ్గరకు తీసుకెళ్ళండి" అనేవారు. ఆ రోజుల్లో అక్షరాభ్యాసం దగ్గర్నుంచి ఆయుర్వేద వైద్యం దాకా అనేక సలహాల కోసం అర్చకుల దగ్గరకే వెళ్ళేవాళ్లం. మా అమ్మ నన్ను చాలా సార్లు అయ్యవారి దగ్గరకు తీసుకెళ్లటం జ్ఞాపకం వుంది.*

*....గుడిలో అర్చకత్వం వారికి ఒక సాంఘిక హోదా మాత్రమే. నిజానికి ఇప్పటికీ అనేక గ్రామాల్లో శుభమైనా, అశుభమైనా – ఇల్లుకట్టాలన్నా, చూరు విప్పాలన్నా, చివరికి పాడిగేదెను ఇంటికి తెచ్చుకోవాలన్నా, మంచీచెడూ తెలుసుకోవడం కోసం గుడి అర్చకుల దగ్గరకే గ్రామస్థులు వెళ్తుంటారు.*

*దురదృష్టవశాత్తూ – ఇరవయ్యేళ్ళ క్రితం అమల్లోకి వచ్చిన దేవాదాయ ధర్మాదాయ చట్టం రాష్ట్రంలోని 33 వేల హిందూ దేవాలయాల్లో అర్చక వ్యవస్థని నిర్వీర్యం చేస్తూవుంటే ప్రేక్షకుడిలా చూస్తూ వుండిపోయినవాళ్లలో నేనూ ఒక్కణ్ణి.*

*....2004 మే 14న మా ప్రభుత్వం ఏర్పడితే, అదే సంవత్సరం అక్టోబరు 4న ఈ 1987 నాటి చట్టం సవరణ ఆవశ్యకత గురించి ఒక అఖిలపక్షం సమావేశాన్ని అప్పటి దేవాదాయ శాఖా మంత్రి శ్రీ సత్యనారాయణ రావు గారి సారథ్యంలో నిర్వహించాం.*

*....ముఖ్యంగా చిలుకూరు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ 1987 నాటి చట్టం దుష్ప్రభావం గురించి నూరిపోస్తూ, తన పోరాటం కొనసాగిస్తూ కూడా మా ప్రయత్నాలపట్ల విశ్వాసంతో, సహనంతో, ఆశతో, చట్ట సవరణ కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తూ వచ్చిన ప్రొఫెసర్ సౌందర రాజన్ గారిని, వారబ్బాయి రంగరాజన్ గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఈ చట్ట సవరణ విషయంలో సుబ్బారావుగారి కృషిని కూడా మనందరం అభినందించాలి.*

....ఇప్పుడు చట్టసవరణ మీ అర్చక పాత్రని సుస్పష్టం చేస్తోంది. 'ప్రభుత్వ అలసత్వం కారణంగా ధూప, దీప, నైవేద్యాలు సక్రమంగా కొనసాగించలేకపోతున్నాం' అనే మాట ఇకమీదట రాష్ట్రంలో ఏ ఆలయంలోనూ వినపడకూడదన్న లక్ష్యంతోనే ఈ రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం.

"నేను వృద్ధుణ్ణైపోతే ఎలాగ?" అని బెంగపడకుండా, సంభావనా పింఛన్లు ఇచ్చేందుకు సంక్షేమనిధిని ఏర్పాటు చేస్తున్నాం.

....పల్లెల్లో అల్పాదాయం వచ్చే ఆలయాలలో అర్చకులకి, సిబ్బందికి జీతాలు సక్రమంగా చెల్లించబడేలా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నాం. వివిధ దేవాలయాల్లో ఆయా పరిస్థితులకు తగిన విధానంలో అర్చకులకు వచ్చే ఆదాయం పెరిగేలా చట్టంలో అవకాశం కల్పించాం.

....ఎప్పటికప్పుడు మీ అవసరాలను, భక్తుల అవసరాలను కనిపెట్టి, వాటిని పరిష్కరించడం, భక్తి ప్రపత్తులు పెంచేలా కార్యక్రమాలను రూపొందించటం వగైరా విధులతో, విస్తృత అధికారాలతో పనిచేసే ఒక ధార్మిక పరిషత్తు ఏర్పాటుకు చట్టంలో స్థానం కల్పించాం.

* * *



'ఆంధ్రప్రదేశ్' పత్రిక ఇంగ్లీషులో ప్రారంభించిన సందర్భంలో మంత్రి రామనారాయణ రెడ్డి, సిఎం వైయస్సార్, సమాచారశాఖ కమీషనర్ సి.పార్థసారథిలతో

# వ్యూహరచనలో వైయస్సార్‌తో......

**2008 డిశంబరు మూడవవారం ఆరంభంలో....**

తెల్లవారు ఝామున పత్రికలు చదువుతుంటే 'తెలుగుదేశం' ప్రచార వ్యూహం – అనే వార్త కనుపించింది. 2009 మార్చి ఎన్నికలకి ప్రచార వ్యూహాన్ని 'తెలుగు దేశం' పార్టీ రచిస్తోందని ఒక పత్రిక రాసింది.

మరి, మనమేం చేయాలి? ముఖ్యంగా ముఖ్యమంత్రి కోసం నేనేం చేయగలను?.... ఆలోచిస్తుంటే, ఒక చిట్కా మెరుపులా తట్టింది.

ఎనిమిదిన్నరకల్లా క్యాంపు ఆఫీసుకి వెళ్లాను. సందర్శకులందర్నీ చూసుకుంటూ సిఎం తన ఆఫీసులోకి వెళ్లగానే వెనకాలే వెళ్లాను.

"యస్ సర్, ఏమిటి సంగతి." అన్నారు సిఎం (ఆయనకి ప్రేమ ఎక్కువైనప్పుడు ఎవర్నయినా అలా అంటుంటారు.)

"సర్, 2009 ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. నాకో ఆలోచన వచ్చింది. రెండు నిమిషాలు ఇవ్వాలి మీరు....."

"ఓ.కె" అన్నారు. ఒక ఐదునిమిషాలు పట్టింది – నేను చెప్పాల్సింది చెప్పి, ఆయన ఆనందించి, ఆమోదించేసరికి.

నేనేం చెప్పానంటే –

'రాజీవ్ ఆరోగ్యశ్రీ' క్రింద ఆపరేషన్లు చేయించుకున్న వాళ్ల సంఖ్య అయిదు లక్షలు దాటింది, లేదా దాటుతోంది. వీళ్లందరి డేటా మీ ప్రైవేటు సెక్రటరీ కిరణ్‌కుమార్‌రెడ్డి దగ్గర వుంది.... వీళ్లందరికీ మీ నుంచి ఒక లెటర్ వెళ్తుంది. ఆ లెటర్ కవర్ మీద వాళ్ల పేరు, చిరునామా ముద్రించి పోస్టు చేస్తాం.... అది పైకి చూడటానికి క్రిస్మస్ – సంక్రాంతి గ్రీటింగ్స్ లేఖలాగా కనుపిస్తుంది. చదివాక మాత్రం, ఆరోగ్యశ్రీ ప్రయోజనం పొందిన ఆ లబ్ధిదారుడి గుండెని స్పృశిస్తుంది. ముఖ్యమంత్రి అంతటి వ్యక్తి గుర్తుంచుకొని తనకు లెటర్ పంపాడంటే ఆ లబ్ధిదారుడు లేదా లబ్ధిదారురాలు బ్రహ్మానందపడతారు. ఆ లెటర్‌ని తన గ్రామంలో,

తన పేటలో కనీసం 10–20 మందికి చూపించుకుంటాడు. కొంత మంది ఆ లెటర్‌ని ఫ్రేమ్‌కట్టించుకుని దాచుకుంటారు..... సర్, వాళ్లు ఎంతమందికి ఆ లెటర్ చూపిస్తారో, అంతమంది ఓటర్లని మీ లెటర్‌లోని మానవతాస్పర్శ ఎన్నికలలో ప్రభావితం చేస్తుంది. అంటే, దాదాపు కోటి మంది ఓటర్లమీద ఈ లెటర్ ప్రభావం వుంటుంది. కాని, ఆ లెటర్‌లో ఎక్కడా, ఎన్నికల ప్రస్తావన వుండదు....."

"ఎక్స్‌లెంట్ వల్లీశ్వర్. Go ahead" అన్నారు సిఎం లేచి ఆప్యాయంగా నా భుజం తట్టారు.

మరో మూడు రోజుల్లో కిరణ్‌కుమార్ రెడ్డి సాయంతో, సమాచార శాఖ కమీషనర్ పార్థసారథి సాయంతో ఆ లెటర్‌లన్నీ పోస్టు అయ్యేలా చూశాను.

ఆ లెటర్‌లో ఏముందంటే......



డిసెంబర్ 18, 2008.

మిత్రమా !

బాగున్నారా?

మీ ఇంట్లో అందరూ కులాసాయేనా?

మీ కుటుంబంలో వైద్య సహాయం అవసరమై మీరు 'ముఖ్యమంత్రి సహాయనిధి' / 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' నిధి నుంచి సహాయం కోరినప్పుడు మీ కుటుంబానికి సహాయపడే సంకల్పాన్ని, అవకాశాన్ని నాకు భగవంతుడు ప్రసాదించాడు. అందుకే మీరు నాకు ఆ దైవం ప్రసాదించిన ఆత్మబంధువులయ్యారు.

కల్మషంలేని కేరింతలలో మునిగితేలే పిల్లలూ...

వార్ధక్యాన్ని మర్చిపోయి ఉల్లాసంగా, ఉత్సాహంగా మనుమలతో గడిపే వృద్ధులూ...

నిన్నటి తరానికీ, రేపటి తరానికీ వారధులుగా నిలిచే మీ కుటుంబ సభ్యులూ...

...ఇలా మీ ఇంట్లోని ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం, ఆయుర్దాయం ప్రసాదించాలని

క్రిస్‌మస్ - సంక్రాంతి

పండుగల సందర్భంగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

గుండెనిండా శాంతి, కళ్లనిండా సంతోషం తొణికిసలాడేలా

ఈ 2009 సంవత్సరం

మీ ఇంటిల్లిపాదికీ సుఖసంతోషాలను పంచాలని

మనసారా కోరుకుంటున్నాను.

మీ

వై.యస్.రాజశేఖర రెడ్డి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

* * *

# వైయస్సార్ వెనక్కి వచ్చారు!

**2009 మే 16....**

జాతీయ స్థాయిలో జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి.

మధ్యాహ్నం 12 గంటలు దాటేసరికి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 150 కి దగ్గరగా అటూ ఇటూ ఫలితాలు ఊగిసలాడుతున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ (యు.పి.ఏ)కి 250 దాటుతున్నాయి.

వెంటనే ఒక లెటర్ తయారు చేశాను. ఆ లెటర్ పూర్తయ్యేసరికి ఒంటిగంట అయింది. క్యాంప్ ఆఫీసులో వున్న సిఎం పి.ఎస్ భాస్కర శర్మకి ఫోన్ చేశాను.

“సిఎం గారు ఎక్కడున్నారు స్వామీ?”

“కొద్ది సేపట్లో ఇంటికి భోజనానికి వస్తున్నారు....”

“అయితే, మీకు ఒక లెటర్ మెయిల్లో పంపిస్తున్నాను. ఇది సిఎంగారు సోనియాగాంధికి ఈ పూటే పంపాల్సిన లెటర్. సర్ రాగానే, ఇంట్లోకి వెళ్లకముందే లెటర్‌హెడ్ మీద ప్రింట్ తీసి చూపించండి. ఆయన ‘ఓకె’ అంటే మిగతాపని మీరు చేసేయండి. ఏవన్నా సవరణలు చెబితే నాకు ఫోన్ చేయండి....”

“Done సర్” అన్నారు భా.శ.జీ (నాకిలా ప్రేమగా పిలవడం అలవాటు)

మళ్లీ ఓ గంట తరువాత భా.శ.జీ ఫోన్ చేశారు.

“కంగ్రాట్స్ సర్. సిఎం చదవగానే సంతకం పెట్టేశారు. వెంటనే మేడమ్‌కి ఫ్యాక్స్‌లో / ఇమెయిల్‌లో పంపించేయమన్నారు. ఒరిజినల్ లెటర్‌ని ఎక్స్‌ప్రెస్ కొరియర్ చేసేయమన్నారు. సూపర్ సర్....” అన్నారు శర్మ.

అప్పటికి రాష్ట్రంలో శాసనసభలో కాంగ్రెస్‌కి 156 దాకా వచ్చేశాయి. నేను ఇంక నా ‘ఆంధ్రప్రదేశ్’ పత్రిక పనిలో మునిగిపోయాను.

సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సిఎం క్యాంపు ఆఫీసుకి వెళ్లాను. రాజశేఖరరెడ్డిగారు గాంధీభవన్‌లో విజయోత్సవ సంబరాల నుంచి ఇంకా రాలేదు. ఆయన్ని అభినందించాలని నగరంలోని వ్యాపార ప్రముఖులు, మాజీ ఎం.పిలు క్యాంపు ఆఫీస్‌లో లాంజ్ – Iలో, లాంజ్ – II లో నిరీక్షిస్తున్నారు.

6.30 గంటలు దాటుతుండగా సిఎం వచ్చారు. తన ఛాంబర్‌లోకి వెళ్లి మొహం మీద తల మీద సంబరాల తాలూకు రంగులు కడుక్కుని బయటకు రాగానే, అక్కడ అభినందనలు తెలపటానికి సిఎం కార్యాలయ అధికారులంతా క్యూ కట్టారు. ముఖ్యకార్యదర్శి జన్నత్ హుస్సేన్, ఇంటెలిజెన్స్ అరవిందరావుగారు, ఇతర కార్యదర్శులూ, స్పెషల్ ఛీఫ్ సెక్రటరీలు.....

నేను ఆ లైన్‌లో చివర – లాంజ్ I లోకి వెళ్ళే మలుపు దగ్గర కుడివైపుగా నిలబడి వున్నాను.

సిఎం అందరి దగ్గరా పుష్పగుచ్ఛాలు, అభినందనలు తీసుకుంటూ నా దాకా వచ్చే లోపల కొత్త ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వెస్లీ నా ముందుకొచ్చి అడ్డంగా నిలబడ్డారు. నేను అలాగే వుండిపోయాను. సిఎం వచ్చేశారు. అందరూ ఆయన్ని అభినందిస్తున్నారు. వెస్లీ కూడా అభినందనలు తెలిపాక, ఆయన ఎడమ ప్రక్కకి తిరిగి మళ్ళీ కుడివైపు లాంజ్ – I లోకి అడుగుపెట్టబోతుండగా నన్ను గమనించారు.

చటుక్కున రెండు అడుగులు వెనక్కి నడిచారు, నా దగ్గరకు వచ్చి, వెస్లీ ప్రక్క నుంచి చేయిచాచి నాకు కరచాలనం చేశారు. అభినందించారు.

"ఆ లెటర్ Excellent వల్లీశ్వర్. Very timely....." అంటూ (అందరూ విస్మయంగా చూస్తుండగానే) చిరునవ్వుతో నా భుజం తట్టి లాంజ్ – I లోకి వెళ్లిపోయారు.


2:00 PM

Dt May 16, 2009

Hearty congratulations on the historic victory of the Congress party under your exemplary leadership in these elections.

I find no words to express my gratitude to you for guiding and leading us in these elections also ensuring continuance of the Congress party in power, **on its own,** in Andhra Pradesh.

I am sure the United Progressive Alliance Government with your unstinted support will usher in a new era of long lasting grandeur in the annals of independent India. I once again assure that Andhra Pradesh will continue to contribute to your massive efforts in achieving the same.

Y S RAJASEKHARA REDDY

* * *

# ‘రచ్చబండ’ నుంచి తిరిగొచ్చాక

“రచ్చబండ నుంచి తిరిగొచ్చాక” అన్నారు.

‘ఆంధ్రప్రదేశ్’ మాసపత్రికకు ప్రధాన సంపాదకుడిగా నన్ను 2005 జూన్ 9న రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. నిజానికి ముఖ్యమంత్రి ఆదేశం, సమాచారశాఖ కమీషనర్ కె.వి. రమణాచారి చొరవ నాకు ‘ఆంధ్రప్రదేశ్’ పత్రిక బాధ్యతను అప్పగించాయి.

అప్పట్లో సంపాదకురాలిగా గొట్టిపాటి సుజాత వుండేవారు. ఆమెది కష్టపడి పనిచేసే తత్త్వం. మొదట్లో నాకు పెద్దగా పని వుండేది కాదు. అంతా ఆమే చూసుకునేది. కొద్ది మాసాల తరువాత ఆమె వేరే పోస్టుకి బదిలీ అయ్యారు. అక్కడ్నుంచి మొత్తం బాధ్యత నా మీద పడింది.

సిఎం నాకు చెప్పినదాని ప్రకారం ‘ఆంధ్రప్రదేశ్’ పత్రిక నాకు పరికరం మాత్రమే. నేను పని చేయాల్సింది ప్రధానంగా ముఖ్యమంత్రి కోసం. ఆయన రాజకీయ ప్రసంగాలు తప్ప మిగతా అన్ని సమావేశాల్లో, సభల్లో, ప్రభుత్వ పరమైన స్వాతంత్ర్య దినోత్సవం, రాష్ట్ర అవతరణ దినోత్సవం వంటి అన్ని సందర్భాలకూ ఆయన ప్రసంగాలను తయారు చేయటం, జాతీయ స్థాయిలోనాయకులకి రాయాల్సిన రాజకీయ లేఖలు తయారు చేయడం వంటి కమ్యూనికేషన్స్ అన్నీ నా బాధ్యతలో భాగమే. అంటే, సిపిఆర్ఓగా వున్నప్పటి పనుల్లో ఒక్క మీడియా వ్యవహారాలు తప్ప చాలా వరకు ఇతర బాధ్యతలన్నీ నేనే నిర్వహించాల్సి వుండేది. ఆర్థిక వ్యవహారాల మీద ప్రసంగాలు, లేఖలు మాత్రం ప్రభుత్వ సలహాదారు సోమయాజులు గారు చూసుకునే వారు.

‘ఆంధ్రప్రదేశ్’ పత్రిక సర్క్యులేషన్‌ని 10 వేల నుంచి 40 వేలకు పెంచటం, జిల్లాల్లో విడిప్రతుల అమ్మకాన్ని పెంచటం వంటి కొన్ని మంచి పనులు చేయటానికి సమాచారశాఖకమీషనర్లు కె.వి. రమణాచారి, సి. పార్థసారథి, బి. వెంకటేశం, ఆర్.వి. చంద్రవదన్, దాన కిశోర్, రమణారెడ్డిలు నాకు చాలా ప్రోత్సాహమిచ్చారు.

ప్రతినెలా ‘ఆంధ్రప్రదేశ్’ ప్రచురితంకాగానే ఒక ప్రతిని సీల్డ్ కవర్‌లో సిఎంకి పంపుతుండే వాణ్ణి. లేదా స్వయంగా తీసుకెళ్లి ఇస్తుండేవాణ్ణి. ఆయన ఓపిగ్గా అన్ని వ్యాసాలూ

చదివి, ఎక్కడైనా అంకెల్లో తేడాలుంటే, సవరణలు మార్క్ చేసి పంపేవారు. మంచివ్యాసాల మీద 'గుడ్' అని రాసేవారు.

క్రమంగా బయట ఎక్కడన్నా తారసపడ్డ అధికారులు సయితం – "మొన్న మీటింగ్‌లో సిఎం గారు మా సంస్థ గురించి 'ఆంధ్రప్రదేశ్' లో వచ్చిన వ్యాసాన్ని ప్రస్తావించారు – అనో, 'మీరు ఇంతమంచి పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్'లో రాలేదేంటి?" అని అడిగారు అనో..... ఇలా ఏదో ఒక ప్రస్తావన చేస్తుండేవారు. అంటే ప్రతిసంచికనీ సిఎం చదువుతున్నారన్న మాట.

నేను పూర్తిగా 'ఆంధ్రప్రదేశ్' మీద దృష్టి పెట్టాను. దాన్ని ఒక సాహితీ పత్రికగా ఉత్తమ ప్రమాణాలతో తీసుకువచ్చేందుకు శ్రమించాను. 'ఆంధ్రప్రదేశ్' ఇంటర్నెట్ ఎడిషన్ ప్రారంభించాం.

ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి గురించి దేశమంతా తెలియాలని 2007లో 'ఆంధ్రప్రదేశ్' ఇంగ్లీషు ఎడిషన్ ప్రారంభించాం. ఆ ఇంగ్లీషు పత్రిక ప్రారంభించిన రోజున సిఎం అడిగారు. "ఈ పత్రిక ఎవరెవరికి పంపుతారు వల్లీశ్వర్?"

ఒక జాబితా ఆయన చేతికిచ్చాను. అందులో – కేంద్రప్రభుత్వ మంత్రివర్గం, క్యాబినెట్ సెక్రటరీ, అన్ని శాఖల కార్యదర్శులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, అన్ని హైకోర్టుల న్యాయమూర్తులూ, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ప్రధాన కార్యదర్శులు, అన్ని జాతీయ స్థాయి పత్రికల సంపాదకులు, ప్రముఖ ప్రాంతీయ దినపత్రికల సంపాదకులు, కాలమిస్టులు, టి.వి ఛానళ్ల ఎడిటర్లూ, ప్రధాన దేశాల రాయబారులూ, అందరు పార్లమెంటు సభ్యులూ..... ఈ జాబితాలోనే దాదాపు వెయ్యి మంది వున్నారు. "ఈ రాష్ట్రంలో ఏం జరుగుతున్నదీ దేశంలో ఎవరెవరికి తెలియటం అవసరమో వాళ్లందరికీ పంపిస్తున్నాను" అన్నాను.

'ఆంధ్రప్రదేశ్' పత్రిక విలువ తెలిసి, ప్రోత్సహించిన తొలి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారే కావచ్చు. ఎప్పుడు 'ఆంధ్రప్రదేశ్'కి ప్రత్యేక ఇంటర్వ్యూ కావాలన్నా – "నువ్వు రాసి పంపించు. నాకు నచ్చని చోటల్లా మార్పులు చేసి పంపిస్తా" అనేవారు. అలాంటి మార్పులు ఎప్పుడూ కనబడలేదు. చిన్న చిన్న అచ్చు తప్పులు దిద్దేవారు. చివర్లో సంతకం చేసేవారు.

'ఆంధ్రప్రదేశ్' పత్రిక అభివృద్ధి చెందటానికి ఆయనకున్న ఆసక్తే కారణం. సిఎంకి ఇష్టమైన పత్రిక అనగానే అధికారులు కూడా సహకరిస్తారు కదా! అలాగే నడిచిపోయింది.

చివరికి 2009లో సాధారణ ఎన్నికలు జరిగిన మూడు మాసాలకి నేను ఒకప్రతిపాదన తయారు చేశాను. దాని ప్రకారం 'ఆంధ్రప్రదేశ్' పత్రికని ప్రతిపల్లెలోని పంచాయతీ గ్రంథాలయం దాకా తీసుకువెళ్ళాలి. ఆ ప్రతిపాదనతో సెప్టెంబరు 1 సాయంత్రం రాజశేఖరరెడ్డి గారి కార్యాలయంలో కలిశాను. ఆ రోజు చివరి విజిటర్ నేనే. సెప్టెంబరు సంచిక ఆయన చేతికిచ్చాను.

పత్రిక ఆసాంతం తిరిగేశారు. "నీ ఐడియా బాగుంది. నేను 'రచ్చబండ' కార్యక్రమం నుంచి తిరిగి రాగానే గుర్తు చేయి..." ఆయనతో అలా మాట్లాడుతూ కారు దాకా వెళ్లాను. ఆ తరువాత మళ్లీ ఆయన సెక్రటేరియట్‌కి తిరిగి రాలేదు.

మానవత, విజ్ఞత, సంస్కారం, సమర్థత కల వైయస్సార్ అనే శక్తిని చూడటం అదే చివరిసారి అవుతుందని నేనూ ఊహించలేదు.

* * *



*'ఆంధ్రప్రదేశ్' పత్రికను ఆసక్తిగా చూస్తున్న డా. వైయస్సార్*

## ‘సి’ బ్లాకులో చివరి క్షణాల్లో ‘ఆంధ్రప్రదేశ్’తో...

2009 సెప్టెంబరు 1... సాయంత్రం 6 గంటల ప్రాంతంలో...

నేను నా అలవాటు ప్రకారం ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారికి ‘ఆంధ్రప్రదేశ్’ సెప్టెంబరు సంచిక చూపించాలని సెక్రటేరియట్లో ‘సి’ బ్లాకులోని ఆయన కార్యాలయానికి వెళ్ళాను. సమాచార శాఖ మంత్రి శ్రీమతి గీతారెడ్డి ముఖ్యమంత్రిని కలిసి వెళ్ళాక, అడిషనల్ పి.ఎస్. నరసింహాచారి నన్ను ముఖ్యమంత్రి దగ్గరకి తీసుకువెళ్లారు.

‘ఆంధ్రప్రదేశ్’ సెప్టెంబరు సంచిక ముఖచిత్రం వంక ముఖ్యమంత్రి తదేకంగా చూశారు. సంచిక వెనక్కి తిప్పి, ‘రంజాన్ శుభాకాంక్షలు’ ఫొటో చూశారు.

చిరునవ్వు నవ్వుతూ, “బాగుంది” అన్నారు. మొత్తం సంచికలో పేజీలన్నీ ఒకసారి అటూఇటూ తిరగేశారు.

“ఆంధ్రప్రదేశ్ పత్రిక చాలా బాగా వస్తోంది వల్లీశ్వర్. నాకు చాలామంది ఫ్రెండ్స్ కూడా ఇదే చెబుతున్నారు”.

“మీరు పూర్తిగా చదువుతున్నారా సర్?”

“ఆ .. మా ఇంట్లో అందరూ చదువుతారు. నేను మాత్రం నాకు ఆసక్తి వున్న విషయాలనే చదువుతున్నాను. క్వాలిటీ చాలా మెరుగు పర్చావు... గుడ్ వర్క్ ...”

అంతలో ప్రధానమంత్రి తిరుపతి పర్యటనకి సంబంధించి ఢిల్లీ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. సిఎం లోపలికి వెళ్ళారు. ఫోన్ మాట్లాడి వచ్చాక మళ్ళీ ‘ఆంధ్రప్రదేశ్’ పత్రిక గురించి సిఎంగారి సంభాషణ కొనసాగింది.

“ఇంకా?”

“ప్రతి మారుమూల పంచాయతీకి ‘ఆంధ్రప్రదేశ్’ చేరేలా చేయాలి సర్. ఇందుకోసం కమీషనర్ పార్థసారథి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇందులో సబ్సిడీ భారం పెరుగుతుంది కాబట్టి ఫైనాన్స్ క్లియరెన్స్ సులభంగా జరగదు. మీరు ... ”

“తప్పకుండా చేద్దాం. ఈ ఖరీఫ్‌లో కరవు పరిస్థితుల దృష్ట్యా మనం పొదుపు చర్యలు పాటిస్తున్నాం కదా. ఈ సీజన్ దాటిపోయాక టేకప్ చేద్దాం ... ఆల్‌రైట్! పిల్లలెలావున్నారు? ఎక్కడ వున్నారు?.....” అంటూ మాట్లాడారు.

“వస్తాను సర్”

“ఆంధ్రప్రదేశ్ కాపీలు సూరీడుకిచ్చి వెళ్ళు. రేపు ప్రొద్దున హెలికాప్టర్లో చదువుకుంటాను.”

“అలాగే సర్”

నేను బయటకొచ్చాక ‘ఆంధ్రప్రదేశ్’ పత్రిక కాపీలు ఒక కవరులో పెట్టి సూరీడుకిచ్చాను. .

“సిఎం గారు హెలికాప్టర్లో చదువుతానన్నారు” అన్నాను.

“సారు ఇంట్లో కూడా చదువుతుంటాడు ...” అన్నాడు సూరీడు.

నేను ఇవతలకొచ్చాక లిఫ్ట్ ముందర సిఎం గారి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం కలిశారు. ‘ఆంధ్రప్రదేశ్’ తీసుకుని పేజీలు తిప్పుతూ మాట్లాడుతున్నారు.

“రేపు సిఎం గారితో ‘రచ్చబండ’కి వెళ్తున్నాను. తిరిగొచ్చాక ఓసారి కలుద్దాం. ఓ విషయం చర్చించాల్సి వుంది” అన్నారు. అలా మాట్లాడుకుంటున్నాం.

అప్పుడే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్ రెడ్డి కూడా అక్కడకు వచ్చారు.

“గురూజీ బాగున్నారా?” అంటున్నారు.

ఇంతలో సిఎం గారు తన ఛాంబర్లోంచి బయటకు వచ్చేశారు. ఆయనతోపాటు నేనూ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సి. ఎస్.ఓ రమేష్, సూరీడు, అడిషనల్ పి.ఎస్.లు భాస్కరశర్మ, నరసింహాచారి కలిసి లిఫ్ట్‌లో క్రిందకు దిగాం. సిఎం గారితో కారు దాకా వెళ్ళాం.

రాజశేఖరరెడ్డిగారు కారు ఎక్కుతుండగా శాసనసభ్యులు డి.ఎల్. రవీంద్రారెడ్డి వచ్చి ఆయనతో రెండు మాటలు మాట్లాడి వెళ్ళారు.

డాక్టర్ రాజశేఖరరెడ్డి, ఆయనతో పాటు ఆ కారులో ఎక్కిన డాక్టర్ సుబ్రహ్మణ్యం మళ్ళీ ‘సి’ బ్లాకుకి రాలేదు.

మర్నాడు ఉదయం ఇంటినుంచే నేరుగా బేగంపేట ఎయిర్ పోర్ట్ కి వెళ్ళి హెలికాప్టర్ ఎక్కారు. మరి దిగలేదు !!

**– వల్లీశ్వర్**

*'ఆంధ్రప్రదేశ్' ప్రధాన సంపాదకులు*

## ('ఆంధ్రప్రదేశ్' పత్రిక నుండి)

**సెప్టెంబరు 1 . . . సాయంత్రం 5 గంటల ప్రాంతంలో . . .**

**నేను నా అలవాటు ప్రకారం ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారికి 'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబరు సంచిక చూపించాలని సెక్రటేరియెట్‌లో 'సి' బ్లాకులోని ఆయన కార్యాలయానికి వెళ్ళాను. సమాచార శాఖ మంత్రి శ్రీమతి గీతారెడ్డి ముఖ్యమంత్రిని కలిసి వెళ్ళాక, అడిషనల్ పి.ఎస్. శ్రీ నరసింహాచారి నన్ను ముఖ్యమంత్రికి కలిపారు.**

'ఆంధ్రప్రదేశ్' సెప్టెంబరు సంచిక ముఖచిత్రం 'మహిషాసుర మర్దిని' వంక ముఖ్యమంత్రి తదేకంగా చూశారు. సంచిక వెనక్కి తిప్పి, 'రంజాన్ శుభాకాంక్షలు' ఫొటో చూశారు.

చిరునవ్వు నవ్వుతూ, "బాగుంది" అన్నారు. మొత్తం సంచికలో పేజీలన్నీ ఒకసారి అటూఇటూ తిరగేశారు.

"ఆంధ్రప్రదేశ్ పత్రిక చాలా బాగా వస్తోంది వల్లీశ్వర్. నాకు చాలామంది ఫ్రెండ్స్ కూడా ఇదే చెబుతున్నారు".

"మీరు పూర్తిగా చదువుతున్నారా సర్?"

"ఆ . . మా ఇంట్లో అందరూ చదువుతారు. నేను మాత్రం నాకు ఆసక్తి వున్న విషయాలనే చదువుతున్నాను. క్వాలిటీ చాలా మెరుగు పర్చారు . . . గుడ్ వర్క్ . . ."

# 'సి' బ్లాకులో చివరి క్షణాల్లో 'ఆంధ్రప్రదేశ్'తో . . .

అంతలో ప్రధానమంత్రి తిరుపతి పర్యటనకి సంబంధించి ఢిల్లీ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. సి.ఎం. లోపలికి వెళ్ళారు. ఫోన్ మాట్లాడి వచ్చాక మళ్ళీ 'ఆంధ్రప్రదేశ్' పత్రిక గురించి సి.ఎం.గారి సంభాషణ కొనసాగింది.

"ఇంకా?"



'ఆంధ్రప్రదేశ్' స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణలో . . .



'ఆంధ్రప్రదేశ్' ఇంగ్లీషు సంచిక ప్రారంభోత్సవంలో . . .

"ప్రతి మారుమూల పంచాయతీకి 'ఆంధ్రప్రదేశ్' చేరేలా చేయాలి సర్. ఇందుకోసం కమీషనర్ పార్థసారథి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇందులో సబ్సిడీ భారం పెరుగుతుంది కాబట్టి ఫైనాన్స్ క్లియరెన్స్ సులభంగా జరగదు. మీరు . .. "

"తప్పకుండా చేద్దాం. ఈ ఖరీఫ్‌లో కరవు పరిస్థితుల దృష్ట్యా మనం పొదుపు చర్యలు పాటిస్తున్నాం కదా. ఈ సీజన్ దాటిపోయాక టేకప్ చేద్దాం . . . ఆల్‌రైట్!"

"వస్తాను సర్"

"ఆంధ్రప్రదేశ్ కాపీలు సూరీడుకిచ్చి వెళ్ళు. రేపు ప్రొద్దున హెలికాప్టర్‌లో చదువుకుంటాను."

"అలాగే సర్"

నేను బయటకొచ్చాక 'ఆంధ్రప్రదేశ్' పత్రిక కాపీలు ఒక కవరులో పెట్టి సూరీడుకిచ్చాను.

"సి.ఎం. గారు హెలికాప్టర్‌లో చదువుతానన్నారు" అన్నాను.

"సారు ఇంట్లో కూడా చదువుతుంటాడు . . ." అన్నాడు సూరీడు.

నేను ఇవతలకొచ్చాక లిఫ్ట్ ముందర సి.ఎం.గారి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం కలిశారు. 'ఆంధ్రప్రదేశ్' తీసుకుని పేజీలు తిప్పుతూ మాట్లాడుతున్నారు.

"రేపు సి.ఎం. గారితో 'రచ్చబండ'కి వెళ్తున్నాను. తిరిగొచ్చాక ఓసారి కలుద్దాం. ఓ విషయం చర్చించాల్సి వుంది" అన్నారు. అలా మాట్లాడుకుంటున్నాం.

అప్పుడే ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీ రమేష్ రెడ్డి కూడా అక్కడకు వచ్చారు.

"గురూజీ బాగున్నారా?" అంటున్నారు.

ఇంతలో సి.ఎం. గారు తన ఛాంబర్‌లోంచి బయటకు వచ్చేశారు. ఆయనతోపాటు నేనూ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సి.ఎస్.ఓ రమేష్, సూరీడు, అడిషనల్ పి.ఎస్.లు భాస్కరశర్మ, నరసింహాచారి కలిసి లిఫ్ట్‌లో క్రిందకు దిగాం. సి.ఎం. గారితో కారు దాకా వెళ్ళాం.

రాజశేఖరరెడ్డిగారు కారు ఎక్కుతుండగా శాసనసభ్యులు శ్రీ డి.ఎల్. రవీంద్రారెడ్డి వచ్చి ఆయనతో రెండు మాటలు మాట్లాడి వెళ్ళారు.

డాక్టర్ రాజశేఖరరెడ్డి, ఆయనతో పాటు ఆ కారులో ఎక్కిన డాక్టర్ సుబ్రహ్మణ్యం మళ్ళీ 'సి' బ్లాకుకి రాలేదు.

మర్నాడు ఉదయం ఇంటినుంచే నేరుగా బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళి హెలికాప్టర్ ఎక్కారు.

మరి దిగలేదు ! !

**– వల్లీశ్వర్**

*'ఆంధ్రప్రదేశ్' ప్రధాన సంపాదకులు*

సెప్టెంబర్ 2009 11

* * *

# వైయస్సార్ నన్ను 'ఏడిపించారు'

**2009 సెప్టెంబరు 3**

సెప్టెంబరు ఒకటి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారిని కలిసిన చివరి విజిటర్‌ని నేనే.

ఆయనతో కలిసి 'ఆంధ్రప్రదేశ్' పత్రిక గురించి మాట్లాడుతూ ఆయన కారు దాకా వెళ్లాను.

సెప్టెంబరు 02 – రచ్చబండ కోసం ఆయన హెలికాప్టర్ ఎక్కారు. తిరిగి రాలేదు.

సెప్టెంబరు 03 – కొత్త ముఖ్యమంత్రిగా డాక్టర్ కె. రోశయ్యగారు పదవీస్వీకారం చేశారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రమాకాంతరెడ్డి గారి కార్యాలయం నుంచి నాకు కబురు వచ్చింది. అక్కడికి వెళ్లాను. సమాచారశాఖ కమీషనర్ పార్థసారథి నాకోసం ఎదురుచూస్తున్నారు.

"మరో అరగంటలో మంత్రివర్గం సిఎం రోశయ్య గారి ఆధ్వర్యంలో సమావేశం కాబోతోంది. అర్జంటుగా రాజశేఖరరెడ్డిగారి మృతికి మంత్రివర్గ సంతాప తీర్మానం ఇంగ్లీషులో తయారు చేసి, ఇమ్మని ప్రధానకార్యదర్శిగారు అడుగుతున్నారు...." అన్నారు. రమాకాంతరెడ్డి గారి ప్రైవేట్ సెక్రటరీ స్వామి నాకు అక్కడే అవసరమైన సదుపాయాలు కల్పించారు. ప్రధానకార్యదర్శి కార్యాలయంలోనే కూర్చుని సంతాప సందేశం డిటిపి చేస్తున్నాను.

గత అయిదున్నరేళ్లల్లో వైయస్సార్ పేరు మీద ఎంతో మంది జాతీయ, ప్రాంతీయ ప్రముఖుల మరణాలకు సంతాప సందేశాలు తెలుగులో, ఇంగ్లీషులో – తయారు చేశాను. మనసు పెట్టి చేశాను. ఎప్పుడూ కన్నీరు రాలేదు.

కాని ఇప్పుడు వైయస్సార్ కోసమే మంత్రివర్గ తీర్మానం తయారు చేయాల్సి వచ్చేసరికి నాకు తెలీకుండా కన్నీళ్ళు కారుతున్నాయి. స్వామి ఖంగారుపడ్డారు. "రిలాక్స్ అవ్వండి.... రిలాక్స్" అంటున్నారు. అలాగే తీర్మానం తయారు చేసి ఇచ్చేసి, వికలమైన మనస్సుతో ఇంటికొచ్చేశాను!!!

# మంత్రివర్గ సంతాప తీర్మానం

Dt. 03.09.2009

## Condolence resolution

The State Cabinet deeply mourns the sudden demise of Dr Rajasekahra Reddy and conveys it deepest sympathies to the bereaved members of his family.

The sudden demise of our most beloved Chief Minister, Dr. Y. S. Rajasekhara Reddy in a helicopter crash in Kurnool district limits on September 2 is shocking.

Dr. Rajasekhara Reddy, who turned 60 a few weeks ago, had rescued Andhra Pradesh from an imminent financial crisis and put it on the highway of development in just five years.

A doctor by training, he could feel the pulse of people and came up with innovative remedies to rid them of the many ailments plaguing them. Among the many schemes he conceived, designed and implemented are Jalayagnam, Rajiv Arogyasri, Paavala Vaddi, Abhaya Hastam, free power to farmers, INDIRAMMA, waiver of loans to handloom weavers and other artisans, reimbursement of fees in higher education to all economically weaker section students and reservations to backward Muslim minorities.

The poor and the downtrodden, women and weaker sections could open a new chapter in their lives thanks to Dr. YSR, as he is affectionately called. Dr Rajasekhara Reddy devised schemes to benefit every section of people and every region of the State. It was under his dynamic leadership that the State made a giant leap in agriculture, industry, healthcare and education.

The strides our State made during his tenure as Chief Minister not only in development, welfare and governance but also in restoring law and order earned admiration from one and all across the country.

Dr. Rajasekhara Reddy, who has been either a legislator or Member of Parliament from Kadapa district all through his political career since 1978, rendered unparalleled and unprecedented services to Andhra Pradesh and opened a golden era in its development history.

It is hard to believe that the amiable, ever smiling, friendly, visionary and workaholic Chief Minister with a human touch in every word and deed is no more. The void caused by his passing away cannot be filled.

* * *



## సంస్కారం

2005 మే 21 ...

మా ఇంట్లో వివాహం:

రిసెప్షన్‌లో మా అమ్మాయి చి. కైవల్య, అల్లుడు చి. శ్రీనివాస్‌లను ఆశీర్వదించడానికి ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.ఆర్, ఆయనతో పాటు ఆర్థిక మంత్రి డాక్టర్ కె.రోశయ్య, వైయస్సార్‌కి ఆత్మబంధువు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావు వచ్చారు.

వాళ్ళు వేదిక ఎక్కబోతుండగా నేను సిఎంతో అన్నాను:

"సర్, రోశయ్య గారు వయస్సులో మీకన్నా పెద్దవారు కదా. ముందుగా వారు పిల్లల్ని ఆశీర్వదిస్తే బాగుంటుందేమో ...!"

ఒక్క క్షణం ఆలోచించకుండా, "అవును కదా! రోశయ్య గారూ, మీరు ముందు పదండి" అన్నారు వైయస్సార్ చిరునవ్వుతో. (అదే ఈ దృశ్యం)

* * *